
బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


## యోగాతో కొత్త ఆర్థిక వ్యవస్థ

మంచుకొండల్లో, యుద్ధనౌకలపై సైనికుల ఆసనాలు

కశ్మీరంలో మోదీ : దేశవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవం

05




సంపుటి 07, సంచిక: 201 | శనివారం | 22-06-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00




# కాంగ్రెస్‌లోకి పోచారం

కండువాకప్పి ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పోచారం కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిక

మాజీ స్పీకర్ సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తాం : సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా మాజీ స్పీకర్, బిఆర్ఎస్ బాన్సువాడ ఎంఎల్ఎ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశామని ముఖ్యమంత్రి టిపిసిసి అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసమే పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని పోచారం ఇంటికి వెళ్లి పోచారం శ్రీనివాస్ రెడ్డితో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర తాజా రాజకీయ పరిణామాలు, తదితర అం శాలపై చర్చించారు. అనంతరం రేవంత్ రెడ్డి సమక్షంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు రేవంత్ రెడ్డి పార్టీ కండువాకప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలాగే పోచారం కుమారుడు భాస్కర్ రెడ్డి కూడా తరువాయి 2లో

### బిఆర్ఎస్ నేతల అరెస్ట్

హైదరాబాద్‌లో ఎంఎల్ఎ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. 12 మంది నాయకులపై కేసు పెట్టారు. పోచారం ఇంటిదగ్గర గులాబీ పార్టీ నేతలను అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం ఉస్మానియా అస్పత్రికి తరలించారు. అనంతరం వారిని పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. బిఆర్ఎస్ నాయకులను కోర్టుకు తరలిస్తున్న సమయంలో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట బిఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అయితే ముఖ్యమంత్రి తరువాయి 2లో

# రూ.2 లక్షలు ఒకేసారి...



## రైతులకు ఏక కాలంలో రుణమాఫీ

### కటాఫ్ తేదీ 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వతేదీ వరకు

త్వరలో అర్హతపై విధివిధానాలతో ఉత్తర్వులు జారీ

రుణమాఫీకి దాదాపు రూ.31వేల కోట్లు అవసరం

రాహుల్ ప్రకటించిన రైతు డిక్లరేషన్ అమలుకు మంత్రివర్గం నిర్ణయం

కేబినెట్ సమావేశం నిర్ణయాలను మంత్రులతో కలిసి వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల పంటల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు ఐదేళ్ల మధ్యకాలంలో తీసుకున్న రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసి రైతులను రుణవిముక్తి చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. రుణ మాఫీ అర్హతలకు సంబంధించిన నియమనిబంధనలతో కూడిన ఉత్తర్వులను త్వరలో జారీ చేయాలని నిర్ణయించింది. రుణమాఫీకి దాదాపు రూ.31వేల కోట్లు అవసరమని మంత్రివర్గం అంచనా వేసింది. వ్యవసాయం దండగ కాదని, ఒక పండుగ అని, ప్రజాపాలనలో సంక్షేమ, అభివృద్ధి రాష్ట్రంగా ముందుకు తీసుకెళ్తామని రైతులకు మంత్రివర్గం భరోసా కల్పిస్తూ 'రైతు భరోసా' విధి విధానాలను ఖరారు చేసేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం జులై 15లోపు ప్రభుత్వానికి నివేదికను అందజేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతు రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలు, ఆర్థిక వనరుల సేకరణ, రైతుభరోసా అమలు తీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

**రాహుల్ ప్రకటించిన రైతు డిక్లరేషన్ అమలుకు నిర్ణయం**

రాష్ట్రంలో 2022 మే నెల 6వ తేదీన వరంగల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ నేత తరువాయి 2లో

### రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం

రైతు భరోసా అమలులో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. ఈ ఉప సంఘంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సభ్యులుగా నియమించారు. ఈ సబ్ కమిటీ రైతు భరోసా విధి విధానాలు, వాటి అమలు తీరు తదితర అంశాలపై చర్చించి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయనుంది. రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నుంచి సలహాలు తీసుకుని వాటిపై చర్చించి పారదర్శకంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని మంత్రివర్గం సూచించింది. జులై 15లోపు మంత్రివర్గ ఉప సంఘం పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి. ఈ నివేదికను శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సభలో ప్రవేశపెట్టి చర్చించాలని, ఆ తర్వత భవిష్యత్ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించాలని, రైతుభరోసను పారదర్శకంగా, జవాబుదారీతనంగా అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

సుదీర్ఘ చరిత్ర ఉన్న సింగరేణి సంస్థ ఇప్పుడు 39 బొగ్గు గనులతో నడుస్తున్నప్పటికీ కొత్త గనుల కేటాయింపు లేకపోతే ప్రస్తుతం ఉన్న గనులు క్రమంగా తగ్గిపోతున్నాయి. కేంద్రం నిర్లక్ష్యంతో మరో వైపు రానున్న ఐదు సంవత్సరాలలోనే మన 8 భూగర్భ ఘనులు, మూడు ఓపెన్ కాస్ట్ గనులు మూతపడబోతున్నాయి. ఆ తర్వాత రానున్న ఐదు సంవత్సరాలలో అంటే 2032 నాటికి మరో ఐదు భూగర్భ గనులు ఆరు ఓపెన్ కాస్ట్ గనులు మూతపడడం ఖాయం . ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు, మరో నాలుగు వేల మెగావట్ల ప్లాంట్ ఎన్‌టిపిసి కేంద్రానికి, సింగరేణి సంస్థ నిర్మిస్తున్న మరో ఎనిమిది వందల మెగా-వాట్ల ప్లాంట్‌కు కూడా బొగ్గు ఎంతో అవసరం ఉంది.

– భట్టి విక్రమార్క

# బొగ్గు బ్లాకుల వేలం.. సింగరేణిని కుదేలు చేయడమే

వేలం పాటల ప్రారంభంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

అఖిలపక్షంగా ప్రధానిని కలుద్దామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతి



ప్రజాపక్షం / హైదరాబాద్

బొగ్గు బ్లాకులను వేలం పాటలో పెట్టి ప్రైవేట్ వారికి అవకాశం కలిగించడం అంటే ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని కుదేలు చేయడమేనని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర ప్రభుత్వ 10 విడత కమర్షియల్ కోల్ మైన్ వేలం పాట ఆరంభ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబె ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న సింగరేణి సంస్థ ఇప్పుడు 39 బొగ్గు గనులతో నడుస్తున్నప్పటికీ కొత్త గనుల తరువాయి 2లో

### సింగరేణిపై ప్రధానితో మాట్లాడుతా : కిషన్ రెడ్డి

బొగ్గు గనుల వేలం పాటల ప్రక్రియను డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ నెల 24 వరకు ఆన్‌లైన్‌లో వేలం పాటల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కాగా సింగరేణి బొగ్గు గనుల వేలం విషయంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశాలపై ప్రధానితో మాట్లాడతానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి, ఆదాయం కోసం మాత్రమే బొగ్గు గనులను తరువాయి 2లో

# పప్పు దినుసుల 'ప్రత్యేక బోర్డు'

ఏర్పాటు చేయాలని కేంద్రానికి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



పప్పును దినుసుల ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తద్వారా జిఐ ట్యాంగ్ పొందిన తాండూరు కందిపప్పు రైతులను మరింత ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలో పప్పు దినుసుల అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ రాష్ట్రాలో పప్పు దినుసుల సాగు, వాటి విస్తీర్ణాన్ని పెంచే దిశంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి గురువారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పప్పు దినుసుల అవసరాలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పంట సాగును పెంచడం మనందరి తక్షణ కర్తవ్యమని అని అన్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ విధివిధానాలు రూపొందిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో పండించే తాండూరు కందిపప్పుకు ప్రపంచములోనే విశిష్ట స్థానముందని, ప్రతి ఏటా ఈ మార్కెట్‌కు 4లక్షల క్వింటాళ్ల కందిపప్పు వస్తుందని తెలిపారు. తాండూరు కందిపప్పుకు జియోగ్రఫిక్ ఇండికేషన్ ట్యాగ్ వచ్చిందని, తెలంగాణ నుండి జిఐ ట్యాగ్ పొందిన 16వ ఉత్పత్తులు ఉండగా . వ్యవసాయములో ఇదే మొట్టమొదటిది అని అన్నారు. పప్పుదినుసుల బోర్డు ఏర్పాటు ద్వారా ఇక్కడ రైతులందరిని మరింత ప్రోత్సహించేందుకు వీలుకలుగుతుందని తరువాయి 2లో



# కేజ్రీవాల్ బెయిల్‌కు బ్రేక్

సాధారణ బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే

**న్యూఢిల్లీ :** మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అనూహ్య ఎదురుదెబ్బ తగిలింది. గురువారం ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం మంజూరు చేసిన సాధారణ బెయిల్‌ను శుక్రవారం ఢిల్లీ హైకోర్టు నిలుపుదల చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. అత్యవసర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ట్రయల్ కోర్టులో విచారణ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుధీర్ కుమార్ జైన్, జస్టిస్ రవీందర్ దూదేజాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. బెయిల్‌ను సవాల్ చేస్తూ ఇడి దాఖలు చేసిన పిటిషన్‌ను తాము విచారించే వరకు ట్రయల్ కోర్టు ఆదేశాలు అమలు కావని తెలిపింది. కాగా లిక్కర్ స్కామ్ కేసులో మనీలాండరింగ్ అభియోగాలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు గురువారం సాధారణ తరువాయి 8లో

# ఎపి స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

ఏకగ్రీవ ఎన్నిక



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి కోసం ఒకే ఒక నామినేషన్ రావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. టిడిపి సీనియర్ నేతగా కొనసాగుతున్న అయ్యన్న.. కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత సీనియర్. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన ఏడాది 1983లో తొలిసారి నర్సీపట్నం నుంచి విజయం సాధించారు. ఇప్పటి వరకు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒక సారి అనకాపల్లి ఎంపీగానూ విజయం సాధించారు. పలుశాఖలకు మంత్రిగా పనిచేశారు. గతంలో కంటే ఈసారి 24,756 ఓట్ల మెజార్టీతో నర్సీపట్నం ప్రజలు గెలిపించారు. శాసనసభ స్పీకర్ పదవి కోసం అయ్యన్నపాత్రుడు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తరపున కూటమి నేతలు నామినేషన్ పత్రాలను శాసనసభ కార్యదర్శికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎన్నిక నిర్వహించనున్నారు.

**ఎంఎల్ఎలుగా ప్రమాణం**

అంతకు ముందు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా, శాసనసభలో తొలుత సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, తరువాయి 8లో

### ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నేరానికి పాల్పడ్డాడు : ఇడి

సోదాల్లో కీలక డాక్యుమెంట్లు లభ్యం

బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్

ప్రజాపక్షం/హైదరాబాద్

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మైనింగ్ అక్రమాలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు తెలిపారు. మహిపాల్‌రెడ్డి ఇంటితో పాటు అతనికి చెందిన పది మంది బంధువులు, స్నేహితుల ఇళ్లపై ఇడి అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో ఇడి అధికారులకు కీలక డాక్యుమెంట్లు తరువాయి 2లో



# నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలి

కాంగ్రెస్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐసిసి పిలుపు మేరకు శుక్రవారం నీట్ పరీక్షను రద్దు చేయడంతోపాటు ప్రశ్నా పత్రం లీకేజికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ సంయుక్త ఆధర్యంలో గాంధీ భవన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టిపిసిసి కార్యనిర్వహక అధ్యక్షులు ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్, ఎంఎల్ఎ దానం నాగేందర్, ఎంఎల్‌సి ,ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి, సీనియర్ నాయకులు జగ్గారెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, కాంగ్రెస్ తరువాయి 8లో

### మూడు రోజులు భారీ వర్షాలు

వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారలు ప్రకటించారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలు కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల తరువాయి 8లో



# అమెరికాలో డిగ్రీ పూర్తి చేస్తే గ్రీన్‌కార్డు

## మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ

**వాషింగ్టన్ :** తాను అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి నిన్నమొన్నటి వరకూ వలసదారులపై అసహనాన్ని ప్రదర్శించిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు స్వరం మార్చారు. అమెరికాలో డిగ్రీ పూర్తి చేసిన వారందరికీ గ్రీన్‌కార్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది చివరిలో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కూడా పోటీపడుతున్న విషయం తెలిసిందే. ఐదు లక్షల మంది వలసదారులకు పౌరసత్వం ఇవ్వనున్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించిన 24 గంటల్లోపే ట్రంప్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారందరికీ గ్రీన్ కార్డు లభిస్తుందని ప్రకటించడం గమనార్హం. వలసదారుల విషయంలో తీసుకున్న నిర్ణయాలను కొవిడ్ కారణంగా అమలు చేయలేకపోయామని టెక్ పెట్టుబడిదారులతో కలిసి ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ట్రంప్ అన్నారు.
ప్రస్తుతం అమెరికాలో పని చేస్తున్న వారికి ఇచ్చే హెచ్ 1బి వీసాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికాలో చదువుకొని, అక్కడే ఉద్యోగం చేసేవారికి గ్రీన్‌కార్డు ఇస్తే, వారి దేశానికి మరింతగా ఉపయోగపడతారని వ్యాఖ్యానించారు. దేశంలో అక్రమంగా ఉంటున్న వలసదారులు నేరాలకు పాల్పడుతున్నారని, ఉద్యోగాలను, ప్రభుత్వ వనరులను దోచుకుంటున్నారని పదేపదే వ్యాఖ్యానించి, తీవ్ర విమర్శలకు గురైన ట్రంప్ హఠాత్తుగా యూటర్న్ తీసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇటీవల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు కూడా ఆయన వలసదారులపై పలు విమర్శలు గుప్పించారు. వీరంతా దేశ రక్తాన్ని విషపూరితం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే, దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనంత, అతి పెద్ద బహిష్కరణ కార్యక్రమాన్ని చేపడతానని శపథం చేశారు. కొన్ని ముస్లిం దేశాల నుంచి అమెరికాలోకి ప్రవేశించిన వలసదారులపై నిషేధం విధిస్తామని కూడా అన్నారు. 'బై అమెరికన్ అండ్ హైర్ అమెరికన్' (అమెరికా వస్తువులు కొనండి.. అమెరికన్లకే ఉద్యోగాలు ఇవ్వండి) అనే నినాదాన్ని చ్చారు. అయితే, వలసదారులకు పౌరసత్వం అంశంపై బైడెన్ ప్రకటన వెలువడిన తర్వాత ట్రంప్ తన మాట మార్చారు. వారి పట్ల మరింత ఉదారంగా వ్యవహరించనున్నట్టు తన హామీ ద్వారా ప్రకటించారు. ట్రంప్ ఎప్పుడు ఏం మాట్లాడతారో? ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో? ఏ విధమైన ప్రకటన చేస్తారో? ఎవరికీ తెలియదని అంటారు. అందుకే, ఆయన చేసిన తాజా ప్రకటనపైన కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# పాక్‌లో టూరిస్టుపై మూక దాడి

## కాల్చి చంపి.. శవాన్ని ఉరితీసి అరాచకం



**పెషావర్:** పాకిస్థాన్‌లోని స్వాత్ పట్టణంలో ఓ టూరిస్టుపై మూకదాడి జరిగింది. ఖురాన్‌ను అగౌరవపరిచాడన్న ఆగ్రహంతో, వందలాది మంది ఆ టూరిస్టుపై దాడి చేశారు. కాల్చి చంపారు. అనంతరం శవాన్ని వీధుల్లో ఈడ్చుకుంటూ తీసుకెళ్లి, నగరం నడిబొడ్డున ఉరితీసి, అరాచకం సృష్టించారు. 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్'ను ఉటంకిస్తూ, పిటిఐ కథనం ప్రకారం పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్, సియాల్ కోట్‌కు చెందిన మహమ్మద్ ఇస్మాయిల్ అనే వ్యక్తి స్వాత్ పర్యటనకు వచ్చాడు. ఆ సందర్భంగా ఖురాన్‌లోని కొన్ని కాగితాలను చింపి కాల్చినట్టు ఫిర్యాదు రావడంతో పోలీసులు అతనిని అరెస్టు చేశారు. అయితే, ఈ వార్తను మసీదుల స్పీకర్ల ద్వారా ప్రకటించడంతో, ఆగ్రహంతో ఊగిపోయిన వేలాది మంది పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఇస్మాయిల్‌ను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ బయట ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు గాయపడినప్పటికీ, ప్రజలు పోలీస్ స్టేషన్‌లోకి దూసుకెళారు. అక్కడ ఇస్మాయిల్‌ను కాల్చి చంపారు. అనంతరం శవాన్ని తీసుకెళుతూ, పోలీస్ స్టేషన్‌కు నిప్పంటించారు. పోలీసులు ప్రాణ భయంతో అక్కడి నుంచి పరారుకాగా, ఇస్మాయిల్ శవాన్ని వీధిల మీదుగా లాక్కెళ్లి, బహిరంగంగా ఉరితీశారు. పోలీస్ స్టేషన్ను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి అదనపు బలగాలను పంపినట్టు స్వాత్ జిల్లా పోలీస్ అధికారి జహిదుల్లా తెలిపారు. శాంతంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ప్రకటించారు. ఖైబర్ ఫక్తున్‌ఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ గండాపూర్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

# పాకిస్థాన్‌లో మరో రాజకీయ పార్టీ



**ఇస్లామాబాద్:** వాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాలక పాకిస్థాన్ ముస్లిం లీగ్‌నవాజ్ (పిఎంఎల్ఎన్)తో విభేదాల కారణంగా ఆ పార్టీతో విడిపోయిన పాకిస్థాన్ మాజీ ప్రధాని షాహిద్ ఖాకాన్ అబ్బాసీ శుక్రవారం 'ఆవామ్ పాకిస్థాన్' పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ఆగస్టు 2017 నుండి మే 2018 వరకు ప్రధాన మంత్రిగా సేవలు అందించిన అబ్బాసీ, మాజీ ఆర్థిక మంత్రి మిఫ్తా ఇస్మాయిల్‌తో కలిసి మాజీ ప్రధాని పిఎంఎల్ఎన్ నుంచి వైదొలిగారు. 'బాద్లింగే హమ్ నిజాం' (మేము వ్యవస్థను మారుస్తాము) అనే నినాదంతో ఈ పార్టీ జులై 6 లేదా 7న అధికారికంగా ప్రారంభమవుతుందని 'అవామ్ పాకిస్థాన్' అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ఉన్న వీడియోలో పార్టీ పేర్కొంది. ద్రవ్యోల్బణం, ఇంధన కొరత, అవినీతి, నిరుద్యోగం, విద్యా అసమానతలు వంటి జాతీయ సమస్యలపై దృష్టి సారించినున్నట్టు తెలిపింది. 65 ఏళ్ల అబ్బాసీ పార్టీ ఆర్గనైజింగ్ కమిటీకి అధిపతిగా ఉంటారని, ఇస్మాయిల్ ఆయనకు డిప్యూటీగా వ్యవహరిస్తారని పార్టీ ఆ పోస్టులో పేర్కొంది. ఈ కమిటీలో ఖైబర్ ఫక్తున్‌ఖ్వా మాజీ గవర్నర్, పిఎంఎల్ఎన్ నాయకుడు సర్దార్ మెహతాబ్ అబ్బాసీ, ఆ పార్టీ మాజీ సెనెటర్ జావేద్ అబ్బాసీ, ముత్తాహిదా క్వామీ మూమెంట్ మాజీ శాసన సభ్యుడు షేక్ సలావుద్దీన్ వ్యవహరిస్తారని వివరించింది.

# రష్యా మంత్రి తొలగింపు



సెర్గీ షోయిగు



తైమూర్ ఇవనోవ్

**మాస్కో:** లంచం ఆరోపణలపై జైలు శిక్ష అనుభవిస్తున్న రష్యా డిప్యూటీ డిఫెన్స్ మినిస్టర్ తైమూర్ ఇవనోవ్ (48)ను అధికారికంగా తొలగించినట్టు అధికారిక ప్రకటన వెలువడింది. విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని ఆరోపణలు రావడంతో, ఇవనోవ్‌పై విచారణ ప్రారంభమైంది. ఎలాంటి ఆటంకం లేకుండా విచారణ జరిగేందుకు వీలుగా ఇవనోవ్‌ను ముందస్తుగా అరెస్టు చేసి, జైల్‌లో ఉంచారు. ఆ నిర్బంధాన్ని మరో మూడు నెలలు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల అవినీతి ఆరోపణలపై అరెస్టయిన పలువురు మిలటరీ సీనియర్ అధికారుల్లో ఇవనోవ్ ఒకరు. అంతేగాక, గత నెల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తొలగించిన, అప్పటి రక్షణ మంత్రి సెర్గీ షోయిగుకు అత్యంత సన్నిహితుడు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, అవినీతికి పాల్పడ్డారని ఇవనోవ్‌పై ఆరోపణలు ఉన్నాయి. జాతీయ మీడియా కూడా ఆయనపై వచ్చిన ఫిర్యాదులను పలు సందర్భాల్లో ప్రధాన శీర్షికలుగా బయటపెట్టింది. దీనితో విచారణకు ఆదేశించిన పుతిన్, నాటి రక్షణ మంత్రిని తొలగించారు. ఇవనోవ్ అరెస్టును పెంచుతూ కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో, ఆయనను అధికారికంగా పదవి నుంచి తొలగించారు.

# వియత్నాం, రష్యా ఒప్పందాలు



**హనోయ్:** వియత్నాం పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. డజను ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌తో సమావేశమైప్పుడు, ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం, అభివృద్ధికి తోడ్పాటు వంటి అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. అధికారికంగా ప్రకటించిన ఒప్పందాల్లో రక్షణకు సంబంధించినది ఏదీ లేకపోయినప్పటికీ, అవసరాన్ని బట్టి సహకరించుకోవాలని వారిద్దరూ ఒక అవగాహనకు వచ్చినట్టు తెలుస్తోంది. రక్షణ, సార్వభౌమాధికారం, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో శాంతి తదితర విషయాల్లోనూ రెండు దేశాల మధ్య సయోధ్య కుదిరిందని అంటున్నారు.
ఉక్రేన్‌తో యుద్ధం మొదలైన తర్వాత, రష్యాపై అమెరికాసహా పలు దేశాలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇటీవల యూరోపియన్ యూనియన్ (ఇయు) తన ఆంక్షల జాబితాలో వాణిజ్యం, ఎగుమతులు, దిగుమతులు వంటి అంశాలను కూడా చేర్చింది. ఇలాంటి పరిస్థితుల్లో, ఉత్తర కొరియాలో పర్యటించిన పుతిన్ ఆ దేశాధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో సమావేశమై రక్షణ సహా పలు అంశాలపై చర్చించారు. అనంతరం వియత్నాం పర్యటనకు వచ్చిన ఆయన, ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టపరచుకోవడంపై దృష్టి కేంద్రీకరించారు.

## కాంగ్రెస్‌లోకి పోచారం(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రైతుల సంక్షేమం అంశంలో పోచారం సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తామన్నారు. భవిష్యత్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం ఇస్తామని, నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటామని, తమది రైతు రాజ్యమని, రైతు సంక్షేమ రాజ్యం. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకునిపోతామని తెలిపారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. రైతుల సంక్షేమానికి పోచారం ఎన్నో సేవలు అందించారని, పోచారం సూచనలకు ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం కల్పిస్తామని సిఎం రేవంత్ హామీనిచ్చారు.

### సిఎం రేవంత్ చేపడుతున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్‌లో చేరాను : పోచారం

రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల ప్రగతికి సిఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని, సిఎం చేపడుతున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే తాను కాంగ్రెస్‌లో చేరినట్టు పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మరో 20 ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే ఓపిక రేవంత్‌కు ఉన్నదని, తనకు వయసు అయిపోయిందని, పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డి మీడియాతోమాట్లాడుతూ సమస్యలను అధిగమిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి ధైర్యంగా ముందుకెళ్తున్నారని చెప్పారు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశానని, అందరి సహకరాంతో రాష్ట్ర భవిష్యత్ కోసం పనిచేస్తానని చెప్పారు. తన రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్‌తో అని, ఆ తర్వాత టిడిపి, బిఆర్ఎస్‌లో చేశానని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న పరిణామాలను తాను గమనిస్తున్నానని, సిఎం రేవంత్ రెడ్డిని తన మనస్ఫూర్తిగా ఇంటికి ఆహ్వానించానని పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## పప్పు దినుసుల 'ప్రత్యేక బోర్డు'

(మొదటి పేజీ తరువాయి)

ఆ దిశలో బోర్డు ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా పప్పుదినుసుల సేకరణకు సంబంధించి విధించిన 25 శాతం పరిమితిని ఎత్తివేసి, 100 శాతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనివలన పప్పుదినుసులు పంటను సాగుచేసే రైతులకు ప్రోత్సహకరంగా ఉంటుందని, మార్కెట్లలో తలెత్తే ఒడిదుడుకులు తట్టుకోగలరని తెలిపారు. అదేవిధంగా చిరుసంచులు (మినికిట్లు) కూడా రాష్ట్రానికి విరివిగా ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు.పప్పుదినుసుల సాగు చేపట్టే రైతులకు, జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్పాదకాలకు ఇచ్చే సబ్సిడీని కూడా పెంచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం కూడా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం అపరాల సాగును ప్రోత్సహించేందుకు ముఖ్యంగా వరి మాగాణిలో మొదటి పంట తర్వాత అవసరాలకు అనుగుణంగ సాగుచేపట్టే విధంగా ప్రణాళిక చేసిందని తెలిపారు. అంతేకాకుండ ఈ సందర్భములో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి ఈ రెండేళ్ల ప్రగతిని కేంద్ర మంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో 30 సంవత్సరాల నుండి ఇది సాగులో ఉండగా, తెలంగాణలో 3 సంవత్సరాల నుండి ఆరంభమైందని, ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉందని, ముఖ్యంగా ధర గిట్టుబాటు అయ్యే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల ముందు పామాయిల్ పై దిగుమతి సుంకంను పూర్తిగా తొలగించారని, దానితో దేశీయంగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతుల ప్రయోజనాలకు నష్టం కల్గిందని, మళ్ళీ ఆయిల్ పామ్ పై దిగుమతి సుంకాన్ని విధించే దిశలో చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. దానితో ఆయిల్ పామ్ గెలల ధర తిరిగి పెరిగే అవకాశముందని తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ సానుకూలంగా స్పందిస్తూ చర్చించుకు పూర్తి వివరాలతో ఢిల్లీకి వచ్చి కలవాల్సిందిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు.

## రూ.2లక్షలు ఒకేసారి... (మొదటి పేజీ తరువాయి)



రాహుల్‌గాంధీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని మంత్రివర్గంలో విధానపరైన నిర్ణయాలు తీసుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయం దండగ కాదని, ఒక పండుగగా చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. గత ప్రభుత్వ పాలన తీరు తెలిసిన రాజకీయ పక్షాలు, పలువురు విశ్లేషకులు రైతు రుణమాఫీపైన చర్చోపచర్చలు చేశారని, కాంగ్రెస్‌వి అలవికాని, అమలు కాని హామీలని రాద్ధాంతం చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ అంశంపైన మంత్రివర్గంలో విశ్లేషించి, బ్యాంకులలో ఉన్న రుణ వివరాలను సేకరించి, అన్నీ క్రోడీకరించి, రైతురుణ మాఫీ చేయాలని మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్ల కెసిఆర్ ప్రభుత్వ హయాం లో రెండు విడతలుగా రూ. 12వేలు, రూ.16 వేలు మొత్తం రూ. 28వేలు మాత్రమే రుణమాఫీ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో కేవలం 8 నెలలోనే రూ.31వేల కోట్ల రుణాలను మాఫీ చేయనున్నామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రుణ మాఫీకి సంబంధించి రూ.31వేల కోట్లు సేకరించి, రైతాంగాన్ని రుణవిముక్తి చేస్తామని వెల్లడించారు. సోనియాగాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ మాట ఇస్తే, మడప తిప్పని నాయకులని, గతంలో వారు తీసుకున్న నిర్ణయాలుఅందరికీ తెలుసని సిఎం తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తామని 2004 సంవత్సరంలో కరీంనగర్ సభలో సోనియా గాంధీ మాట ఇచ్చారని, అందుకనుగుణగానే సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని రేవంత్ వివరించారు. ఈ నిర్ణయం వల్ల కాంగ్రెస్‌లో రాజకీయ సంక్షోభం, విపత్కర పరిస్థితులు వస్తాయని ముందే తెలిసినప్పటికీ సోనియా గాంధీ ఇచ్చినమాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు.సోనియా మాట చెబితే శిలాశాసనమని అన్నారు. ఎటువంటి పరిస్థితులోనైనా ఆ మాటను నిలబెట్టుకోవడం తమ నాయకుల గొప్పతనమని, అటువంటి నేపథ్యంలో వచ్చిన రాహుల్ గాంధీ వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్‌లో రైతలకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారని సిఎం గుర్తు చేశారు.

### వ్యవసాయ సంక్షోభం.. రైతు ఆత్మహత్యలకు కారణమైన బిఆర్ఎస్ ప్రభుత్వం

రుణ మాఫీని నాలుగు దఫాలుగా చేస్తామని, వడ్డీలు చెల్లిస్తామని, వాయిదాలపైన వాయిదాలు వేస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రకరకాల ప్రకటలు చేస్తూ, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి, రైతు ఆత్మహత్యలకు కారణమైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రైతులకు ఇచ్చినమాట నిలబెట్టులేదని విమర్శించారు. రైతుభరోసాపై చిలువలు, పలువలుగా మాట్లాడుతున్నారని, టాటా, బిర్లాలకు, జూబ్లీహిల్స్‌లో, ఫామ్‌హౌజ్‌లో ఉన్నవారికి, కెసిఆర్ ఫామ్‌హజ్‌కు కూడా రైతు భరోసా నిధులు తీసుకున్నారని రకరకాల చర్చలు జరుగుతున్నాయని సిఎం తెలిపారు. అందరి సూచనల ప్రకారం రైతు భరోసా పథకాన్ని పారదర్శకంగా నిస్సాహాయులకు సహాయం అందించాలని, ఏ ఒక్కరికీ అన్యా యం జరగొద్దని, రైతుకు భరోసా ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.

### ప్రభుత్వ విధానాలు చెప్పేందుకు ఇద్దరు మంత్రులు

ఇక నుంచి ప్రభుత్వ పరిపాలన విధానాలను, సమాచారాన్ని తెలిజేసేందుకు మంత్రివర్గం ఇద్దరు మంత్రులకు బాద్యతలను అప్పగించదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజకీయ పార్టీలకు చెందిన సొంత మీడియాలో రకరకాల రాద్ధాంతాలు, అపోహాలు కల్పిస్తున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. ఎక్కడో జరిగిన అంశాలపై మరెక్కొడో ఉన్న మంత్రులను ప్రశ్నించి, ప్ర భుత్వ ప్రతిష్టను దెబ్బతిసేలా ప్రసారాలు, ప్రచురణలు చేస్తున్నారని సిఎం అన్నారు. ఇక నుంచి ప్రభుత్వం తరపున పూర్తి సమాచారం ఇవ్వడానికి ఇద్దరు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలను అప్పగిస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సంబంధించిన వివరాలను, సమాచారాన్ని ఇద్దరు మంత్రులు మీడియాకు వెల్లడిస్తారన్నారు. వివిధ శాఖల మంత్రులు తమ శాఖలకు సంబంధించిన అంశాలపై స్పందిస్తారని, పరిపాలనకు సంబంధించిన వివరాలను ఇవ్వడానికి ఇద్దరు మంత్రులు మీడియాకు అందుబాటులో ఉంటారన్నారు. రాజకీయ అంశాలను ఏ మంత్రి అయినా మాట్లాడుతారని సిఎం స్పష్టం చేశారు.

## కుదేలు చేయడమే..!

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపు లేకపోతే ప్రస్తుతం ఉన్న గనులు క్రమంగా తగ్గిపోతాయన్నారు. సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రం కొత్తగా తెచ్చిన చట్టంలోని 17(ఏ ) ప్రకారం రిజర్వేషన్ ప్రక్రియ ద్వారా బొగ్గు బ్లాకులు కేటాయించే అవకాశం ఉన్న దానిని పక్కనపెట్టి ప్రైవేటు వారిని వేలంకు ఆహ్వానించడం ద్వారా సింగరేణిని నష్టాల బాట పట్టించినట్టేనన్నారు. కేంద్రం నిర్లక్ష్యంతో మరో వైపు రానున్న ఐదు సంవత్సరాలలోనే మన 8 భూగర్భ ఘనులు, మూడు ఓపెన్ కాస్ట్ గనులు మూతపడబోతున్నాయని, ఆతర్వాత రానున్న ఐదు సంవత్సరాలలో అంటే 2032 నాటికి మరో ఐదు భూగర్బ గనులు ఆరు ఓపెన్ కాస్ట్ గనులు మూతపడడం ఖాయం అని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు.2037—38నాటికి మరో 5గనులు మూతపడుతాయని హెచ్చరించారు.ప్రస్తుతం 39గనులు 40వేల మంది కార్మికులు ఉన్న సింగరేణి మరో 15ఏళ్లలో 8గనులు ఎనిమిది వందల మంది కార్మికుల స్థా యికి పడిపోయి సింగరేణి మూతపడే ప్రమాదం ఉందని, తెలంగాణ ప్రాంత నాయకులుగా ఈపరిణామాన్ని ఊహించలేమన్నారు.సింగరేణి సంస్థకుగోదావరి పారివాహక ప్రాంతంలోని ఇంకా మిగిలి ఉన్న 1400 మిలియన్ టన్నుల బొగ్గు తీసేందుకు వీలుగా చట్ట ప్రకారంగానే రిజర్వేషన్ కో టాలో బ్లాకులు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరుతున్నామన్నారు. ఈ విషయంలో ప్రధాన మంత్రితో కిషన్ రెడ్డి మాట్లాడి వారిని ఒప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అవసరమైతే తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు తాను అఖిలపక్షంగా అన్ని పార్టీల వారు కూడా కలిసి ప్రధానికి విజ్ఞప్తి చేయడానికి ఢిల్లీకివచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ బిడ్డగా కిషన్ రెడ్డి సింగరేణికి న్యాయం చేయాలని చేస్తారని భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కు, మరో నాలుగు వేల మెగావట్ల ప్లాంట్ ఎన్‌టిపిసి కేంద్రానికి, సింగరేణి సంస్థ నిర్మిస్తున్న మరో ఎనిమిది వందల మెగావాట్ల ప్లాంట్‌కు కూడా బొగ్గు ఎంతో అవసరం ఉందన్నారు. ఇది సుమారు 24 మిలియన్ టన్నులు అవుతుందని, ఈ డిమాండ్ కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి జరగాలంటే సింగరేణి సంస్థకు కొత్త గనులు కేటాయించాల్సిన అవసరంఉందని డిప్యూటి సిఎంభట్టి తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన తర్వాత తాను స్వయంగా గత బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ని కలిసి ఈ విషయాలు వివరించి కొత్త బ్లాకులు కేటాయించాలని తాటిచెర్ల బ్లాక్ 2కు అవునుమతి ఇవ్వాలని కోరానని గుర్తు చేశారు.ఇప్పుడు కూడా కిషన్‌రెడ్డిని కోరేది ఏంటంటే.. సింగరేణి సంస్థ బతకాలన్న, దానిలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న లక్షలాదిమంది తెలంగాణ ప్రజల భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి సంస్థకు కొత్త గనులు కేటాయించడం ఎంతో అవసరన్నారు. గతంలో నిర్వహించిన వేలంపాట ద్వా రా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాకు3 లను పొందిన ప్రైవేటు కంపెనీల వారు ఇప్పటివరకు అ క్కడ బొగ్గు తవ్వకాలు ప్రారంభించనే లేదన్నా రు. కనుక చట్ట ప్రకారం ఆ కేటాయింపులు రద్దుచేసి ఆబ్లాకులు సింగరేణికి కేటాయించాలని కోరుతున్నానని, ఆ రెండు బ్లాకులు కేటాయిస్తే సింగరేణి వెంటనే అక్కడ తవ్వకాలు ప్రారంభిస్తుందన్నారు.
సుమారు 135 సంవత్సరాల చరిత్ర కలిగి దేశంలోనే తొలి ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా కీర్తి గడిచిన సింగరేణి ప్రస్తుతం బొగ్గు బ్లాక్ ల వేలం ప్రక్రియ వల్ల అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో దేశ బొగ్గు శాఖ మంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కిషన్ రెడ్డి బాధ్యతలు చేపట్టడం వల్ల సింగరేణి ఉజ్వల భవిష్యత్తుపై మళ్ళీ ఆశలు చిగురుస్తున్నాయన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మన తెలంగాణ ప్రాంతం నుంచి కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడం మ నందరికీ సంతోషకరమన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికి ఆయువు పట్టు , ఉద్యోగాల గని అని కూడా పేరుందన్నారు.

## బిఆర్ఎస్ నేతల అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి పోలీసుల తీరుపై సీరియస్ అయ్యారు. పోచారం ఇంటికి శుక్రవారం ఉదయం వెళ్లారు. ఈ సమయంలో పోలీసుల భద్రత చర్యల వైఫల్యంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం పోచారం ఇంట్లో ఉం డగా అదే సమయంలో బిఆర్ఎస్ నేతలు చొచ్చుకెళ్లారు. బాల్క సుమన్ సహా బిఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేపట్టారు. పదుల సంఖ్యలో పోచా రం ఇంట్లోకి గులాబీ శ్రేణులు చొరబడ్డారు. కారు పార్టీ కార్యకర్తల ఆందోళనలతో పోచారం ఇంటి దగ్గర కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. వెస్ట్ జోన్ డిఎస్‌పి విజయ్ కుమార్ పోచారం ఇంటికెళ్లి విచారణ చేపట్టారు. బాల్క సుమన్ సహా బిఆర్ఎస్ నేతలు చొరబడిన తీరును అడిగి తెలుసుకున్నారు.ఆనేతలపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే పోచారం నివాసానికి సిఎం సెక్యూరిటీ ఆఫీసర్ కూడా వెళ్లారు.

## నేరానికి పాల్పడ్డాడు : ఇడి

(మొదటి పేజీ తరువాయి)

లభించాయి. ఈ సందర్భంగా వీరికి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు, లాకర్లను సీజ్ చేయడంతో పాటు రూ.19 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహిపాల్‌రెడ్డికి మైనింగ్ కోసం ప్రభుత్వం కేటాయించిన భూమికి మించి 4.37 హెక్టార్ల భూమిలో అక్రమంగా మైనింగ్ నిర్వహించినట్లు ఇడి దాడుల్లో వెల్లడైంది.తద్వారా నిందితుడు రూ.300 కోట్లు అక్రమంగా సంపాదించాడని, అలాగే రూ.39.08 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయాల్టిని ఎగ్గొట్టాడని ఇడి అధికారులు వెల్లడించారు. వచ్చిన అక్రమ సంపాదనతో బినామీ పేర్లపై ఆస్తులు ఖరీదు చేశాడని వారు పేర్కొన్నారు.బినామీల ఫోన్‌లను కూడా అధికారులు సీజ్ చేశారు.

## ప్రధానితో మాట్లాడుతా: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వేలం వేయడం లేదని అన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకునే వేలం చేపట్టినట్లు వివరించారు. బొగ్గు గనుల వేలంతో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కోల్ మైన్స్ వేలాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు ఎటువంటి నష్టం కలగకుండా చూస్తామన్నారు. సింగరేణిని మరింత అభివృద్ధి చేస్తామని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని వేలం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ గనుల వేలంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశాలపై ప్రధానితో మాట్లాడతానని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదాయం కోసం మాత్రమే బొగ్గు గనులవేలం వేయడం కేంద్రమంత్రి స్పష్టం చేశారు. బొగ్గు గనులు కావాలంటే అన్ని సంస్థలకు ఒకే విధానం ఉందన్న కిషన్‌రెడ్డి, సింగరేణిని అదుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామన్నారు. " రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన అన్ని విషయాలపైనా పరిశీలిస్తాం. ఒక రెండు మైనింగ్‌లు మా దృష్టిలో ఉన్నాయి. ఒడిశాలో ఉన్న నైని ప్రాజెక్ట్ అంశం 2015 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉంది. దానిక సంబంధించి ఒక్క అడుగూ ముందుకు కదల్లేదు. ఇకపై ఆ సమస్య ఉండదు. ప్రెజెంట్ ఆ రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలో ఉంది. దీంతో మరింత నేను చొరవ తీసుకొని ముందుకు సాగుతాం. అలానే మరికొన్ని అంశాలపై ప్రధాని మోదీతో చర్చిస్తాం." అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

### సింగరేణి విషయంలో రాజకీయాలు చేయడం తగదు

సింగరేణి సంస్థలో కొన్ని సమస్యలున్నాయని, వాటిని తప్పకుండా పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో విడిగా మాట్లాడారు. సింగరేణిపై భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశాలను దిల్లీ వెళ్లాక అధ్యయనం చేస్తామని అన్నారు. సింగరేణి విషయంలో బొగ్గుగనుల శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉందన్న ఆయన, ఈ విషయాన్ని ఎవరూ రాజకీయం చేయకూడదని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. బిజెపి, బిఆర్ఎస్ ఒకటేనని కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం సరికాదని ఆక్షేపించారు. సింగరేణి కార్మికులు ఆందోళన చెందకూడదని కోరారు. వేలంపాట వల్ల రాష్ట్రాలకే ఆదాయం వస్తుంది తప్ప కేంద్రానికి కాదని కిషన్‌రెడ్డి వివరించారు.

## పోలీసులకు రివార్డులు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందికి హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికలను శాంతి యుతంగా జరపడంలో కృషి చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి మరింత దృఢసంకల్పంతో, నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో ప్రతిభ కనబర్చిన ఎలక్షన్‌సెల్, పోస్టల్ బ్యాలెట్ వింగ్, సిటీ ఆర్మ్డ్ రిజర్వ్, ఐటి కమ్యూనికేషన్, ఆర్మ్స్ సెక్షన్, మెయిన్ కంట్రోల్ రూమ్, ఐటి సెల్, ఐసి సిసి బిల్డింగ్ సిబ్బంది, శాంతి భద్రతల విభాగంకు చెందిన పలువురు పోలీసులను ఆయన సత్కరించారు.

## సమాజ భద్రతపై వినూత్న ప్రచారం



ప్రజాపక్షం/హైదరాబాద్:సమాజ భద్రతపై నగర పోలీసులు హైదరాబాద్ సిటీ సెకూయరిటీ కౌన్సిల్ (హెచ్‌సిఎస్‌సి) సహకారంతో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్రచార వాహనాలను శుక్రవారం బంజారహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) వద్ద కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మొబైల్ వాహనాలలో ఆడియో, వీడియోల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తారు. సమాజంలో నేరాలను తగ్గించడంతో పాటు నేరాలు, భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ట్రాఫిక్ భద్రత, మహిళా సంక్షేమం, యాంటీ నార్కోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిజికల్ సెక్యూరిటీ వంటి క్లిష్టమైన సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వాహనాలు దోహదపడతాయి. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..శాంతి భద్రతలు అదుపులో ఉన్న నగరాలు పారిశ్రామికంగా ముందుకు సాగుతాయని, శాంతి భద్రతలపై భరోసా కల్పిండం ద్వారా ప్రపంచ స్థాయి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని తద్వారా నగరాలు, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రచార వాహనాలను అందించిన మైండ్ స్పేస్ రహేజా సంస్థకు కమిషనర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## త్వరలో ఐపిఎస్ అధికారుల బదిలీలు

ఇటీవలే 28 మందిని బదిలీ చేసిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్:మరోసారి ఐపిఎస్ అధికారుల బదిలీ జాబిత సిద్ధమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారిగా సోమవారం 28 ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో ఆయా జోన్‌లకు డిసిపిలు, జిల్లాలకు ఎస్‌పిలను నియమించింది. డిఐజి, ఐజి, అదనపు డిజి, డిజి స్థాయి ఐపిఎస్ అధికారుల బదిలీలు మాత్రం ఇంకా జరగలేదు. వీటిపై కూడా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. జాబిత సిద్ధం చేయాలని కూడా సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జాబిత రూపొందించడంలో ఉన్నతాధికారులు బిజీబిజీగా ఉన్నారు. త్వరలో ఐపిఎస్ అధికారుల బదిలీల రెండు జాబితా విడుదల కానుంది.

## రూపాదేవి మృతి దురదృష్టకరం

ప్రజాపక్షం/హైదరాబాద్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మరణం పట్ల అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే రూపాదేవి తనువు చాలించిడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబానికి మంత్రి సురేఖ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## టెక్టోరోకు గూగుల్ గ్రోత్ అవార్డు

లండన్‌లో అవార్డు స్వీకరించిన ఎండి శ్రీధర్ దన్నపనేని

ప్రజాపక్షం/హైదరాబాద్:ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజెస్ సొల్యూషన్ల విస్తరణ, సమీకృతంలో విశేషమైన సహకారం అందించినందుకు గూగుల్ నుండి టెక్టోరో కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిష్టాత్మక గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డును అందుకుంది. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజెస్ గ్లోబల్ పార్టనర్ సమ్మిట్ 2024లో ఈ అవార్డును టెక్టోరో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ దన్నపనేని అందుకున్నారు. టెక్టోరో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ దన్నపనేనిమాట్లాడుతూ గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉంది. ఈ గుర్తింపు మా అంకితభావంతో కూడిన బృందం యొక్క కృషి, పట్టుదల, ఆండ్రాయిడ్ అడాప్షన్ను డ్రైవింగ్ చేయడంలో ఎడతెగని మా శ్రమకు, సాధనకు నిదర్శనం.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత ఆండ్రాయిడ్ కస్టమర్ అనుభవం, కార్యాచరణ సామర్థ్యం బలమైన భద్రతపై దృష్టి ఈ మైలురాయిని సాధించడంలో కీలకమైనవని అన్నారు. మా భాగస్వాముల పురోగతికి నిబద్ధతతో పని చేస్తామని శ్రీధర్ చెప్పారు. మా సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు అత్యాధునిక ఏ ఐ సాంకేతికతను తాము వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ అవార్డు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.

## ప్రజావాణిలో 575 దరఖాస్తులు



ప్రజాపక్షం/హైదరాబాద్:ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 575 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 185, హౌసింగ్ కు సంబంధించి 64 దరఖాస్తులు, వినియోగ దారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖలకు సంబంధించి 50, పంచాయతి రాజ్, గ్రామిణాభివద్ధి శాఖకు సంబంధించి 43, హోం శాఖకు సంబంధించి 42 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 191 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు శ్రీమతి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించడం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# పోరాట యోధుడు జయశంకర్

ప్రొఫెసర్ జయశంకర్‌కు తెలంగాణ సమాజం నివాళి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ సిద్ధాంతకర్తప్రొఫెసర్‌జయశంకర్‌కు తెలంగాణ సమాజం ఘన నివాళ్లి అర్పించింది. జయశంకర్ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి తెలంగాణ రాష్ట్ర ప్రజలు పూలామాలాలు వేసి శ్రద్ధాంజలి ఘంటించారు. జయ శంకర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. అదేవిధంగా పలువురు మంత్రులు జయశంకర్‌కు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలతోపాటు వివిధ ప్రజా సంఘాలు ఉద్యోగ ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళ్లు అర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌కు సిపిఐ శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. తెలంగా వాదాన్ని పునికిపుచ్చుకుని తుది శ్వాస వరకు పోరాడిన ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ అని సిపిఐ జాతీయ కార్యవరర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన చిరకాల స్వప్నంగా ఉద్యమించిన మహా నేత ప్రొఫెసర్ జయశంకర్ అని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండ రామ్ కోనియాడారు. తెంగాణనే స్వప్నంగా, శ్వాసగా మూడు తరాల తెలంగాణ ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచిన మహా మనిషి ప్రొఫెసర్ శంకర్ అంటే మాజీ మంత్రి కెటిఆర్ కొనియాడుతూ నివాళ్లు అర్పించారు.

**ప్రజల గుండెల్లో చిరస్థాయి నిలిచిన జయశంకర్: సిఎంరేవంత్‌రెడ్డి**

ప్రొఫెసర్ జయశంకర్ తన తుది శ్వాస వరకు తెలంగాణ కోసమే పరితపించారని, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్లాఘి ంచారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేసిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సిఎంకొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన చిత్ర పటానికినివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజలను జాగృతం చేయటంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో సమున్నతమైనదని శ్లాఘించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రొ. జయశంకర్ స్వగ్రామం అక్కంపేటని రెవిన్యూ విలేజ్ గా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

## యోగా నిత్య జీవితంలో భాగం కావాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోనిలైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాజోనల్ ట్రైనింగ్ సెంటర్ క్యాంపస్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ ఏడాది 'స్వయం,సమాజం కోసం యోగా' అనే థీమ్ నిర్వహించిన ఈ వేడుకలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ పోలీస్ సూపరిన్‌టెండెంట్ నరసింహాచారి,యోగ గురువు కరుణాకర్,రీజినల్ మేనేజర్ జిబివి రామయ్య, శిబిరం. సీనియర్ అధికారులు, కె. థామస్, రాజీబ్ బిస్వాస్, జి. మధుసుధన్, శ్రీ ప్రమోద కుమార్ సాహూ, ఆర్. శరవణన్ తదితరులు పాల్గొన్నారు.జిబివి రామయ్య మాట్లాడుతూ నిత్య జీవితంలోయోగభాగంకావాలన్నారు.అన్ని వయసుల ఉద్యోగులు, పిల్లలు కార్యాలయాలు అందరూ సులభంగా అనుసరించడం ద్వారా ఆరోగ్యాన్నిపెంపొందించుకోవచ్చానిసూచించారు.

## తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడు

ప్రొఫెసర్ జయశంకర్‌కు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నివాళి



ప్రజాపక్షం /హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ తెలంగాణవాదాన్ని పునికిపుచ్చుకుని రాష్ట్ర సాధన కోసం తుదిశ్వాస వరకు పోరాడిన ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఇందు కోసం జెఎసితో పాటు టిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ తదితర అన్ని పార్టీలను సమన్వయపరుస్తూ తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారని ఆయన కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి ఎ.గోవిందరావు, సిపిఐ శాసనసభాపక్ష కార్యాలయ కార్యదర్శి వి.శ్రీనివాసమూర్తి, బోడ అంజయ్య తదితరులు నివాళులర్పించారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో గత పదేళ్లలో బిఆర్ఎస్ సర్కార్ విఫలమైందని, సిఎం కెసిఆర్ మాటలకే పరిమితమయ్యారే తప్ప చేతలు లేవని విమర్శించారు. తెలంగాణ వచ్చిన తరువాత నీళ్లు, నిధులు, నియామకాలపై నిర్ణయాలను అమలు చేయనట్లయితే తెలంగాణ రాష్ట్ర తెచ్చుకుని వృధా అని ప్రొఫెసర్ జయశంకర్ అన్నారని చాడ వెంకట్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం తెలంగాణాలో ఉందని, సిఎం రేవంత్‌రెడ్డి నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేసి నెరవేర్చాలని, నిత్యం ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుని ఆత్మగౌరవ, ప్రజాస్వామ్యబద్ధమైన పాలనను కొనసాగించాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. తాను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో నీళ్లు, నిధులు, నియామకాలపై వేసిన ప్రశ్నకు సంబంధించిన వివరాలు, రుజువులను సిద్దిపేట ప్రజాగర్జన సభలో ప్రొఫెసర్ జయశంకర్ గుర్తు చేయడం తెలంగాణ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. జయశంకర్ సేవలు అపూర్వమని కొనియాడారు.

## సింగరేణిని బతికించండి



ప్రజాపక్షం/హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తక్షణమే ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి సింగరేణి సంస్థను బతికించాలనిబిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థను చంపడానికే ప్రజలు బిజెపికి ఎనిమిది ఎంపిలను గెలిపించారా? అని నిలదీశారు.కేంద్రం ప్రవేశపెట్టిన ఖనిజ, గనుల 2015 బిల్లుకు బిఆర్ఎస్ మద్దతునిచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఖండించారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఖనిజ, గనుల 2015 బిల్లును ప్రధాని మన్మోహన్ సింగ్‌ఆధ్వర్యంలో 2011లోనే ప్రవేశ పెట్టిందని, యుపిఎ హయంలో స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు తీసుకొచ్చిన బిల్లునే బిజెపి ప్రభుత్వం ఆర్డినెన్స్ రూపంలో తీసుకొచ్చిందని వివరించారు.ఈ బిల్లుకు బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిందనడం అర్థరహితమని, భట్టి విక్రమార్క తన బేషరతుగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 17 ఏ కింద బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి రిజర్వ్ చేయవచ్చని, గతం లో సిఎం కెసిఆర్ సింగరేణి పై కేంద్రానికి రాసిన లేఖనే ఇప్పుడు సిఎం రేవంత్ ప్రామాణికముగా తీసుకోవాలని సూచించారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

## సింగరేణి వేలం నుంచి దారి మళ్లించేందుకే..

కాంగ్రెస్‌లో ఎంఎల్‌ఏల చేరికపై కెటిఆర్ వ్యాఖ్య



ప్రజాపక్షం /హైదరాబాద్ : సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నుంచి తెలంగాణ ప్రజల అటెన్షన్ను డైవర్ట్ చేసేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికెళ్లి ఫిరాయింపుల డ్రామాకి సిఎం రేవంత్ రెడ్డి తెర లేపారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. గనుల వేలంలో పాల్గొన్న బిజెపి, కాంగ్రెస్‌లను తెలంగాణ క్షమించదన్నారు. ఈ రెండు జాతీయ పార్టీలకు ఓటు వేసి గెలిపిస్తే, తెలంగాణ జాతి ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. సింగరేణికి మరణశాసనం రాస్తున్న వేలంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కల పాల్గొనడం బాధాకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సింగరేణి గనుల వేలాన్ని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వ్యతిరేకించడం లేదని కెటిఆర్ ప్రశ్నించారు. తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేంద్రం నేరుగా కేటాయించాలనీ మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆశ్చర్యకరంగా మౌనం వహించడం అనేక ప్రశ్నలకు తావిస్తుందన్నారు. గనుల వేలం విషయంలో మారిన తమ వైఖరిని ప్రజలకు వివరించాలని, దీని వెనుక ఉన్న ఒత్తిడిలు ఏంటో ప్రజలకు తెలియజేయాలని కిషన్ రెడ్డికి కెటిఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ గనుల వేలం ద్వారా అంతిమంగా మొత్తం సింగరేణి సంస్థ ప్రైవేట్ పరం అవుతుందని, పెట్టుబడుల ఉపసంహరణకు దారితీస్తుందనే అంశాన్ని రేవంత్ రెడ్డి అంగీకరిస్తారో లేదో తెలపాలన్నారు. గుజరాత్ ఒరిస్సా మాదిరే తెలంగాణలోని ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి గనులను కేంద్ర ప్రభుత్వం ఎందుకు కేటాయించడం లేదని కెటిఆర్ ప్రశ్నించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించలేక పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం పైన జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించకుండా సంతోషంతో చిరునవ్వులు చిందిస్తూ ఇద్దరు మంత్రులు పాల్గొనడం వారికి తెలంగాణ రాష్ట్రం పైన ఉన్న ప్రేమను సూచిస్తుందని ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్ల నుంచి తెలంగాణ సహజ సంపదను తమ పార్టీ సర్కారు కాపాడితే కాంగ్రెస్ బిజెపిలు వాటిని చెరబడుతున్న ఈ గనుల వేలం సందర్భాన్ని తెలంగాణ చరిత్ర ఎన్నటికీ క్షమించదన్నారు.

## వేలంలో శ్రావణి బ్లాక్ ఉందా? తీసేశారా...

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: బొగ్గు గనుల వేలం పాట నుంచి శ్రావణి బ్లాక్ ఉన్నదా? తీసేశారా? స్పష్టం చేయాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రావణి బ్లాక్ ను వేలం నుంచి తీసేయాలన్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్‌ను వీడడం దురదృష్టకరమన్నారు. హైదరా బాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కిషన్‌రెడ్డికి ఎన్ని పదవులు వచ్చినా తెలంగాణ కు చేస్తున్నదేమీ లేదని, మొదటి నుంచి కూడా బిజెపి తెలంగాణ రాష్ట్రాన్నినట్టేటముంచే పనిచేస్తోందని దుయ్య బట్టారు.డిప్యూటీ సిఎం భట్టి మాటలకు, చేతలకు పొంతన లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ మేక తోలు కప్పుకున్న పులుల్లా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. శ్రావణి బ్లాక్ అంశంపైన తాము త్వరలోనే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. ఛత్తీస్ ఘడ్ తో విద్యుత్ ఒప్పందం వల్ల ఎవరో చెబితే ఆరు వేల కోట్ల రూపా యల నష్టం అని రాశారని,ఇది తప్పు అని తాము వివరణ ఇస్తే దీనిని మీడియా ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రశ్నించారు. కృష్ణా ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించకుండా, పదేళ్లు కెసిఆర్ అడ్డుపడ్డారని, బి ఆర్ ఎస్ అసెంబ్లీ లో బయట పోరాడిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వం తోక ముడిచింది కెసిఆర్ తెలంగాణ హక్కులపైన ఎపుడూ తన వైఖరి మార్చుకోలేదని, భట్టి విక్రమార్క పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్. బిజెపి కూడబలుకొని డ్రామాలుఆడుతున్నాయా?మండిపడ్డారు.

**పోచారం బిఆర్ఎస్‌ను వీడడం దురదృష్టకరం**

బిఆర్ఎస్ ఎంఎల్ఎ పోచారం శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ ను వీడటం దురదృష్టకరమని, ఆయన ఏం ఆశించి కాంగ్రెస్ లోకి వెళ్లారో తెలియదని జగదీష్ రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత కూడా కెసిఆర్‌కు పోచారం ధైర్యం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. స్వయం గా పోచారం ఎన్నో సార్లు కెసిఆర్ గొప్పతనాన్ని కొనియాడారని తెలిపారు. బిఆర్ఎస్‌కు ఇలాంటి ఒడి దొడుకులు కొత్తకాదని, 2001 నుంచి ఇలాంటివి ఎన్నో చూస్తున్నామని జగదీష్ రెడ్డి తెలిపారు.

# అత్యాధునిక సాంకేతికత, యంత్రాలతోనే.. రైస్‌మిల్లింగ్‌లో నంబర్‌వన్




మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 16వ అంతర్జాతీయ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైస్ మిల్లింగ్ పరిశ్రమలో దేశంలోనే నంబర్ వన్ స్థానానికి ఎదగాలంటే అత్యాధునిక సాంకేతికత, యంత్రాలను అందిపుచ్చుకోవాలని పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16వ అంతర్జాతీయ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో 2024ను ఆయన ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన 120 స్టాళ్లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైస్ మిల్లింగ్, నాణ్యమైన బియ్యం ఉత్పత్తిలో తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చడానికి రైస్ మిల్లర్లకు పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వ వ్యూహాన్ని మంతిర ఈ సందర్భంగా వివరించారు, మెరుగైన ఇంధన సామర్థ్యం, అధికనాణ్యత గల బియ్యం ఉత్పత్తి కోసం సాంకేతికత అప్‌గ్రేషన్‌పై దృష్టి సారిచాలన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రిగా కోదాడ, హుజూరునగర్ 6 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి నల్గొండ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన తనకు రైస్ మిల్లింగ్ సంఘంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. 'మీ సమస్యలు నాకు తెలుసు,' వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో రైస్ మిల్లింగ్ ప్రధాన పరిశ్రమగా గుర్తించి, 2 నుంచి3 లక్షల మంది నైపుణ్యం, నైపుణ్యం లేని కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ ప్రోత్సాహం, పారదర్శకత ఉంటుందని హామీ ఇచ్చారు. 'మెరుగైన సాంకేతికత మరియు తక్కువ శక్తి వినియోగంతో ఉత్పత్తి చేయబడిన బియ్యం నాణ్యతను గణనీయంగా మెరుగుపర్చవచ్చాన్నారు. మిల్లింగ్ ఛార్జీలు, రవాణా ఛార్జీలు వంటి సమస్యలను చురుగ్గా పరిష్కరిస్తామని, వాటాదారులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్), వరి కేటాయింపులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం సూచించిన వ్యవస్థలకు కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. తెలంగాణలో ఉత్పత్తి చేసే వరి వంగడాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎగుమతి అనుమతులు పొందేందుకు మిల్లర్లకు అండగా ఉంటామన్నారు. పేదల కోసం అందిస్తున్న ఉచిత బియ్యాన్ని పక్కదారి పట్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ధాన్యం సేకరణలో తెలంగాణ రెండో స్థానంలో ఉందన్నారు. 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధ్యాన్నిసేకరించామని, ఈ వాన కాలంలో సుమారు 1.7 కోట్ల టన్నుల చేరి అవకాశం ఉందన్నారు, తద్వారా'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ ఘనత సాధించే అవకాశం ఉందని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

## గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం : సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 'మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తో కలిసి హైదరాబాద్‌లోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు 'మహిళా శక్తి క్యాంటిన్ల'ను మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్ గా ఎదగాలని, దేశానికే ఆదర్శంగా నిలవాలని మంత్రి సీతక్క, సిఎస్ శాంతికుమారి ఆకాంక్షించారు. ప్రతి ఇంటి అమ్మచేతి వంటలా మహిళా శక్తి క్యాంటిన్లు నాణ్యతకు మారుపేరుగా నిలవాలని, పల్లె రుచులు, ఇప్ప పువ్వు లడ్డులు, నన్నారి వంటి సాంప్రదాయ ఆహార పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో 151 మహిళా శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం పలు బిజినెస్ మోడల్స్‌ను గుర్తించిందన్నారు. ఇందులో ప్రధానమైన ఆధార్ కేంద్రాలు, మీ సేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వం అన్నిరకాల ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, వడ్డీలేని రుణ సౌకర్యం కూడా కల్పిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు. ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తదితరులున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజా పనులు (R&B) శాఖ
"e"Procurement Tender Notice No. 01/2024-25 టెండర్ నోటీసు తేది: 14.06.2024
క్ర.సం.: 1, NIT No. EE/R& B/MNCL/1/1/2024-25, తేది: 14.06.2024. పని పేరు: మంచిర్యాల జిల్లాలో ఇందారం నుండి కుందారం రోడ్ కి.మీ.0/900 నుండి 14/300 కాలానుగుణ పునరుద్ధరణ. అంచనా విలువ: రూ.10.00 లక్షలు, కాలపరిమితి: 1 నెల. (ఉప పని: రహదారి భద్రతా జోక్యాలను అందించడం). క్ర.సం.: 2, NIT No. EE/R& B/MNCL/1/2/2024-25, తేది: 14.06.2024. పని పేరు: మంచిర్యాల జిల్లాలో కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లోని బెల్లంపల్లి-మందమర్రి మధ్య మూడవ రైల్ లైన్ నిర్మాణం-ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి నెం.165-ఎ వద్ద 2 లేన్ల ROB నిర్మాణం. (కోల్ బెల్ట్ రోడ్డు శ్రీరాంపూర్-మందమర్రి రహదారి (MDR) కి.మీ.18/8-10వద్ద). అంచనా విలువ: రూ. 6.50 లక్షలు, కాలపరిమితి: 1 నెల. (ఉప పని: శ్రీరాంపూర్ వైపు జంక్షన్ అభివృద్ధిని అందించడం). బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ మరియు ఆఖరి తేది మరియు సమయం: 18.06.2024న మ.3.00గం.ల నుండి 25.06.2024న మ.3.00గం.ల వరకు. బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 25.06.2024న మ.3.30గం.ల వరకు, సాంకేతిక బిడ్ ప్రారంభ తేది: 25.06.2024న సా.4.00గం.లకు, ఇ.ఇ. సంప్రదించు పేరు మరియు చిరునామా: ఇ.ఇ., (R& B) డివిజన్, మంచిర్యాల, ఫోన్ నెం. 08736-252098, మరిన్ని వివరాలకు https://eprocurement.telangana.gov.in/ ను చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R& B), డివిజన్: మంచిర్యాల.
DIPR R.O. No. : 143-DP/CL/ADVT/1/2024-25 Date: 21-06-2024

ప్రజాపక్షం
శనివారం, జూన్ 22

# రిజర్వేషన్‌ల పరుగుకు కళ్లెం

కులజనగణన నిర్వహించిన తొలి రాష్ట్రం బిహార్. అందులో నిర్ధారణఅయిన వివిధ కులాల జనాభాను వర్గీకరించి విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్‌లను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ శాసనసభలో చట్టం ఆమోదించిన తొలి రాష్ట్రం కూడా అదే. అయితే ఈ చట్టం రాజ్యాంగరీత్యా చెల్లుబాటు కాదని పట్నా హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలు చేస్తామని బిహార్ రాష్ట్ర బిజెపి శాఖ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధురి చెప్పారు. అయితే ఈ అప్పీలును మోదీ ప్రభుత్వం బలపరుస్తుందా? అనుమానమే. ఎందుకంటే, లోక్‌సభ ఎన్నికల సమయంలో 'ఇండి'కూటమి, కాంగ్రెస్‌పార్టీ బలంగా ముందుకుతెచ్చిన కుల జనగణనను బిజెపి వ్యతిరేకించింది. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులజనగణన నిర్వహిస్తామని, తద్వారా అణగారిన తరగతులకు వారి జనాభామేరకు దేశవనరులు వెచ్చించి వారిని త్వరితంగా వృద్ధిలోకి తెస్తామని కూటమి నాయకులు ప్రకటించారు. అణగారిన తరగతులను ఉద్ధరించటంలో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఒక చిన్న పార్శ్యం మాత్రమే. దేశంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య 2020 మార్చి నాటికి 1కోటి 88లక్షలని కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ డేటా తెలుపుతోంది. మొత్తం ఉద్యోగుల్లో ప్రభుత్వరంగం వాటా 4శాతం. మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ వేగం పెంచాక అది ఇంకా తగ్గింది. మొత్తం శ్రామికశక్తిలో 94శాతం ప్రైవేటురంగంలో పనిచేస్తున్నారు. ఇందులో నియత ప్రైవేటు రంగంలో ఉన్నది 5శాతం. మిగతా 89శాతం అనియతరంగంలో ఉన్నారు. ప్రైవేటురంగంలో రిజర్వేషన్‌లు ఉండవు. అటువంటి ప్రతిపాదన యుపిఎ ప్రభుత్వ కాలంలో రాగా పారిశ్రామిక వేత్తలు గట్టిగా వ్యతిరేకించి నిపుణత సమస్యను లేవనెత్తారు. కార్మికుల నైపుణ్యం పెంపుదలకు తోడ్పాటిస్తామన్నారు. ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వ రంగంలో కూడా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ తదితర పేర్లతో తక్కువ వేతనాలతో ప్రభుత్వాలు పని చేయించుకుంటూ రిజర్వేషన్ అవకాశాలు కుదిస్తున్నాయి. అందువల్ల, కులజనగణన అనగానే దాన్ని విద్య, ఉద్యోగాల్లో రిజర్వే షన్‌లతో ముడిపెట్టి ఎవరూ వక్రీకరణ చేయనవసరం లేదు. బెదిరిపోనవసరం లేదు.

ఇందిరా సాహ్నీ–యూనియన్ ప్రభుత్వం మధ్య కేసులో 9మంది జడ్జిలతో కూడిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 1992 నవంబర్ 16న ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్‌ను సమర్థిస్తూ మొత్తం రిజర్వేషన్‌లపై 50శాతం పరిమితి విధించింది. దేశంలో ఒబిసి కులాల జనాభా 52శాతం దాకా ఉన్నప్పటికీ సుప్రీం కోర్టు విధించిన సీలింగ్‌కు లోబడి మండల్ కమిషన్ ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్ సిఫారసు చేసింది. తమిళనాడు లాంటి ఒకట్రెండు రాష్ట్రాల్లో 60శాతం పైగా రిజర్వేషన్‌లు ఉన్నాయి. మరికొన్ని ఇతర రాష్ట్రాలు తమ జనాభా పొందికను బట్టి రిజర్వేషన్ పెంచినప్పుడు, సుప్రీం కోర్టులో వాదనలప్పుడు ధర్మాసనం కులజనాభాకు ప్రాతిపదికను ప్రశ్నిస్తూ రిజర్వేషన్‌ల పెంపును కొట్టివేస్తూ వుంది. 1937లో బ్రిటీషు వారు నిర్వహించిన కులజనగణన తదుపరి మరోగణన జరగలేదు. ఉజ్జాయింపు లెక్కలతోనే రాష్ట్రాలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఉప ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. అందువల్ల, న్యాయబద్ధంగా జనాభా ప్రాతిపదికన వనరులు కేటాయించేందుకు కులజనగణన అవసరం. రిజర్వేషన్‌లకు వర్తింపజేసే సాధ్యాసాధ్యాలు రాజకీయ స్థూలఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది. సుప్రీం కోర్టును మెప్పించటానికి కూడా కులజనాభా తాజా గణాంకాలు అవసరం. అందువల్ల కేంద్ర ప్రభుత్వమే జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్)తో పాటు కులజనగణనను(కాస్ట్ సెన్సెస్) అధికారికంగా నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిలో సామాజిక, ఆర్థిక స్థితిగతులు కూడా రికార్డు అవుతాయి. ప్రభుత్వ నిర్ణయాలకు అవి ప్రాతిపదికగా ఉపకరిస్తాయి.

కులజనగణన చేబట్టే అధికారం రాష్ట్రాలకు ఉందా అనే ప్రశ్నను అలావుంచితే, బిహార్ విషయంలో నితీశ్‌కుమార్ ప్రభుత్వం కులజనగణన నిర్వహించింది.గెజిట్ ప్రకటన చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకే క్రమాన్ని వేగిరపరిచి రిజర్వేషన్‌లుపెంచుతూ,విద్యాసంస్థల్లోఅడ్మిషన్‌లు,ఉద్యోగరిక్రూట్‌మెంట్‌పై 2023 నవంబర్‌లో రెండు చట్టాలు ఆమోదించింది. అత్యంత వెనుకబడిన కులాలకు (ఇబిసి)రిజర్వేషన్‌ను 18నుంచి25 శాతానికి, బిసిలకు12 నుంచి 18శాతానికి, షెడ్యూల్డు కులాలకు 16 నుంచి 18శాతానికి, షెడ్యూల్డు తెగలకు 1 నుంచి 2శాతానికి పెంపుచేసింది. బిసి మహిళలకు అమలులో ఉన్న 3 శాతం రిజర్వేషన్ రద్దు చేసింది.వాటిని వ్యతిరేకిస్తూ దాఖలైన వ్యాజ్యాలతో పట్నా హైకోర్టు ఏకీభవించింది.

ఇదిలా వుండగా, మోదీ ప్రభుత్వం ''ఆర్థికంగా బలహీన తరగతులకు'' (ఇబ్ల్యుఎస్)10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెచ్చిన 103వ రాజ్యాంగ సవరణ బిల్లును 2019 జనవరి 9న పార్లమెంటు ఆమోదించింది. ఈ కోటాను సుప్రీం కోర్టు సమర్థించింది. దీంతో మొత్తం రిజర్వేషన్‌లు 60శాతానికి చేరాయి. బిహార్ బిల్లుతో 75శాతానికి చేరతాయి. ఇది రాజ్యాంగ అధికరణలు 14,15,16లకు విరుద్ధంగా హైకోర్టు కొట్టివేసింది. ఇది ''డబుల్ ఇంజిన్'' ప్రభుత్వ నిర్ణయం. దీన్ని మోదీ ప్రభుత్వం సమర్థిస్తుందా? అప్పీలును కోల్డ్‌స్టోరేజిలో పెడుతుందా?

## ప్రమాద రహిత రైల్వే ప్రయాణం ఏర్పడాలి



పశ్చిమ బెంగాల్‌లోని రంగపాణి రైల్వే స్టేషన్ సమీపంలో మరోఘోరరైలు ప్ర మాదం జరిగినది డౌన్ కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు వెనుక నుండి ఢీకొట్టడంతో చాలా మంది మరణించారు. భద్రతా ప్రమాణాల పట్ల సరియైన శ్రద్ధ చిత్తశుద్ధి కనపరచడం లేదనటానికి ఈ ప్రమాదం ఒక నిదర్శనం. దీనికి సంబంధించిన అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నవి గూడ్స్ రైలు నిర్దేశించిన వేగం కంటే అధిక వేగంతో నడపడానికి ఎందుకు అనుమతించారు. అసలు రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై వెళ్ళటానికి బాధ్యులు ఎవరు ఈ సంఘటన మానవ తప్పిదమని దుర్ఘటనకు గూడ్స్ రైలు డ్రైవర్ కారణమని రైల్వే వర్గాలు తెలుపుతున్నారు. కానీ మానవ తప్పిదం లేకుండా ప్రమాదాలు జరగవు లోకోపైలట్లు మరియు అసిస్టెంట్ లోకో పైలట్‌లు దాదాపు 20000 పోస్టులు సంవత్సరాలుగా ఖాళీలు గా ఉన్నట్టు తెలుస్తున్నది మానవ వనరుల కొరతతో రైలు డ్రైవర్లు ఎక్కువ షిఫ్టులలో పనిచేయడానికి దారితీస్తున్నది.2016లో ప్రారంభించిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్, ఫీల్డ్ ట్రయల్స్ కోసం కవాచ్ 1,500కిలోమీటర్ల కంటే తక్కువ రైల్వే ట్రాక్‌లలో ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. భారతీయ రైల్వేల మొత్తం ట్రాక్ దాదాపు 70000 కిలోమీటర్లు కాలానుగుణంగా అవసరాలకు తగ్గట్టు కవాచ్ వంటి భద్రతతో పాటు రైల్వే మౌలిక సదుపాయాల ఆధునీకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి నాణ్యతతో కూడిన రక్షణ భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలి. ఈ దుర్ఘటనపై న్యాయవిచారణ జరిపి బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించాలి. అదేవిధంగా ఇటువంటి దుర్ఘటనలు మును ముందు ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా ప్రభుత్వం రైల్వే బోర్డు వారు రైల్వే శాఖలోని అన్ని విభాగాల ఉద్యోగులు కార్మిక సంఘాల నాయకులు సాంకేతిక నిపుణులు మేధావులు ఇతర స్వచ్ఛంద సంస్థలతో కూడిన విస్తృత స్థాయిలో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి భద్రతా రక్షణ చర్యల కోసం కఠినమైన నియమ నిబంధనలు రూపొందించి వాటిని ఎట్టి పరిస్థితిలోను కూడా విస్మరించకుండా అమలుపరిచినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. వీటిని కఠినంగా అమ లుపరచడానికి అవసరమైతే పార్లమెంట్‌లో ఒక చట్టం చేయాలి ప్రమాదాలు నివారించడానికి సూచనలు సలహాలు ప్రజల వద్ద నుండి కూడా విస్తృతస్థాయిలో స్వీకరించాలి. రైల్వేలోని అన్ని విభాగాలలో ఖాళీలను వెనువెంటనే శాఖ పరంగానే భర్తీ చేయాలి తద్వారా బాధ్యత పెరిగి జవాబుదారితనంగా ఉంటుంది. దేశంలో నిరుద్యోగ సంఖ్య కూడా తగ్గిపోతుంది. దేశంలో అత్యున్నత మేధోపరమైన మానవ వనరుల సంపద విస్తృతంగా ఉన్నది

ఆధునిక అత్యంత సాంకేతికతో వేగంగా నడిచే బుల్లెట్ వందే భారత్ రైళ్ళ తో సమానంగా అదే స్థాయిలో భద్రతతో కూడిన సురక్షితమైన ప్రయాణం కల్పించినప్పుడే భారత రైల్వే పట్ల ఒక భరోసా కలుగుతుంది

–దండంరాజు రాంచందర్ రావు
9849592958

# ఏ పరీక్ష చూసినా ఏమున్నది గర్వకారణం!

భారతం యువశక్తితో నిండి ఉంది. దేశ జనాభాలో 65 శాతం యువత ఉన్నది. యువత కంటున్న పెద్ద పెద్ద స్వప్నాలను సాకారం చేసుకోవడానికి విద్యనభ్యసించడం, పలు పోటీ పరీక్షలు రాయడం ద్వారా ఉద్యోగాలు, కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి నిరంతరం ఇష్టంగా కష్టపడి చదువుతున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ, ఎన్‌టిఏ పరీక్షతో మొదలు పాఠశాల బోర్డులు నిర్వహించే వార్షిక పరీక్షల వరకు భారతంలో పేపరు లీకులు సర్వసాధారణమయ్యాయి. తాజాగా నీట్ పరీక్ష పేపరు లీకు సమస్య సమసిపోక ముందే నేడు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన యూజీసీనెట్ పరీక్షలో బయట పడిన అవకతవకలను పరిగణనలోకి తీసుకొని ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో విద్యావేత్తలు, పరీక్ష రాసిన అభ్యర్థులు నివ్వెరపోతున్నారు. దేశవ్యాప్తంగా 18 జూన్ 2024 మంగళవారం 83 సబ్జెక్టుల్లో 317 నగరాల్లో 1205 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 11.21 లక్షల అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, కళాశాలల్లో అడ్మిషన్ల కోసం వేచి చూస్తున్న అర్హతలు కలిగిన యువతకు పేపర్ లీకులు శాపంగా మారుతున్నాయి. ఇటీవల నీట్2024 పరీక్ష నిర్వహణ తర్వాత తలెత్తిన లీకేజీ అంశం కూడా టాక్ ఆఫ్ ది నేషన్ అయ్యింది. 05 మే రోజున నిర్వహించిన నీట్ 2024 పరీక్షలు 571 నగరాలకు చెందిన 4,750 కేంద్రాల్లో (14 విదేశీ కేంద్రాల్లో) పరీక్షలు జరిగాయి. కొన్ని సెంటర్లలో కొంత మంది యువతకు పేపర్లు పొరపాటుగా పంపిణీ జరిగినట్లు నిర్వహకులు తెలుపడం విన్నాం. గత ఏడేళ్లలో భారత రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నిర్వహించిన పోటీ పరీక్షల్లో 70 పరీక్షల పేపర్లు లీకు కావడంతో 1.5 కోట్ల యువత భవిష్యత్తు అంధకారంలో పడిందని అంచనా వేస్తున్నారు. ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిర్వహించిన ఎంబిబిఎస్ మెడికల్ ఎంట్రెన్స్ అయిన నీట్‌యూజీ 2024 (నేషనల్ ఎంట్రెన్స్ కమ్ ఎలిజిబులిటీ టెస్ట్) పరీక్ష పేపరు లీకు అయ్యిందంటూ, వివాదాస్పద గ్రేస్ మార్కుల విధాన వార్తలు వెల్లువెత్తడంతో పరీక్ష రాసిన 23 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోను కావడం చూస్తున్నాం. ఈ అంశం సుప్రీంకోర్టు కోర్టు వెకేషన్ బెంచ్ వరకు చేరడంతో పరీక్ష ఫలితాల విషయంతో పాటు అభ్యర్థుల భవిత గాల్లో దీపం అయ్యింది.

పోటీ పరీక్షల లీకుల చరిత్ర: ఇటీవల తెలంగాణ రాష్ట్ర టిఎస్‌పిఎస్‌సి నిర్వహించిన గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష పేపరుతో పాటు ఏఈఈ ఉద్యోగ నియామకాల పరీక్ష పేపరు కూడా లీగ్‌కు కావడం, గ్రూపు1 పరీక్ష రద్దు చేయడం జరిగింది. సువిశాల భారతంలో నిత్య ఏదో ఒక మూల నుండి పరీక్ష పేపర్లు లీక్ కావడంతో పరీక్షలు రద్దు కావడం, మరో సారి పరీక్షలను నిర్వహించడం అనే వార్తలు అనాదిగా సాధారణ వార్తలుగా వినిపిస్తూనే ఉన్నాయి. మీడియా విశ్లేషణల ప్రకారం గత ఏడేళ్లలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించిన 70 వరకు పరీక్ష పేపర్లు లీకు కావడంతో దాదాపు 1.5 కోట్ల యువత ప్రభావితం అయ్యారని తెలుస్తున్నది. అదే విధంగా గత ఐదేళ్లలో 15 రాష్ట్రాల 41 పోటీ పరీక్ష పేపర్లు లీకుకావడంతో ఒక లక్ష ఉద్యోగాలకు వేచి ఉన్న 1.4 కోట్ల యువత నిరాశపాలైనారు. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో 2017 నుంచి నేటి వరకు నిర్వహించే పోటీ పరీక్షలు లీకుల స్కాములతో కంపు కొడుతున్నాయి. ముఖ్యంగా యూపీ, బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, యంపీ లాంటి పలు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన పరీక్షల పేపర్లు లీకు కావడం సర్వసాధారణం అయ్యింది. పేపర్లు లీకు కావడంతో యువత మానసిక ఒత్తిడికి గురి కావడం, వెచ్చించిన సమయం/చేసిన కృషి వృధా కావడం, భవిష్యత్తు కలలు విచ్చిన్నం కావడం, యువత ఏకాగ్రత సడలడం, పరీక్షల మీద




నమ్మకం సన్నగిల్లడం, తిరిగి పరీక్షలకు తయారు కావడం, తల్లితండ్రులు ఒత్తిడి బారిన పడడం, పేద యువతకు ఆర్థిక భారం పడడం, ప్రభుత్వ పరీక్ష నిర్వహణ వ్యవస్థల మీద చులకన భావం ఏర్పడడం లాంటి దుష్ఫలితాలు కలుగుతున్నాయి.

పరీక్ష పేపర్ లీగులను కట్టడి చేసే చట్టాలు: వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేపరు లీకుల నిరోధానికి పలు చట్టాలను చేసినప్పటికీ పేపరు లీకులు, చీటింగ్ కేసులు ఆగడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 'పబ్లిక్ ఎగ్జామ్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) ఆక్ట్, 2024'ను తీసుకురావడం చూసాం. ఈ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పరీక్ష పేపరు లీకులు రుజువైన వ్యక్తులకు 3 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంది. చట్టాలు ఎన్ని చేసినప్పటికీ లీకులు మాత్రం ఆగడం లేదు. పరీక్షల నిర్వహణకు యూపిఎస్సీ లాంటి స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఏర్పాటు కావాలి. రాజకీయ నాయకులు, ప్రభుత్వాల పాత్రకు దూరంగా పరీక్షలు నిర్వహించే ప్రత్యేక సంస్థలు ఏర్పాటు, పేపర్ నిర్వహణలో ఆధునిక ఐటీ ప్రయోజనాలను వాడుకోవడం, ఆన్‌లైన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం, పలు సెట్ల పేపర్లు తయారు చేయించడం, లీకు వీరులను సత్వరమే శిక్షించే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడం జరగాలి. కోచింగ్ సెంటర్ల ప్రమేయంతో పేపరు లీకైనపుడు ఆ సంస్థలను వెంటనే మూసి వేయడం జరగాలి. పరీక్ష పేపర్ల తయారీ నుండి మొదలుకొని పేపర్ ప్రింటింగ్, పరీక్షా కేంద్రాల వరకు పంపిణీ, పరీక్ష నిర్వహణ కేంద్రం అనే చైన్‌లో అనాయాస డబ్బు దురాశతో వ్యక్తులు దుర్బుద్ధితో ప్రతి దశలో పరీక్ష పేపర్లు లీకు చేయడానికి వెనుకబడడం లేదని గత చరిత్ర రుజువు చేస్తున్నది. పోటీ పరీక్షల పేపర్లు లీకు కావడంతో తిరిగి పరీక్షలు నిర్వహించడం, పరీక్ష నిర్వహణ వ్యవస్థల పట్ల నమ్మకం సన్నగిల్లిన యువత పరీక్షలకు పూర్తి స్థాయిలో తయారు కాకపోవడంతో అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ఇలాంటి పోటీ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఇతర దేశాల పరీక్షా నిర్వహణ వ్యవస్థలను అధ్యయనం చేస్తూ మన పరీక్షల నిర్వహణను గాడిలో పెట్టి, యువతకు సకాలంలో ఉద్యోగాలు, కోర్సుల్లో చేరడానికి ద్వారాలు తెరవాలి. బీహార్, ఢిల్లీ, రాజస్థాన్ కేంద్రాల్లో బయట పడిన నీట్ యూజీ 2024 పరీక్ష పేపర్ లీకులతో పాటు యుజీసీ నేట్2025 పరీక్ష రద్దు విషయాలను తీవ్రంగా తీసుకొని అపరాధం చేసిన ముఠా గుట్టు రట్టు చేసిన వెంటనే జైలు శిక్ష అమలు చేసి, విద్యార్థుల ప్రతిభకు సత్వరమే న్యాయం జరిగే విధం తగు నిర్ణయాలను తీసుకోవాలని పౌర సమాజం కోరుకుంటున్నది.

–బి.మధుసూధన్‌రెడ్డి, 9949700037

# భారత్‌లో మాటల్లోనే మహిళా సమానత్వ సాధన


ఎం. కోటేశ్వరరావు

బేటీ బచావో బేటీ పఢావో, మహిళా సురక్ష కేంద్ర, మహిళా పోలీసు వలంటీర్స్, రాష్ట్రీయ మహిళా కోష్, సుకన్య సమృద్ధి యోజన, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ... ఇవన్నీ మన దేశంలో ఉన్న పథకాలు, ఎవరికో చెప్పనవసరం లేదు. కొన్ని రాష్ట్రాల్లో వీటికి పేర్లు మార్చి అమలు జరుపుతున్నారు. మొత్తం మీద ఇన్ని జరిగిన తరువాత కూడా ప్రపంచంలో స్త్రీ, పురుష సమానత్వ తేడాలో 2024 ప్రపంచ 146దేశాల జాబితా ప్రకారం మన స్థానం 129. పదేండ్లతో పోల్చుకుంటే దిగజారింది. మహిళల అభ్యున్నతి గురించి గత పది సంవత్సరాలుగా తమ భుజాలను తామే చరుచుకుంటున్నారు సమాధానం చెప్పాలి. పథకాలన్నీ మావే, రాష్ట్రాలు పేర్లు మార్చుకుంటున్నాయి, అందువలన మా ఫొటోలు పెట్టాలి, వాటి ''ఖ్యాతి''లో మాకూ వాటా రావాలని కోరుతున్న బిజెపి పెద్దలు ఆ మొత్తాన్ని వారే తీసుకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. డిఎంకె సభ్యురాలు కనిమొళి రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు నాడు మంత్రిగా ఉన్న మనేకా గాంధీ 2015 మే 7వ తేదీన ఇచ్చిన జవాబు సారం ఇలా ఉంది: ప్రపంచ ఆర్థికవేదిక (డబ్ల్యుఇఎఫ్) లింగసమానత్వ తేడా నివేదిక 2014 ప్రకారం 142దేశాలలో భారత్ 114వదిగా ఉంది. అంతకు ముందు సంవత్సర నివేదిక ప్రకారం 136 దేశాలలో 101వదిగా ఉంది. ఏడాది కాలంలోనే ఇంతగా దిగజారి పో వటానికి కార్మికశక్తిలో మహిళా భాగస్వామ్యం తగ్గ టం, అవకాశాలు లేకపోవటమే అని పేర్కొన్నారు. అలాంటిది కొన్ని మార్పులు జరిగినా పదేండ్ల తరువాత 101 నుంచి 129వ స్థానానికి దిగజారింది. కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది బిజెపి, మిత్రపక్షాలే, మెరుగుపరచకపోయినా దిగజారటానికి నెపం నెహ్రూ మీదో, గాంధీ మీదో నెడితే కుదరదు.

ఈ సూచికలను రూపొందించటానికి నాలుగు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు.1.ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం, అవకాశాలు,2.విద్య అవకాశాలు,3.ఆరోగ్యం,బతుకు, 4.రాజకీయ సాధికారత. వీటన్నింటిలో ఏదేశం ఎక్కడుందనే సూచికలో, పాయింట్లు వేస్తారు. వాటన్నింటిని కలిపి మొత్తంగా సాధారణ సూచికలను రూపొందిస్తారు. ఇలాంటి నివేదికలను 2006 నుంచి ప్రతి ఏటా రూపొందిస్తున్నారు. పరిగణనలోకి తీసుకున్న 146దేశాల సగటు లింగ సమానత్వం 2024లో 68.5శాతం ఉంది. గతేడాది కంటే కేవలం 0.1శాతమే మెరుగైంది. అంటే 31.5శాతాన్ని పూరించాల్సి ఉంది. ఇప్పుడున్న వేగంతో తేడాను పూర్తిగా తగ్గించాలంటే 134 సంవత్సరాలు పడుతుంది. ప్రపంచంలో నూటికి నూరుశాతం సమానత్వం సాధించిన దేశమేదీ లేదు. మొదటి స్థానంలో ఉన్న ఐస్‌లాండ్‌లో 93.5శాతం సాధించారు.భారత్‌లో 64.1శాతం ఉంది. ఈ లెక్కన పూర్తి సమానత్వం సాధించటానికి కనీసం 152 సంవత్సరాలు పడుతుంది. దక్షిణాసియా, మన దేశంలో లింగ బేధాలను తగ్గించటంలో పదేండ్ల మోడీ పాలన ఘోరంగా విఫలమైంది. మరింత దిగజారింది.ఇరుగుపొరుగు దేశాలలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ తరువాత ఐదవదిగా మనదేశం ఉంటే బిజెపి పెద్దలు నిత్యం స్మరించే పాకిస్తాన్ ఏడవదిగా ఉంది.ఆర్థిక భాగస్వామ్యం, ఆరోగ్యంలో 146కు గాను 142వదిగా ఉంది.(మన తరువాత పాకిస్తాన్ ఉంది) విద్య అందుబాటులో 112, రాజకీయ రంగంలో 65, కార్మికశక్తి భాగస్వామ్యంలో 134వదిగా ఉంది. విద్యాఅవకాశాలు, రాజకీయ సాధికారత తగ్గుదల కారణంగానే గతేడాది వచ్చిన 127వ రాంకు 129కి దిగజారింది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినప్పటికీ ఆ స్ఫూర్తిని రాజకీయ పార్టీలేవీ






పాటించలేదు. దాని ఘనత తమదే అని భుజాలు చరుచుకున్న బిజెపి 30 మంది కాబినెట్ మంత్రులకు గాను కేవలం ఇద్దరికి, మొత్తం మంత్రివర్గంలో గతంలో ఉన్న పది మందిని ఈ సారి ఏడుకు తగ్గించింది. నేపాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్న మంత్రులలో 23.5 శాతం మంది మహిళలే ఉన్నారు. చట్టసభల్లో మహిళల ప్రపంచ సగటు 33శాతం కాగా అక్కడ 49.9శాతం ఉంది.

జనాభాలో సగంగా ఉన్న మహిళలకు ఉత్పాదక రంగంలో భాగస్వామ్యం కల్పించకుండా వారి సాధికారత గురించి ఎన్ని కబుర్లు చెప్పినా వట్టిస్తరి మంచి నీళ్లు తప్ప మరొకటి కాదు. గడచిన పది సంవత్సరాల్లో జరిగింది అదే. లింగసమానత్వ తాజా నివేదికలో మన దేశంలో కార్మికశక్తిలో మహిళా భాగస్వామ్యం 35.09శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశట్టే ముందు నరేంద్రమోడీ తన పాలనలో మహిళాభ్యున్నతిని చూసి ప్రతిపక్షాలు ఆత్మశోధన చేసుకోవాలని చెప్పారు. తన పదేండ్ల ఏలుబడిలో దిగజారిన రాంకును చూసి తలవంచుకుంటారా ? ప్రతిపక్షాలకు సుభాషితాలు చెబుతూనే ఉంటారా ? ప్రభుత్వం ప్రకటించిన సమాచారాన్ని విశ్లేషించిన పరిశోధకులు చెబుతున్న అంకెలకు, ప్రభుత్వ లెక్కలకు పొంతన కుదరటంలేదు. స్టాటిస్టా విశ్లేషణ ప్రకారం 2014–2022వరకు తొమ్మిదేండ్ల సగటు 26.81 శాతంకాగా 2023లో32.68శాతంఉన్నట్లు అదేసంస్థ పేర్కొన్నది. ఒక్కసారిగా అంత ఎలాపెరిగింది? ప్రపంచబ్యాంకు లెక్క 32.7 శాతం అన్నది. దేశంలో 2022–23లో నియమిత కాల కార్మిక శక్తి సర్వే ప్రకారం మహిళలు అంతకు ముందుతో పోలిస్తే 4.2శాతం పెరిగి యూజువల్ స్టేటస్ లెక్కింపు అవగాహన ప్రకారం 37శాతానికి చేరినట్లు కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు తొమ్మిదిన ప్రకటించింది.

ఇండియా టుడే వెబ్‌సైట్ 2023 జూన్ పదకొండున రోషిణీ చక్రవర్తి రాసిన విశ్లేషణకు '' భారత్‌లో తగ్గుతున్న మహిళా శ్రామికులు, ఎందుకు మహిళలు పని చేయటం లేదు '' అనే శీర్షిక పెట్టింది. భారత్‌లో వేతనాలు చెల్లించే ఉపాధిలో మహిళలు ఇరవైశాతానికి లోపుగానే ఉన్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదికను దానిలో ఉటంకించారు. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం ఉపాధిలో కేవలం 19.2శాతం మం ది మాత్రమే మహిళలు ఉండగా పురుషుల్లో 70.1 శాతం ఉన్నారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే 2025 నాటికి జిడిపిలో 70వేల కోట్ల డాలర్లు పెరుగుతుందన్నది ఒక అం చనా. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం భారత్‌లో 52శాతం మంది మహిళలు వేతన ఉపాధి లేదా కుటుంబ సంరక్షణలో రెండింటిలో ఉంటామని చెప్పారు.కానీ 2005లో 32శాతంగా ఉన్న మహిళా శ్రామిక శక్తి 2021నాటికి 19.2శాతానికి తగ్గింది. ప్రపంచంలోని అతితక్కువ 20దేశాల్లో ఒకటిగా ఉందని, గత కొద్దిసంవత్సరాలుగా తగ్గుతున్నట్లు ప్రముఖ మీడి యా సంస్థ అల్ జజీరా పేర్కొన్నది. అధికారిక సమాచారాన్ని విశ్లేషించినపుడు 2004లో గరిష్టంగా 35శాతం మంది మహిళలు ఉపాధి పొందగా 2022 నాటికి 25శాతానికి తగ్గినట్లు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త రోజా అబ్రహాం చెప్పిన అంశాన్ని అల్ జజీరా ఉటంకించింది. పని చేయగలిగిన వయస్సు వారి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి పెరగటం లేదని, గత దశాబ్దిలో మంచి ఉద్యోగాలు గణనీయంగా తగ్గినట్లు, తక్కువ వేతనాతో పని చేయటం కంటే ఇల్లు, పిల్లలను చూసుకోవటం మరింత లాభదాయకమని వారి కుటుంబాలు భావిస్తున్నాయని సిఎంఐఇ డైరెక్టర్ మహేష్ వ్యాస్ చెప్పిన మాటలను ఉటంకించింది.శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పదిశాతం పెరిగితే జిడిపి 552 బిలియన్ డాలర్ల మేరకు పెరుగుతుందని 2018లో మెకెన్సీ నివేదిక పేర్కొన్నది. చిత్రం ఏమిటంటే మహిళలకు అన్ని గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం, ఇన్ని మరుగుదొడ్లు కట్టించాం అని ఊరూవాడా ప్రచారం చేసే బిజెపి ప్రచార దళాలు తమ రెండింజన్ల డ్రైవర్లు సాధించిందేమిటో, పదేండ్లలో పరిస్థితి ఎందుకు దిగజారిందో ఎక్కడా మాట్లాడటం లేదు. గోడీ మీడియా సంగతి సరేసరి తేలుకుట్టిన దొంగల్లా నోరెత్తటం లేదు. ఈ అంశాన్ని పట్టించుకోవాల్సింది కాదన్నట్లుగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని కోల్పోవటానికి మహిళా ఉపాధి తగ్గటం కూడా ఒక కారణమే.

# నాటి ఫిరాయింపులే నేడు ఫిరంగులు..

రాజకీయాల్లో ఒక రాజకీయ పార్టీకి విధేయుడిగా ఉంటూ ఆ రాజకీయ పార్టీ తరపున ఎన్నికలలో నిలబడి గెలిచి పదవులను పొందిన తరువాత అక్రమంగా మరొక పార్టీలో చేరడాన్ని ఫిరాయింపు లేదా పార్టీ ఫిరాయింపు అంటారు.

మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అప్పటి టిఆర్‌ఎస్ ప్రస్తుత బిఆర్‌ఎస్ పార్టీ మెజార్టీ సీట్లతో 63 స్థానాల్లో గెలిచి అధికారంలోకి వచ్చింది. దోపిడీకి గురియినది, నీళ్ళు, నిధులు, నియామకాల్లో, అన్యాయం జరిగింది అని సాధించుకున్న తెలంగాణలో నూతన రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన మీద దృష్టి పెట్టాల్సిందిపోయి. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. మెజారిటీ ఉన్న, ప్రతిపక్షం లేకుండా చేయాలి దేయంతో 15మంది సభ్యులున్న టీడీపీ శాసనసభ పక్షం మొత్తాన్ని తమ పార్టీలో విలీనం చేసుకుంది. కొంత మందికి పార్టీ ఫిరాయింపు చట్టానికి వ్యతిరేకంగా మంత్రిలుగా పదవులు కట్టబెట్టారు. కాంగ్రెస్ పక్షం నుంచి 12మంది ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్లో చేరిపోయారు. ప్రతిపక్షాల నాయకులను తమపార్టీలో చేర్చుకుని టీఆర్‌ఎస్ స్థానాలకు పెంచుకొని తెలంగాణ ప్రజలను విస్మయానికి గురిచేసింది.

అహంతో చేసిన వాక్యాలు పతనానికి దారితీ



స్తున్నాయి. రాజకీయాల్లో ప్రతిపక్ష పార్టీలు ఉంటేనే ప్రజాస్వామ్యం బతకగలుగుతుంది. అధికార పక్షానికి ప్రతిపక్షం అనేది ఎప్పుడూ ప్రశ్నలతో పాలన గాడి తప్పకుండా ఒక యంత్రంవలే పనిచేస్తుంది. ప్రతిపక్షాన్ని లేకుండా చేసిన తమ విధానమే ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ ఎదుర్కొంటున్నది, కాలం ఎంత త్వరగా గుణపాఠం నేర్పిస్తుందో మనం ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితిని చూస్తే స్పష్టంగా అర్థం అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆ పార్టీలో అనేక మంది మాకు టచ్ లో ఉన్నారు, మహారాష్ట్ర వలే ఏకనాథ్ షిండేలు ఉన్నారు, 39 సీట్లు చేతిలో పట్టుకొని మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టబోతున్నారు ప్రకటిస్తు నేరుగా వాళ్ళే పార్టీని పతనావ్యవస్థకు తీసుకెళ్ళారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించేవిధంగా ఉందని భావించిన అధికార పార్టీ నాయకులు రంగంలోకిదిగి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులను తమ పార్టీలో చేర్చుకునే విధానంకు శ్రీకారం చుట్టారు.. గత పది ఏళ్లలో వాళ్ళు చేసింది అదే కాబట్టి. వారికి నాటి ఫిరాయింపులే నేడు ఫిరంగులు అయినాయి.. బీఆర్‌ఎస్ నేర్పిన ఫిరాయింపుల రాజకీయాలు నేడు ఆ పార్టీకే ప్రమాదకరంగా మారిపొయ్యాయి.

పదే పదే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతాది అనే మాట తూటాల తయారవుతుంది...? రేవంత్ రెడ్డి పదవి కొల్పతాడు, ప్రభుత్వం పడిపోతది, మళ్ళీ అధికారం చేపట్టబోతున్నం అనే వాక్యాల వలన, తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు ముందు, తరువాత రాజకీయ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరా యించడం జరుగుతూనే ఉంది, ఇటీవల లోకసభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుపొందకపోవడంతో, ఉన్న నాయకులకు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా కనిపిస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రభుత్వం, రైతు రుణమాఫీకి రంగం సిద్దంచేసి ఉంచారు, గ్యారెంటీ పతకాలు శరవేగంగా అమలు చేయుటకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు కనుక, మరో కొంతమంది శాసనసభ్యులు జై కొడుతూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. స్థానికంగా వారినే నమ్ముకున్న క్యాడర్, కార్యకర్తలకు కూడా ఇప్పుడు గడ్డు పరిస్థితులు, వారి అగ్రనాయకులు నోటి దురుసుతోనే పార్టీ పరిస్థితి బలహీనతకు దారితీస్తుంది అని మొరపెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుంది అని వ్యాఖ్యలు చేస్తున్న బారసా నేతలు మనది అయితే సోమవారం మందిది అయితే మంగళవారం అన్నట్లు యావత్ ప్రజాలోకానికి కనిపిస్తుంది.

జాజుల దినేష్,
9666238266

# యోగాతో కొత్త ఆర్థిక వ్యవస్థ



మంచుకొండల్లో, యుద్ధనౌకలపై సైనికుల ఆసనాలు

కశ్మీరంలో మోదీ : దేశవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవం



**శ్రీనగర్ :** యోగా వల్ల కొత్త ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుందని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. జమ్ముకశ్మీర్ శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఒడ్డునున్న షేర్ ఏకశ్మీర్ అంతర్జాతీయ సమావేశ కేంద్రం వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. 50 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పదేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకొంటున్నామన్న మోదీ, విదేశాల్లో యోగా చేసే వారిసంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. ఒక్క జర్మనీలోనే నిత్యం కోటిమందికి పైగా యోగా చేస్తున్నారని వివరించారు. యోగా నేర్పేందుకు వందల సంఖ్యలో సంస్థలు వెలిశాయని గుర్తుచేశారు. యోగా నేర్పే మహిళకు పద్మశ్రీ పురస్కారం దక్కిందన్న మోదీ, భారత్‌లోని అనేక వర్సిటీలు యోగా కోర్సులు ప్రారంభించాయన్నారు. కోట్ల మందికి యోగా అనేది దైనందిన కార్యక్రమమైందని వివరించారు. ధ్యానంతో ఏకాగ్రత, యోగాతో అపారశక్తి కలుగుతాయన్నారు.'గత10ఏళ్లలోయోగా విస్తరించిన తీరు యోగాకు సంబంధించినఅవగాహనమార్చింది. నేడు, ప్రపంచం కొత్త యోగా ఆర్థిక వ్యవస్థను చూస్తోంది. భారతదేశంలో, రిషికేశ్, కాశీ నుంచి కేరళ వరకు యోగా పర్యాటకానికి సంబంధించిన కొత్త వాణిజ్యం కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులు భారతదేశంలో ప్రామాణికమైన యోగా నేర్చుకోవాలని కోరుకునేందుకు భారతదేశానికి వస్తున్నారు. ప్రజలు తమ ఫిట్‌నెస్ కోసం వ్యక్తిగత యోగా శిక్షకులను నియమించుకుంటున్నారు. సంస్థలు కూడా ఉద్యోగుల కోసం యోగా ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ యువతకు కొత్త అవకాశాలను, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించాయి.' అని మోదీ చెప్పారు.

**యోగాసనాలు వేసిన కేంద్రమంత్రులు:** దేశవ్యాప్తంగా పలువురు కేంద్రమంత్రులు, ఎంపిలు, ముఖ్యమంత్రులు యోగా సనాలు వేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో యోగాగురురామ్‌దేవ్‌బాబా, ఆచార్య బాలకృష్ణతో కలిసి యోగాసనాలు వేశారు. ఆ కార్యక్రమానికి చిన్నారులతో పాటు పెద్దలు పెద్ద ఎత్తున తరలి వచ్చి యోగా చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రులు బిఎల్ వర్మ, హెచ్‌డి కుమారస్వామి, కిరణ్ రిజిజు, రాజ్‌నాథ్‌సింగ్, జెపి నడ్డా తదితరులు 10వ అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని యోగాసనాలు వేసి జరుపుకున్నారు.

**యుద్ధనౌకపై యోగా:** ఢిల్లీలోని కరియప్ప పరేడ్ గ్రౌండ్స్‌లో ఆర్మీచీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్రద్వివేది సైనిక సిబ్బందితో కలిసి యోగా చేశారు. ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠితో పాటు పలువురు నావికాదళ అధికారులు వేశారు. సముద్రంలో ఐఎన్ఎస్ విక్రమాదిత్య యుద్ధనౌకపై నావికాదళ కుటుంబీకులతోపాటుఔత్సాహికులయోగాసనాలుఆకట్టుకున్నాయి.

**మంచుకొండల్లో సైనికుల ఆసనాలు:** ఎప్పటిలాగే ఈసారి యోగాదినోత్సవాన్ని సైనికులు ఘనంగా నిర్వహించారు. నార్తన్ ఫ్రాంటియర్ మంచుకొండలు, ఈస్టర్న్ లథక్ వంటి ప్రతికూల ప్రాంతాల్లో సైనికులు చేసిన యోగాను సైనిక వర్గాలు పోస్టు చేశాయి.లేహ్‌లోని వాంగ్‌చుక్ స్టేడియంలో సైనిక సిబ్బంది సామూహిక యోగాసనాలు వేశారు. ఆర్ఎస్ పొరా సెక్టార్‌లో బిఎస్ఎఫ్ బలగాలు యోగా చేయగా, ప్యాంగ్‌సొంగ్ లేక్ ఒడ్డున స్థానిక పాఠశాల చిన్నారులు వేసిన యోగాసనాలు ఔరా అనిపించాయి.

**టైం స్క్వేర్ వద్ద యోగా:** న్యూయార్క్‌లోని టైం స్క్వేర్ వద్ద ప్రవాస భారతీయులతో పాటు అమెరికన్లు యోగాడే జరుపుకొన్నారు.

## మహేందర్ స్ఫూర్తితో పోరాటాలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కామ్రేడ్ వేముల మహేందర్ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిద్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు వేముల మహేందర్ మూడవ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను ప్రతి సంవత్సరం రివైజ్ చేసి, సవరణ చేసి అమలు చేయవలసిన బాధ్యత వారి పైన ఉన్నదని అన్నారు. కానీ సంవత్సరాల గడుస్తున్న కనీస వేతనాలను అమలు చేయడం లేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లెల్ల పెంటయ్య, గంగదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు సిర్పంగి స్వామి, గుంటోజి శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులు పల్లెర్ల ఆంజనేయులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొలుపుల వివేకనంద, జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నంపట్ల కృష్ణ,పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సద్వినియోగం..

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు పక్కన ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు, న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కలెక్టరేట్, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్‌వో పవన్ కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత తదితరులున్నారు.

## పంట నమోదు తప్పనిసరి



**ప్రజాపక్షం/చింతపల్లి:** రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వింజమూరు, ధైర్యపురి గ్రామ పంచాయతీలలో రైతులు వేసిన పత్తి పంటలను శుక్రవారం శ్రవణ్ కుమార్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా శరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా సర్వే నంబర్ల వారిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పత్తి సాగులో ఆరు వరుసలకు ఒక వరుస కంది పంటను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత తరుణంలో వర్షాభావ పరిస్థితుల వలన పత్తి విత్తనాలు నాటవద్దని రెండు, బలమైన వర్షాలు పడిన తర్వాతనే నాటుకోవాలని రైతులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ప్రతి మంగళవారం ప్రధాన శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా పంటల మీద సూచించే సలహాలను, సూచనలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇఓ లు ఏ. నరసింహ, ఎస్. మధు, రైతులు పాల్గొన్నారు.

## యోగశాస్త్రానికి వన్నెతెచ్చిన అల్ఫోర్స్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ హైస్కూల్‌లో యన్‌సిసి సమన్వయంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విధ్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఎటువంటి ఆరోగ్య సమస్య లేకుండా జీవితాన్ని గడపాలనుకుంటారని, దానికి ఎటువంటి అవరోధాలు లేకుండా చూసుకోవాలని సూచిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఆరోగ్య సమాజానికై చేయూతనిచ్చి ముందంజలో ఉండాలని తెలిపారు. నేడు ప్రపంచంలో చాలా మంది రోగాల బారిన పడుతున్నారని, దీనికి ప్రధాన కారణం వ్యాయామం, యోగా చేయకపోవడమేనని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు ప్రతి రోజు యోగాను సాధన చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. యోగా ద్వారా ప్రతి ఒక్కరు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడమే కాకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడం ద్వారా ఉద్యోగాన్ని కొనసాగిస్తూ చక్కగా జీవితాన్ని కొనసాగించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , యన్‌సిసి క్యాడెట్స్ పూజశ్రీ, సూర్య ప్రకాశ్, యోగా శిక్షకులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు డిండి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నెంబర్ ప్లేట్ లేని 10 ద్విచక్ర వాహ్హనాలను సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈసందర్భంగా వాహన దారులకు ఎస్ఐ రాజు కౌన్సిలింగ్ నిర్వహించి మండల ప్రజలు తప్పనిసరిగా తమ వాహనాలకు నెంబర్ ప్లేట్ ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు.

## ఆర్థిక బలోపేతానికి ప్రాధాన్యం

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పథకాలపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో చేపట్టే పనులు, పథకాలు ప్రజల భాగస్వామ్యంతో జరగాలని అన్నా రు. డిఆర్‌డిఎఓ శాఖలో పని చేస్తున్న మండల, గ్రామస్థాయి అధికారులు పనుల పట్ల నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈజిఎస్ విభాగానికి సంబంధించిన అర్హత గల ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు అందించి నూరుశాతం పని దినాలు కల్పించాలన్నారు. మహిళాశక్తిలో ఉన్న అన్ని అంశాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని డిఆర్‌డిఓను ఆదేశించారు. ఎంటర్ప్రైజెస్, స్కూల్ యూనిఫాం, మీసేవా కేంద్రాలు అంశాలపై సంబంధించిత జిల్లా అధికారులకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ఫామ్ విభాగంలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 5 యూనిట్ల చొప్పున గుర్తించాలని, పనుల నివేదికను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో జల వనరులను జియో ట్యాగు గుర్తించాలన్నారు. ప్లాన్టేషన్ సంబంధించి మండల, గ్రామ స్థాయిలో పూర్తి స్థాయి నివేదికలను అందజేయాలన్నారు. హైద్రాబాద్, విజయవాడ హైవేలలో రోడ్డుమధ్యలో పెంచుతున్న మొక్క (బ్రతికి ఉన్న, చనిపోయిన)ల నివేదికను తయారు చేయాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెట్టాలని సూచించారు.

## విద్యా వ్యాపారాన్ని అరికట్టండి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ పక్షాన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ జిల్లా లోని భువనగిరి, చౌటుప్పల్, మోత్కూర్, వలిగొండ తదితర మండలాలలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులనుమనోవేదనకుగురి చేస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బెల్ట్, బూట్లు తదితర వస్తువుల పేరుతో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ సమస్యలపై గతంలో అనేకమార్లు డీఈవో దగ్గరికి తీసుకువెళ్లిన కనీసం పట్టింపు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అన్ని మండలాలకు ఎంఈఓలను నియమించాలని కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని,మౌలిక వసతులు కల్పించాలని డిమా ండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించినకేంద్రీయ విద్యాలయానికి సర్వీసు రోడ్డు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, నవీన్, భరత్ వినిల్ పాల్గొన్నారు.

## డిఎఓ, హెచ్‌డబ్లుఒ పరీక్షలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** టిఎస్ పిఎస్‌సి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంతో పాటు కోదాడలో నిర్వహించే డిఎఓ, హెచ్‌డబ్ల్యూఓపరీక్షలను అధికారులు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లాఅదనపుకలెక్టర్ బిఎస్ లత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోఅధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలు జూన్ 24 నుండి 29తేదీవరకు కోదాడ, సూర్యాపేట కేంద్రాల్లో 2780మంది అభ్యర్థులు ఉదయం,మధ్యాహ్నపరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.డిఏఓ పరీక్ష ఈనెల 30 నుండి జూలై 4వరకు సూర్యాపేట, కోదాడ కేంద్రాల్లో 2025 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 10గంటల నుండి ప్రారంభమవుతుంది.

## టియుడబ్ల్యుజె రాష్ట్ర మహాసభలు విజయవంతం



**ప్రజాపక్షం/ ఖమ్మం:** తెలంగాణరాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఖమ్మంలో 18, 19, 20 తేదీలలో కామ్రేడ్ అమర్‌నాథ్ ప్రాంగణం ఉషా హరి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన విషయం విధితమే. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర 10 రాష్ట్రాలసోహార్థ ప్రతినిధులు, ఐజెయు ప్రతినిధులు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు,జాతీయ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించగా అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మీడియా అకాడమీ ఛైర్మన్, ఐజెయు అధ్యక్షులు కె. శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగిన మహాసభల్లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అతిథులు హామీ ఇవ్వగా మహాసభ ఉద్యోగ భద్రత, కనీసవేతనం, జర్నలిస్టుల సంక్షేమం, అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు తదితర అంశాలు చర్చించి హక్కులు, సంక్షేమ సాధనకు మహాసభల్లో కార్యాచరణ రూపొందించారు. కార్యదర్శి విరహత్‌అలీప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. వివిధ జిల్లాల ప్రతినిధులు చర్చలో పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సంఘం బలోపేతం, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ సాధనే లక్ష్యంగా మహాసభలలో కార్యాచరణ రూపొందించారు. ఖమ్మంజిల్లా కమిటీ ఈ మహాసభలకు విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎటువంటి లోటుపాట్లు లేకుండా మహాసభలను విజయవంతంగా నిర్వహించింది. నెలరోజుల పాటు 50 మంది జర్నలిస్టులు అహర్నిశలు కష్టపడి మహాసభలను విజయవంతం చేశారు. రాంనారాయణ నేతృత్వంలో అధ్యక్షులుగా కూరపాటి ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా వనం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఏనుగు వెంకటేశ్వరరావు మరో 36 మందితోఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది సబ్ కమిటీలను ఏర్పాటు చేసి ఒక్కో కమిటీలో ఐదారుగురు సభ్యులు ఈ మహాసభల విజయవంతానికి కృషి చేశారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఖమ్మం నియోజక వర్గ యూనియన్, టియుడబ్ల్యూజె వైరా యూనిట్లు సహకరించాయి.

**నూతన కమిటీ ఎన్నిక**

ఐజెయు అధ్యక్షులు, మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో రాష్ట్ర నూతనకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలోనే సంఘం నియమ నిబంధనల ప్రకారం రాష్ట్ర అధ్యక్షునిగా కె. విరహత్ అలీ ఎన్నిక కాగా మహాసభల్లో చివరి రోజు గురువారం ప్రధాన కార్యదర్శితో పాటు ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులు, కోశాధికారితో పాటు 16మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**ఖమ్మంకు తొలిసారి :**

టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కె. రాంనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాంనారాయణ సుదీర్ఘ కాలం యూనియన్‌కు దన్నుగా నిలిచారు. గతంలో యూనియన్ జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పని చేశారు. యూనియన్ సంక్లిష్ట స్థితిలో ఉన్న ప్రతిసారి దన్నుగా నిలవడమే గాక యూనియన్ బలోపేతానికి కృషి చేశారు. 1952లో ఏర్పడిన అప్పటి ఏపియుడబ్ల్యూజె ఆ తర్వాత రాష్ట్ర సాధన అనంతరం ఏర్పడిన టియుడబ్ల్యూజె లో ఖమ్మంజిల్లాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం ఇదే తొలిసారి. ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ఆయనకు అభినందనలు తెలిపారు.

**రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మాటేటి వేణుగోపాల్**

టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఖమ్మంకు చెందిన మాటేటి వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేణుగోపాల్ మూడు దశాబ్దాలుగా యూనియన్‌లో వివిధ హోదాలలో పని చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యునిగా పని చేసిన వేణు గోపాల్ గత కొంత కాలంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పని చేస్తున్నారు.ఆయన ఎన్నిక పట్ల పలువురు అభినందించారు. వేణు మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.

## ఆసుపత్రుల గౌరవాన్ని చాటుదాం

జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి ప్రభుత్వ జీతం పొందుతూ పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, డాక్టర్లు, సిబ్బందిప్రజల కోసమే పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులు,అధికారులు, హెచ్‌ఓడీలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ,కళాశాల ప్రిన్సిపాల్ లతో సమావేశమయ్యారు.తాను జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించడం జరిగిందని, ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో వారంలో మార్పు కనిపించాలని అన్నారు. వారం రోజుల్లో ఆసుపత్రిలోని ఆయా డిపార్ట్మెంట్ల వారిగా సమీక్ష నిర్వహిస్తాను ఇందుకు హెచ్ ఓ డి లు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజకుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళ్యాణ్ చక్రవర్తి ,టిఎస్ ఎంఐడిసి, విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తదితరులున్నారు.

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటాలొద్దు

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీ పరిధిలో బేకరీలపై జిల్లా ఇంచార్జ్ ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి హాలియా మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీతో కలిసి తనిఖీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన నిర్వహించిన ఈతనిఖీలలో అపరిశుభ్రంగా ఉండడంతోపాటు సరైన నాణ్యతలేని పదార్థాలను వినియోగిస్తున్న బేకరీలపై కొరడా ఝుళిపించారు. తనిఖీలో భాగంగా అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు ఫేమస్ బైక్స్ అను బేకరీలో అపరిశుభ్రంగా ఉన్న బేకింగ్ గదులను పరిశీలించి 15వేల రూపాయలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాదులో గల స్టేట్ ఫుడ్ ల్యాబ్ కి పంపించామని వారు చెప్పారు. ఆ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత అవి కల్తీ అని తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్స్ పెక్టర్ స్వాతి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం జరిపిన అపరిశుభ్రత కలిగి,కల్తీ ఆహారం విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరిశుభ్ర వాతావరణం కలిగి ఉన్న బేకరీని మున్సిపల్ కమిషనర్ తాత్కాలికంగా మూసివేశారు. హాలియాపట్టణంలోగలప్రభుత్వబీసీసంక్షేమ హాస్టల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## అఘాయిత్యాన్ని ఖండించాలి

గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో నివా సం ఉంటున్న చెంచుతెగకు చెందిన గిరిజన రైతుకూలీ మహిళాపై అమానుషంగా చిత్రహింసలకు గురిచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని రమావత్ అంజయ్య నాయక్ ప్రభుత్వాన్ని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. మర్మాంగాలపై పచ్చి కారం పోసి హింసించటం సభ్య సమాజం తలదించుకునే సంఘటన అన్నారు. చెంచు గిరిజన మహిళాపై జరిగిన దాడిని సభ్య సమాజం, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. దోషులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, అత్యాచార కేసులను నమోదు చేయాలని అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. ఈ చర్యకు ఒడిగట్టిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం ఈ రాష్ట్రంలో తమ బాధ్యతలను గుర్తెరిగి పని చేయటం లేదని విమర్శించారు.

## నాగర్‌కర్నూలు ఘటన సిగ్గుచేటు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** నాగర్‌కర్నూలు జిల్లాలో నిరుపేద చెంచు మహిళపై జరిగిన దారుణం సభ్యసమాజం సిగ్గుపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరుతూ అడ్డగోలు దందాలు చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న క్రిమినల్స్పై చర్యలు తీసుకోకుండా వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. మహిళపై దారుణానికి ఒడిగట్టిన నీచులను కఠినాతి కఠినంగా వ్యవహరించాలని, తప్పు చేయాలనుకునే క్రిమినల్స్ గజగజ వణికేలా ఉక్కుపాదం మోపాలని కోరారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో అనవసర అంశాలను పక్కనపెట్టి ఎన్నికల హామీల అమలుపై చర్చించాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం హుజురాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇల్లందకుంట దేవాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్, గూడ అంజన్న వర్ధంతి సంధర్భంగా ఇరువురికి నివాళి అర్పిస్తూ వారి సేవలను స్మరించుకున్నారు. కార్యకర్తలు, ప్రజల ఆశీర్వాదంతో వచ్చిన పదవి అని, కేంద్రం అప్పగించిన బాధ్యతలను తూచ తప్పకుండా నిర్వహిస్తానని, ప్రజలనమ్మకాన్నొకోల్పోకుండా పనిచేస్తానన్నారు. తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్, గూడ అంజన్న వర్ధంతి సంధర్భంగా వారికి నివాళి అర్పిస్తున్నానన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను వంచించిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోందన్నారు. 6 గ్యారెంటీల పేరుతో మోసం చేస్తోందన్నారు. మంత్రి వర్గ సమావేశంలో పనికిమాలిన అంశాలపై చర్చను పక్కనపెట్టి ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో, అందుకు అయ్యే ఖర్చుపై చర్చించాలని కోరుతున్నానన్నారు. కేబినెట్ భేటీ అనంతరం యుద్ధ ప్రాతిపదికన 6 గ్యారంటీల అమలు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## నిషేధం ఉన్నా.. జోరుగా సాగుతున్న అమ్మకాలు

పట్టణాల నుండి పల్లెల వరకు

గుట్టుగా గుట్కా దందా..

పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలా తయారి, నిల్వ, రవాణ, అమ్మకాలపై 24 మే 2024న నిషేధం విధింది. ఆహార భద్రత రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయిన గుట్కా దందా సూర్యాపేట జిల్లాలో గుట్టుగా కొనసాగుతుంది. దీంతో ప్రభుత్వం విధించిన నిషేధం ఒట్టిమాటే అయింది. పట్టణాల నుండి పల్లెల వరకు గుట్కా అమ్మకాలు జరుగుతున్నాయి. గుట్కా అమ్మకాలను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ళ మత్తులో జోగుతున్నారనేవిమర్శలువ్యక్తమవుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో నిషేధిత గుట్కా దందా గుట్టుగా సాగుతుంది. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడ, హుజూర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిల పరిధిలో అనేక మంది వ్యాపారులు ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గుట్కాను నిషేధించడంతో డిమాండ్ బాగా పెరిగింది. దీనికి అలవాటు పడిన వారు మానే పరిస్థితిలో లేకపోవడంతో వారి అవసరాలను ఆసరగా చేసుకొని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. హైద్రాబాద్, విజయవాడ, మహారాష్ట్ర, కర్నాటక, చత్తీష్‌గడ్ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున గుట్కాలను కొనుగోలు చేసి అమ్మకాలు జరుపుతున్నారు. వీరే ఆయా గ్రామీణ ప్రాంతాల వారికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం గుట్కాను నిషేధించడంతో రూ. 10 విలువైన గుట్కా ప్యాకెట్ రూ. 30కు అమ్ముతున్నారు. వీటిలో ప్రధానంగా అంబర్, విమల్, పాన్‌బార్, రజినిగంద్, ఆర్ఆర్, ఆర్ఎండి వంటి బ్రాండ్లను అధికంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. వీటి అసలు ధర కన్నా మూడింతలు ఎక్కువగా ధర పెంచి అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు.

**జన సంచారం లేని ప్రాంతాల్లో నిల్వలు**

గుట్కా అక్రమ వ్యాపారంతో అధిక లాభాలు రావడంతో కొంతమంది వ్యాపారులు దీన్నే ప్రధాన వృత్తిగా ఎంచుకొని లాభాలు గడిస్తున్నారు. లక్షల రూపాయల విలువైన గుట్కాలను కొనుగోలు చేసి జన సంచారం లేని ప్రాంతాల్లో వాటిని నిల్వ చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మార్కెట్ రోడ్డు, అలంకార్ రోడ్డునే ఈ అక్రమ వ్యాపారాన్ని నడిపే వారు అధికంగా ఉన్నారు. గుట్కాలు అవసరం ఉన్న వారు ముందు ఆర్డర్ చెబితే చేరవేస్తున్నారు. మార్కెట్‌రోడ్డులో ఓ బేకరిని నడిపిస్తున్న తమిళనాడు ప్రాంతానికి చెందిన ముగ్గురు హోల్‌సెల్‌గా గుట్కాలను జిల్లా కేంద్రానికి తీసుకవచ్చి సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కోదాడ ప్రాంతంలో కొంత మంది బేకరి యజమానులు హోల్ సెల్ వ్యాపారం కొనసాగిస్తూ కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల్లో మారుమూల ప్రాం తాల్లో సైతం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

**పట్టించుకోని అధికారులు**

గుట్కా నిషేధాన్ని పకడ్బందిగా అమలు చేయాల్సిన ఆహార భద్రత అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. పత్రికల్లో వార్తలు రాగానే హడావుడి చేస్తూ తనిఖీ చేస్తూ మమా అనిపిస్తున్నారు. అధికారుల వద్ద ముందే సమాచారం ఉన్నా తనిఖీలు మాత్రం చేయడం లేదు. అక్రమ వ్యాపారుల నుండి అధికారులకుమామూళ్లు అందుతుండడంతోచూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నత అధికారులు స్పందించి గుట్కా అమ్మకాలు అడ్డుకోవాలని కోరుతున్నారు.

# బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

## ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్






**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణి గనులను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటాపలుకుల రమేష్ అన్నారు. శుక్రవారం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఆ వేలానికి వ్యతిరేకంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని గనులు, డిపార్ట్మెంట్స్ భూపాలపల్లి జిఎం ఆఫీస్ ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకమని, తెలంగాణ పౌరుడైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇదే తెలంగాణ మణిహారం అయిన సింగరేణిని వేలం వేయడం అనేది దారుణం అని, బడా పారిశ్రామిక వేత్తలకు తొత్తుగా అంబానీ, అదానీకి కట్టపెట్టడానికే 4 నల్ల చట్టాలు చేశారని, సింగరేణి సంస్థను కాపాడటానికి కార్మిక వర్గం, ముఖ్యంగా యువ కార్మిక సోదరులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసే పోరాటంలో ముందుండాలని, సంస్థ భవిష్యత్తు యువ కార్మికుల చేతిలో ఉందనీ కావునా యువత సంస్థను కాపాడటంలో చురుకైన పాత్ర వహించాలని కోరారు. అనంతరం సింగరేణి జిఎం మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టంట్ బ్రాంచ్ సెక్రటరీలు ఎం.విజేందర్, జి.శ్రీనివాస్, ఎండీ.ఆసిఫ్ పాషా, మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఇంఛార్జి టి.రాంచందర్, బ్రాంచ్ కమిటీ నాయకులు ఎన్.చంద్రమౌళి, అన్ని గనుల, డిపార్ట్మెంట్స్ పిట్ సెక్రటరీలు,అన్ని గనుల సేఫ్టీ కమిటీ సభ్యులు, మైన్స్ కమిటీ సభ్యులు, షిఫ్ట్ ఇంఛార్జిలు, అసిస్టెంట్ షిఫ్ట్ ఇంఛార్జిలు,మహిళా కార్మిక సోదరీమణులు,కార్యకర్తలు,కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**భూపాలపల్లి ఏరియాలో...**

భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసి 2 గని మీద బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగింది. అట్లాగే కేటీకే 5 గని ధర్నా కార్యక్రమానికి పిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి అధ్యక్షత వహించారు. తదనంతరం మాతంగి రామచందర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్, ఎండి ఆసిఫ్ పాషా బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ మాట్లాడుతూ నేడు హైదరాబాదులో జరగబోయే బొగ్గు గనుల వేలంపాటలో మన సింగరేణి బొగ్గుబ్లాకులు మన సింగరేణికే కేటాయించాలని, రాబోయే రోజుల్లో మన సింగరేణి తల్లిని కాపాడుకోవడానికి అవసరమైతే సమ్మెకు సిద్ధంగా ఉండాలని కార్మికులను కార్మికులకు పిలుపునిచ్చారు. తదనంతరం కార్మికులందరూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలంటూమేనేజర్ కార్యాలయం వద్దకు ఐకమత్యంతో నినాదాలు ఇస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణమూర్తి, రాజేందర్, రాయమల్లు, తిరుపతి రెడ్డి, రమేష్ , రామన్న, సుధాకర్ వంశీకృష్ణ, కొండపల్లి శ్రీను, సాధకర్ మున్షీ పాల్గొన్నారు.

## శ్రీచైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ అధిక ధరలకు విక్రయిస్తున్న శ్రీ చైతన్య విద్యసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చైతన్య స్కూల్‌కు సంబంధించి ఏలాంటి పర్మిషన్ లేకుండా పుస్తకాల అమ్మక కేంద్రం వద్ద పుస్తకాలు, యూనిఫాంలను పట్టుకొని స్టోర్ ముందు ధర్నా నిర్వహించారు. విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు పుస్తకాల అమ్మకంలో బిల్లులు సక్రమంగా లేకపోవటం, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సీరిస్ కాకుండా, శ్రీచైతన్య స్కూల్ పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న స్టోర్‌ను తాళం వేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సంగెం మధు, వేల్పుల ప్రసన్నకుమార్, బానోతు నవీన్, సిద్ధుల సుమన్, చట్ల సమ్మయ్య, రాకేశ్, రమేశ్, ఆదిత్య, వెంకట్ , అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలం

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** నీట్ పేపర్ లీక్ కావడంతో సిపిఐ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న మాట్లాడుతూ మే5న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో లక్షలాది విద్యార్థుల జీవితాలు బజారున పడ్డాయని విమర్శించారు. ఈ స్కామ్‌ని వెంటనే సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకున్నవారిని కఠినంగా శిక్షించాలన్నారు. నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంగలపల్లి జనార్థన్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, నగేష్, వెంకటాద్రి, నాగరాజు, ఆదిలక్ష్మి , సఖి, నీల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం : కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** మెరుగైన విద్యను పేద విద్యార్థులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, గుణాత్మక విద్య అందించడంపై స్టేషన్ ఘనపూర్ శాసనసభ నియోజకవర్గ స్థాయిలో జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, మండల నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి పాఠశాలను ఎంఎస్ఓలు, ఎంఎన్ఓలు సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన అభివృద్ధి పనుల పురోగతిపై పరిశీలించాలని మిగిలిన మరమ్మత్తుల పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని 7 మండలాల వారీగా ఏడు అంశాలలో ఏడు మండలాల నుంచి ఒక్కొక్క పాఠశాల చొప్పున ఏడు బడులను ఎంపిక చేసి ఉత్తమ పాఠశాల పురస్కారాలను అందజేస్తామని మొదటి పురస్కారానికి రూ.25లక్షలు, ద్వితీ య కింద రూ.15లక్షలు, తృతీయ కింద రూ.10లక్షల నగదు అందించి ఆ నగదును పాఠశాల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు.అందరు సమన్వయంతో పనిచేసి వచ్చే పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఈవో రాము, మండలాల ప్రత్యేక అధికారులు, మండల నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక, శారీరక ఆరోగ్య రక్షణకు యోగా

### హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** మానసిక, శారీరక ఆరోగ్య రక్షణకు యోగా దివ్య ఔషదంలాంటిదని హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. అనారోగ్యాలతో ఇబ్బందులు పడే మనుష్యులకు యోగా ప్రకృతిసిద్ధమైన శక్తిని అందిస్తుందని అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఆయుష్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారధా దేవితో పటు జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఆయుష్ ఆర్జేడి రవి నాయక్, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి :** తనువు, మనసు, ఆత్మను ఏకం చేసే సాధనే యోగా అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వరంగల్ పట్టణంలోని ఓసీటి స్టేడియంలోని నెహ్రూ యువ కేంద్ర, జిల్లా యువజన క్రీడల ఆయూష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డిసిఓ సంజీవరెడ్డి, డిపిఆర్ఓ ఎండి ఆయూబ్‌అలీ, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయల్, డివైఎస్ఓ సత్యవాణి, జీఎం ఇండస్ట్రీస్ నర్సింహమూర్తి, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకృష్ణ, ఎన్‌వైకే కోఆర్డినేటర్ అన్వేష్, ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, డిసిఎస్ఓ శివప్రసాద్‌రెడ్డి, మెప్మా డిసిఎం రేణుక, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నీట్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ డిమాండ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరుపాలని మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎఐసిసి పిలుపుమేరకు నిరసన, ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ మాజీ శాసన సభ్యులు మదన్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు, చిలుముల సుహాసిని రెడ్డి, హాజరయ్యారు. మెదక్ ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షా పత్రం లీకేజీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. మతాల పేరుతో బిజేపి పార్టీ రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, ఉప్పల రాజేష్, న్యాయవాది జీవన్ రావ్, బొజ్జ పవన్, పబ్బతి ప్రభాకర్ రెడ్డి, గోవింద్ నాయక్, ప్రశాంత్ రెడ్డి, సిద్దిరాములు, ఆవుల గోపాల్ రెడ్డి, సాప సత్యనారాయణ, రాజిరెడ్డి,గంగా నరేందర్, మనోజ్, పరుశురాం గౌడ్, లక్కరు శ్రీనివాస్, శేరి మహేందర్ రెడ్డి, సర్దన బాలకిషన్, కౌన్సిలర్ లు దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, మేడి కళ్యాణి మదుసూదన్, షమీ, దాయర లింగం, హరిత, ఎస్.డి. జ్యోతి క్రిష్ణ, లక్ష్మినారాయణ గౌడ్, బొద్దుల రుక్మిణి క్రిష్ణ,సుప్రభాత్ రావ్, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ ప్రారంభం

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి మండలం ఫలల్వాది డబుల్ బెడ్ రూమ్ కాలనీలో 100కెఎల్ కెపాసిటీ వాటర్ ట్యాంక్‌ను డిఎంఎఫ్ టి నిధుల ద్వారా రూ. 15 లక్షలతో నిర్మించిన ట్యాంకును సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. పెరుగుతున్న కాలనీల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ట్యాంకులను నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం కాసాల బుచ్చిరెడ్డి జడ్పీటీసీ సునీత మనోహర్ గౌడ్ ,మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, పట్నం రవితేజ ఏఈఎంపిడిఓ సంగన్న గొల్లరాజు సాయన్న డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు తదితరులుపాల్గొన్నారు.



### పరిసరాల పరిశుభ్రతతో

## వ్యాధుల నిర్మూలన



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధులను నిర్మూలించవచ్చునని 40వ డివిజన్ కార్పొరేటర్ మారుపల్ల రవి అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో సందర్భంగా కొత్త కుమ్మర వాడల్లోని ఖాళీ స్థలంలో మురుగునీరు నిలిచి ఉన్న నీటిలో మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి గుంతలలో ఆయిల్ బాయిల్ వేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఖాళీ స్థల యజమానులు వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకొని గుంతలలో మొరం నింపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, స్థానికులు, ఆవునూరి కృష్ణమూర్తి, ఆవునూరి సునీత, వరలక్ష్మి , యాకూబ్, బి సిబ్బంది, ప్రదీప్, సరిత, కిరణ్, అనిల్, కుమార్, నాగరాజులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

### ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యా అందిస్తారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని పంతిని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విద్యార్థి విద్యార్థినీలకు పుస్తకాలు, వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రెసిడెన్షియల్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు ఉన్నత స్థాయికి వెళుతున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం లక్ష్యంగా మంచి విద్యను బోధించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి ఎమ్మెల్యేని శాలువాతో ఘనగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందం, ఏపీపీ చైర్మన్లు జ్యోతి, మాధవి, మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయులు ఎంఈఓ ఎంపీడీవో ఎమ్మార్వో ఎంపీటీసీ పిఏసిఎస్ డైరెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్ గ్రామ పార్టీ అధ్యక్షుడు, మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు, పాఠశాల విద్యార్థి విద్యార్థినీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాధనే లక్ష్యంగా జీవించిన జయశంకర్

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తెలంగాణ సాధనే లక్ష్యంగా జీవించిన మహనుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ 13వ వర్ధంతి సందర్భంగా హన్మకొండలోని ఏకశిల పార్కులో జయశంకర్ విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాంతం తెలంగాణ సాధన లక్ష్యంగా బతికిన మహనుభావుడు జయశంకర్ అని కొనియాడారు. సమైక్య పాలనలో తెలంగణకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతో పాటు జనాన్ని జాగృతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. తుది శ్వస వరకు తెలంగాణ కోసమే జీవించారని ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, లీగల్ సెల్ చైర్మన్ తోట వెంకట రాజ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంపత్ కుమార్ యాదవ్,మాజీ కార్పోరేటర్లు వీరగంటి రవిందర్,మాధవిరెడ్డి, చీకటి ఆనంద్,నలుబోల సతీష్, డివిజన్ అధ్యక్షులు వల్లపు రమేష్, ఆంజనేయులు, గుంటి స్వప్న, సురేందర్,సింగారపు రవి ప్రసాద్, తాళ్లపల్లి మేరి,కోడిపాక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్ ప్లాంటేషన్ పనులు ప్రారంభించరూ!

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** చెరువు కట్టలపైన బండ్ ప్లాంటేషన్ పనులను ప్రారంభించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉద్యానవన విభాగ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కమిషనర్ శుక్రవారం వరంగల్ పరిధి క్రిస్టియన్ కాలనీలో గల నర్సరీ, గొర్రెకుంట ప్రాంతంలో గల కట్టమల్లన్న చెరువు, ఎనుమాముల ప్రాంతంలో గల ముసలమ్మ కుంట ప్రాంతాలలో పర్యటించి బండ్ ప్లాంటేషన్ కార్యాచరణ ప్రణాళికను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ క్రిస్టియన్ కాలనీ నర్సరీని పరిశీలించి పెంచబడుతున్న మొక్కలు, నిల్వ స్థితి గతులు అడిగి తెలుసుకొని మొక్కలు, నిల్వ స్థితి గతులు అడిగి తెలుసుకొని మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉండాలని అన్నారు. నగర పరిధిలో కుంటలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా కట్టలపైన మొక్కలను పెంచాలని అందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్, హార్టికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## 465 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** అమ్మ ఆదర్శ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై మండలాల వారిగా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జిల్లాలో 814 పాఠశాలల కాను ఇప్పటివరకు 465 పాఠశాలల పనులు పూర్తి చేసినందుకు 16 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా 349 పాఠశాలల్లో చేపడుతున్న పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు పనులు పూర్తికాగానే ఎస్టిమేట్ జనరేట్ చేయాలన్నారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకను పాఠశాలల్లో మొదలుకాని స్కూళ్లను విజిట్ చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం ఈఈలకు సూచించారు. ఈ నెలాఖరులోగ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కెజివిబి, మోడల్ స్కూల్‌లో సైతం ఈ పథకంలో కావాల్సిన పనులు చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. ఈసమావేశంలో డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఇంజనీరింగ్ విభాగాలు , ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ , ఈడబ్లుఐడిసి ఈఈ, డిఈ, ఎఈలు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం రాస్తారోకో



**ప్రజాపక్షం/రామాయంపేట ;** రామాయంపేట పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇల్లులేని నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంతో పాటు బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇండ్లను పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదని ఖాళీగా ఉన్న 56 ఇండ్లను తమకు కేటాయించాలని కోరుతూ రోడ్డుపైకి వచ్చి నిరసనకు దిగారు. గురువారం కొందరు ఇళ్ల తాళాలు పగులగొట్టడం చర్చనీయాంశమైంది. అధికారులు స్పందించి అర్హులైన వారికి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

### గిరిజన ప్రాంతాలలో

## మౌలిక సదుపాయాలు



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** గిరిజన ప్రాంతాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, స్వయం ఉపాధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి శబరీష్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్రా మిశ్రా, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, వైద్య, తదితర సదుపాయల వివరాలను అధికారులను జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని, జిల్లాలో షెడ్యూల్డ్ తెగల హక్కుల పరిరక్షణకై అధికారులు కృషి చేయాలని, షెడ్యూల్డ్ తెగల సాంఘిక ఆర్థిక అభివృద్ధికి వివిధ ప్రణాళికల రూపకల్పనకు కృషి చేయాలని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలని, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రూపొందించిన ప్రణాళికలను షెడ్యూల్డ్ కులాల వారికి అందేవిధంగా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, ఐటిడిఏ అసిస్టెంట్ ఏపిఓ వసంతరావు, డిఎంహెచ్ఓ అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గుబ్లాక్‌లు వేలం వేయొద్దు




సింగరేణికే ఇవ్వాలని ఎల్లాగౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గనులు డిపార్ట్మెంట్లు ఓసిపి 5 లలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన గుర్తింపు సంఘం ఏఐటీయుసి.తెలంగాణ లో ఉన్న నూతన బొగ్గు గనులను సింగరేణి కె ఇవ్వాలని, వేలం వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని సింగరేణి కి అప్పచెప్పే విధంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆద్వర్యంలో శుక్రవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని గనులు, డిపార్ట్మెంట్లు, ఓసిపి 5 లలో ధర్నాలు , నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వం పై నిరసన తెలుపుతూ పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. జిడికె వన్ ఇంక్లైన్ లో జరిగిన ధర్నా కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు సింగరేణిని ప్రైవేటీకరించబోమని ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పుడు బొగ్గు బ్లాకులను వేలం వేస్తామని ప్రకటన చేయడాన్ని ఏఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. బొగ్గు గనులను వేలం వేయకుండా బేషరతుగా సింగరేణి సంస్థకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో బొగ్గు బ్లాకుల వేలంపాటను ఏఐటీయూసీ వ్యతిరేకిస్తుందని, బొగ్గు గనుల వేలంపాటలో శ్రావణ్ పల్లి బొగ్గు బ్లాకును చేర్చడం సరైంది కాదన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇంతకు ముందు ప్రైవేటు వారికి కేటాయించిన సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు వేలం లో దక్కించుకున్న వారు బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనందున వాటిని కూడా సింగరేణికి కేటాయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటిపై రాష్ట్ర మంత్రివర్గం తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలన్నారు. బొగ్గు బ్లాకులను వేలం పాట ద్వారా ప్రైవేటు వారికి అప్పగిస్తే తెలంగాణ లో సింగరేణి సంస్థ మూత పడుతుందని ఆయన అన్నారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం శుక్రవారం హైదరాబాద్ లో అరవై బొగ్గు బ్లాక్ లను ఈ వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇవ్వడం కోసం తెలంగాణ ప్రాంతానికి చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభం చేసేందుకు రావడం ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తెలంగాణ లో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణి కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సింగరేణి సంస్థ రక్షణకు, కార్మికుల పరిరక్షణకు ఏఐటియుసి అండగా ఉంటుందని , కార్మిక వర్గం ఏఐటియుసి పిలుపు ఇచ్చె పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ మాట్లాడగా నాయకులు సంకె అశోక్, మాదన మహేష్, ఎస్ వెంకట్ రెడ్డి, బొగె సతీష్ బాబు, దొంత సాయన్న, నాయిని శంకర్, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, పి.నాగేంద్ర కుమార్, చంద తిరుపతి, మోదుగు సంపత్, బలుసు రవి, రాజబాబు, మల్లేశ్ పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి

కలెక్టర్ బి సత్య ప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యాభ్యాసం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం రోజున అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ధరూర్ క్యాంపులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పురాణిపేటలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హన్మాజీ పేటలోని ప్రాథమిక పాఠశాల, జాబితా పూర్ లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, పర్కపల్లిలోని ఎం.పి.పి.ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మంజూరైన పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ పనులలో భాగంగా విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారా లేదా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తున్నారా లేదా అని విద్యార్థుల అటెండెన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు, టాయిలెట్స్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నారా లేదా అని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతున్నదని, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు వంద శాతం ప్రగతి సాధించే విధంగా విద్యా బోధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిఈవో జగన్ మోహన్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భైంసా :** డాక్టర్ బిఆర్అంబేద్కర్ రాష్ట్ర సెక్రటరియేట్ లో తెలంగాణ రాష్ట్ర అటవీ,దేవాదయ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండ సురేఖ ను మర్యాదపూర్వకంగా కలిసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కలిశారు.ముధోల్ నియోజకవర్గం లో కొన్ని దేవాలయాలు మంజూరు చేయటం జరిగిందని వాటికీ టెండర్లు తొందరగా పిలవాలని,టెండర్లు పూర్తయిన వాటికి పనులు ప్రారంభించటానికి ఆదేశాలు ఇవ్వగలరని పనులు జరుదుతున్న వాటికీ నిధులు మంజూరు చేయాలనీ కోరటం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైస్ జడ్పీ చైర్మన్ సాగరబాయి రాజన్న,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆనంద్ రావు పటిల్ పాల్గొన్నారు.

## ప్రతీ రోజు ఫిర్యాదుల స్వీకరణ

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ప్రతీ రోజు ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణితో పాటు మిగతా పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజల ఫిర్యాదులను స్వీకరించడానికి కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదుకు రసీదులు పొందవచ్చని ఫిర్యాదుల పురోగతిని సంబంధింత శాఖ వారిగా ఆన్ లైన్ లో ఎప్పటికప్పుడు వర్యవేక్షించడం జరుగుతుందని,ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## 24న కలెక్టరేట్ ముందు ధర్నా



**ప్రజాపక్షం/రామగిరి :** బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తామని ప్రధానిగా మంత్రి మోడీ చెప్పడాన్ని నిరసిస్తూఈ నెల 24 న పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు ఐఎఫ్టియు నిర్వహించు ధర్నాను కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. శుక్రవారం రామగుండం ఆర్జీ 3 వివిధ విభాగాల్లో పాల్గొని మాట్లాడుతూ మూడోదప ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశంలోని కార్మికుల యొక్క చట్టాలను మార్పుకు చర్యలు చేపట్టడం జరగబోతుందని ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు దీనికి వ్యతిరేకంగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ రజిత, ఈ లక్ష్మి , పి రేణుక, పి వసంత, గాజుల విజయ, ఓదెమ్మ, రాజ్యలక్ష్మి , సరోజన, విజయ, రాధ ,భాగ్య, శ్యామల, తిరుమల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి : ఝూ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాలోని రహదారులు, భవనాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్ లో ఉన్న పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో ప్రగతిలో ఉన్న పలు వంతెనలు, రహదారుల నిర్మాణాల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల వల్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా క్షేత్ర స్థాయిలో ఎక్కడైనా మరమ్మతులు అవసరం ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు. ఇంకా ఎక్కడైనా వంతెనలు, రహదారులు నిర్మించాల్సి ఉంటే, వాటి మంజూరు కోసం సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. సమీక్షలో ఆర్ అండ్‌బి ఈఈ శ్యామ్ సుందర్, డీఈ శాంతయ్య, ఏఈ లు కిరణ్, సతీశ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ విద్యా సంస్థను మూసివేయాలి

పిడిఎస్‌యుఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నడుస్తున్న నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థలో పిడిఎస్‌యుఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టైలు అధిక ధరలకు అమ్మడమే కాక ముఖ్యంగా విద్యా సంస్థను నడపడానికి కావలసిన అనుమతి పొందకుండానే పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి మరి ఫీజులు వసూలు చేస్తున్నారని అరోపించారు. ఇలా ఏ విద్యాసంస్థ అయినా కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థలు పూర్తిగా మూసివేయాలని జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దిగాండబర్, న్యూడెమోక్రసి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్, రుద్ర ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు గైర్హాజరు కావడం దురదృష్టకరం

**ప్రజాపక్షం/నస్పూర్ :** ఉపరితల గనుల విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు విధులకు హాజరు కాకుండా గైర్హాజరు కావడం దురదృష్టకరమని ఎస్ ఒటు జిఎం పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ఎస్ఆర్‌పి ఉపరితల గని, సెక్యూరిటీ విభాగాలలో గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఎస్ఒటు జిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న 2023 సంవత్సరములో కనీసం వంద మస్టర్లు చేయని 2024 సంవత్సరం మే వరకు కనీసం 50 మస్టర్లు చేయని ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి నుండి తప్పని సరిగా ప్రతినెల 20 మస్టర్లు చేయాలని సంస్థలో ఉద్యోగం దొరకడం మీ అందరి అదృష్టమని ఉద్యోగులందరూ హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ చాల సదుపాయాలు అందిస్తుందని కావున ప్రతి ఒక్కరు దానిని దృష్టిలో ఉంచుకొని విదులకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈరోజు కౌన్సిలింగ్‌కు గైర్హాజరు ఉద్యోగులు 13 మంది వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.




## మంచిర్యాల మున్సిపాలిటీని ముందుంచాలి



కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల మున్సిపాలిటీని అన్ని రంగాలలో ముందుంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి సందర్శించి కార్యాలయంలోని వివిధ విభాగాలు, ప్రజా పాలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీని అన్ని రంగాలలో ముందు ఉంచేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వర్షాకాలం అయినందున మున్సిపల్ పరిధిలోని వార్డులలో శుభ్రమైన త్రాగునీటిని అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని వార్డులలో వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## ఇఎన్‌సిని కలిసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భైంసా :** హైదరాబాద్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ క్యాడ్ డిపార్ట్మెంట్లకు సంబంధించిన ఇంజనీరింగ్ చీఫ్ ఇ.ఎన్.సి ని మర్యాదపూర్వకంగా కలిసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నియోజకవర్గానికి సంబంధించిన కలేశ్వరం 27,28 ప్యాకేజీలను త్వరగా పూర్తిచేయాలని,అంతే కాకుండా పల్సికర్ రంగారావు ప్రాజెక్ట్ వల్ల గుండెగాం ముంపు గ్రామా బాధితులకు త్వరగా నష్టపరిహారం అందించి,సమస్యక త్వరగా చర్యలు చేపట్టాలని,ఇటీవలే నిర్మించబోతున్న సిరాల ప్రాజెక్టు పనులను తొందరగా పూర్తి చేయాలని విన్నవించుకున్నారు.

## ప్రకాష్ కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** టిపిసిసి సెక్రెటరీ, పెద్దెల్లి ప్రకాష్ తల్లి పెద్దెల్లి మధునమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రోజున స్వర్గస్తులైన విషయం తెలుసుకుని వారి నివాసానికి పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తెలంగాణ ఎస్సీ , ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్ వెళ్లి మదునమ్మ చిత్ర పటానికి పూలమాలవేసి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రకాష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ముల్కూరిశేఖర్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న జనరల్ ఓ.పి., దంత వైద్య విభాగం, కంటి వైద్య విభాగం, ఎముకలు, కీళ్ల నొప్పుల విభాగం, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డ్ , సైక్రియాటిక్ విభాగాలను కలెక్టర్ తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సాధారణంగా ఓ.పి. ఎంతమంది రోగులు వస్తున్నారు, ఎటువంటి వ్యాధులు అధికంగా నమోదవుతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందిస్తున్న రోగులకు వారి వైద్య చికిత్స కోర్స్ పూర్తి అయ్యే వరకు ఫాలో అప్ చేయాలని, డ్యూటీలో ఉన్న వైద్యుల వివరాలు నోటీసు బోర్డుపై పరిశీలించిన కలెక్టర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. మాతా, శిశు ఆసుపత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు అవుతున్నాయో అడిగి తెలుసు కున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న సదుపాయాలను ప్రజలకు తెలియజేస్తూ, మరిన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమా కాంత్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే యోగా




కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** శరీర భాగాలను యోగ సమన్వయం చేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్‌లో నిర్వహించిన అధికారిక యోగా దినోత్సవంకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డిప్యూటి జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ క్రీడా అధికారి మీనారెడ్డి, ఏసిఎంఒ ఉద్ధవ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, గుండెకు రక్తం సరఫరా చేయడంలో ఉండే లోపాలు యోగాతో తొలగిపోతాయన్నారు. భారతదేశంలో ఉన్న యోగ ప్రాచుర్యాన్ని గుర్తించి అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలు కూడా పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.

## ఖానాపూర్ ఐసిడిఎస్‌లో అవినీతి తిమింగలం !




### సూపర్‌వైజర్లే సూత్రధారులు...!! ఐసిడిఎస్ అధికారిపై కమిషనర్ కు ఫిర్యాదు..? అంగన్వాడీ టీచర్ల నుండి అక్రమ వసూళ్లు...!

**ప్రజాపక్షం/ప్రతినిధి :** నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ ఐసిడిఎస్ అధికారి అంగన్వాడి అండ్ వెల్ఫర్ టీచర్ల,అయల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతుందని పలువురు అంగన్వాడి టీచర్లు వాపోతున్నారు.ఎవరినైతే అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే వారిపై కక్షపూరితమైన చర్యలకు పాల్పడుతుందని,ఇందతా అంగన్వాడీ సూపర్వైజర్లు,వాట్సాప్ గ్రూప్ లలో మేసేజ్లు పెట్టి టీచర్లను ఆయలను నుండి బలవంతంగా ప్లెక్సీలు,ఇంకా ఏదో పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని వాట్సప్ గ్రూపులలో హుకుం చేస్తూ అంగన్వాడి టీచర్లకు అల్టిమేట్టం జారీ చేస్తున్నారు.ఖానాపూర్ ఐసిడిఎస్ పరిధిలో ఈ దోపడి పై పక్కా ఆధారాలతో కొంతమంది బాదితులు అవినీతి నిరోధక శాఖను కూడా ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తుంది.గత వేసవికాలంలో అంగన్వాడీ కేంద్రాలకు అప్రకటిత సెలవుల్లో ఒక్కోక్క అంగాన్వాడి టీచర్,ఆయల నుండి 1500 రూపాయల నుండి 2000 వరకు వసూలు చేసినట్లు చెప్తున్నారు.ఖానాపూర్ ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 200 అంగన్వాడి కేంద్రాలు ఉండగా కొంతమంది ప్రశ్నించే గొంతుకలను పక్కన పెట్టి మిగతా అంగన్వాడి వెల్పర్స్ నుంచి 2000 చొప్పున డబ్బులను వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతుంది.గతంలో కూడా ఈ ఐసిడిఎస్ అధికారిపై అనేక అవినీతి ఆరోపణ ఉన్నప్పటికీ పై అధికారులకు కూడా తమ వంతు ముడుపులు పంపుతూ ఎలాంటి చర్యలకు నోచుకోకుండా కొనసాగుతుందని ఆరోపణలు ఉన్నాయి.ప్రతి సంవత్సరం దాదాపు 3లక్షల నుండి 4 లక్షల వరకు వసూలు చేస్తుందని,ఎవరైతే ఎక్కువగా మాట్లాడుతారో వారిని టార్గెట్ చేసుకొని వేధింపులకు వారిని టార్గెట్ చేసుకొని వేధింపులకు గురి చేస్తుందని,కొందరు జిల్లా అధికారులను తన గుప్పెట్లో పెట్టుకొని ఇలాంటి అవినీతికి పాల్పడుతుందని ప్రచారం లేకపోలేదు. గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా అధికారులు కూడా చర్యలు చేపట్టకుండా తూతూ మంత్రంగా ఎప్పటిలాగే వీధుల్లో కొనసాగించడం అంటే జిల్లా అధికారులకు కూడా తన వంతు వాటా వెళ్తుందని అనుమానాలకు కూడా లేకపోలేదు.కొందరు అంగన్వాడీ టీచర్లు గూగుల్ పే,ఫోన్ పే ద్వారా డబ్బులు పంపుతున్నారని,ఐసిడిఎస్ఓ అధికారి సెల్ ఫోన్లు తనిఖీ చేసినట్లయితే అవినీతి చేసిందా లేదా అనేది బయటకు వస్తుంది.చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ డబ్బులు ఇవ్వని వారిని వేధింపులకు గురిచేస్తుంది.స్త్రీ సంక్షేమనానికి కృషి చేయాల్సిన ఐసిడిఎస్ శాఖ అధికారులే అవినీతికి పాల్పడితే ఇక అర్థమేంటి..?శిశు సంక్షేమ శాఖలో అసలు లక్ష్యం పక్కదిరి పడుతుందని,ఐ సి డి ఎస్ అధికారిపై సామగ్ర విచారణ జరపాలని కొందరు అంగన్వాడి టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

### ఫోన్ పే,గూగుల్ పే తనిఖీ చేస్తే...!!?

ఖానాపూర్ ఐసిడిఎస్ అధికారి అవినీతికి పాల్పడింది లేదా..?కొందరు ఫోన్ పే,మరి కొందరు గూగుల్ పే ఏది లేని వారు నేరుగా డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తుంది.అధికారి అవినీతికి పాల్పడిందా లేదా అంటే వారి సెల్ఫోన్లో ఉన్న ఫోన్ పే,గూగుల్ పే లను పరిశీలించడం అవసరం ఎంతైనా ఉంది.

### ఐసిడిఎస్ అధికారిపై కమిషనర్ కు ఫిర్యాదుః

ఖానాపూర్ ఐసిడిఎస్ అధికారిపై అంగన్వాడి యూనియన్లు కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తుంది.అంగన్వాడి వెల్ఫేర్ టీచర్లను వేధింపులకు గురి చేస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్కు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తుంది.

### ఏసీబీ కి కూడా ఫిర్యాదు...?

ఐసిడిఎస్ అధికారి వేధింపులు భరించలేని అంగన్వాడీ టీచర్లు,ఏసీబీ అధికారులను కూడా ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.అంగన్వాడి సూపర్వైజర్ల నుండి ఒత్తిడి పెంచి వసూలు చేయిస్తుందని లేదంటే ఏదో రకమైన ఒత్తిడి పెట్టి వేధింపులకు గురి చేస్తుందని అంగన్వాడి టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పై అధికారికి ఎదురు చెప్పలేక తమ ఉద్యోగం కాపాడుకునేందుకు బయట పెట్టలేకపోతున్నామని కొందరు అంగన్వాడీ టీచర్లు,అయలు వాపోతున్నారు.

### జిల్లా అధికారిపై పలు అనుమానాలు....!?

ఖానాపూర్ ప్రాజెక్ట్ అధికారి పై అవినీతి ఆరోపణలు వచ్చిన చర్యలు తీసుకుపోవడం పై జిల్లా అధికారులపై పాలు అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.జిల్లా అధికారులకు కూడా ఏమైనా అవినీతి సొమ్ము చేరువేస్తుందా..? లేక చర్యలు తీసుకోకపోవడాని కారణం ఏంటి..? అని అనుమానాలు వ్యక్తం అవుతున్నట్టు తెలుస్తుంది.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లు,ఆయాలు డిమాండ్ చేస్తున్నారు.

# 'నీట్'పై సమగ్ర విచారణ జరిపించండి

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ఎన్‌టిఎను రద్దు చేయాలి
### విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో స్టూడెంట్ మార్చ్



కరీంనగర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మొన్న నీట్ పరీక్ష లీక్, నిన్న యూజిసి ఎన్‌ఎటి యూజిసి నీట్ పరీక్ష రద్దు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ఎన్‌టిఎపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, ఎన్‌టిఎ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి రాజీనామా చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్‌పై, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు స్టూడెంట్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షలో పేపర్ లీక్ అవకతవకలు జరిగాయని, దేశమంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరవక ముందే మొన్న దేశ వ్యాప్తంగా నిర్వహించిన యుజిసి, ఎన్‌ఎటి యుజిసి నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో మొత్తం 23 లక్షల 33 వేల 297 మంది, యుజిసిఎన్‌ఎటి పరీక్షలో మొత్తం 11లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. యుజిసి ఎన్‌ఎటి రద్దు చేయడం వెనుక నీట్ అవకతవకలను మరిపించడం కోసమేననేని అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు. నీట్, యుజిసి ఎన్‌ఎటి పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని, పరీక్ష కుంభకోణంకు బాధ్యత వహిస్తూ వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని, కేంద్ర పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్, అరవింద్, విద్యార్థి సంఘాల నాయకులు నిరాటీ రాం ప్రసాద్, నరేష్, మామిడిపల్లి హేమంత్, రోహిత్, కనకం సాగర్, రామ్ యాదవ్, ఇషాక్, వినయ్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**ఖమ్మం అర్బన్ :** నీట్ లీకేజీపై విచారణ జరిపించాలని ఎన్‌టిఎను తక్షణమే రద్దు చేయాలని, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని తదితర డిమాండ్లతో ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్, పిడిఎస్‌యు, పివైఎల్, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ బిజిఎన్‌ఆర్ కళాశాల నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ర్యాలీ, స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, షేక్ బషీరుద్దీన్, ఆసీఫ్, యడ్లపల్లి సంతోష్, వి.వెంకటేష్, ఎన్‌వి రాకేష్, మస్తాన్, కూరపాటి రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటే దేశ ప్రధాని స్పందించకపోవడం దారుణమన్నారు. బిజెపి అధికారంలో ఉన్న బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ అయిందని ఇందులో బిజెపి నేతల ప్రమేయం ఉందని వారు ఆరోపించారు. సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు దాసోజు శ్రావణ్, మదుపల్లి లక్ష్మణ్, చింతల రమేష్, పి. సుధాకర్, లక్ష్మణ్, ఉమా శంకర్, సంగీత, బోల్లం మహేష్, ఉదయ్‌కిరణ్, గంగాధర్, వీరబాబు, శ్రీను, సాయి, ప్రేమ్, నవీన్, వినోద్, మధు, శివ, గౌతమ్, నాగులమీరా, గోపి, ఉపేందర్ పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**నల్లగొండ టౌన్ :** నీట్ పేపర్ లీకేజీ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించకపోవడం సిగ్గుచేటని, దీనికి బాధ్యత వహించి నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్, జిల్లా కార్యదర్శి మురళికృష్ణ, పిడిఎస్‌యు రాష్ట్ర బాధ్యులు ఇందూరు సాగర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ ఘటన పై కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. నీట్ రాసిన విద్యార్థులకు నరేంద్ర మోదీ ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్, విద్యార్థి నాయకులు సూర్య తేజ, జగన్ నాయక్, వీరన్న, తరుణ్, సిపాయి, ఎన్.రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం



నల్లగొండ

## హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి : ఎఐటియుసి




**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** హమాలీ కార్మికులకు ప్రభుత్వం హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి వారిని ఆదుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కు రాజుగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండల హమాలీ వర్కర్ల యూనియన్ ఎఐటియుసి అనుబంధ సంఘం సమావేశం ఎర్ర కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి రాజుగౌడ్, రామ్మూర్తి హాజరై మాట్లాడుతూ హమాలీ కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.3000 పింఛన్ ఇవ్వాలని, ఇల్లులేని పేద హమాలీ కార్మికులకు ఇల్లు కట్టించి ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ కల్పించాలని, ఐకేపీ సెంటర్‌లో పీఏసీఎస్ సెంటర్‌లో లోడింగ్ అన్ లోడింగ్ చేస్తున్నపుడు బస్తాలు మీద పడి కాళ్లు, చేతులు పోగొట్టుకుంటున్న కార్మికులకు ప్రభుత్వం, అధికారులు పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్లో హమాలీ పనులు చేస్తున్న కార్మికులకు ప్రమాదం జరిగినపుడు ప్రభుత్వమే వైద్యాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో యధేచ్ఛగా పుస్తకాల అమ్మకాలు

### బయటపెట్టిన ఎఐఎస్‌ఎఫ్ నాయకులు




**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.. పాఠశాలల్లోనే స్టోర్ రూంలు ఏర్పాటు చేసి పుస్తకాలు విక్రయాల దందా మొదలుపెట్టారు. జిల్లా కేంద్రంలో స్రవంతి, శ్రీ చైతన్య ప్రైవేట్ పాఠశాలల్లో అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న విషయాన్ని ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గుర్తించి స్టోరూం తాళాలు పగులగొట్టి పాఠశాలల్లో విక్రయానికి దాచివున్న పుస్తకాలను విద్యాశాఖకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలమాల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణలు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేటు వ్యయజమాన్యాలు ఇష్టానుసారంగా పుస్తకాలు అమ్ముతుంటే విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫామ్ అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సూర్యతేజ, శివాజీ, గణేష్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించిన పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలు ఏలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలలో బుక్స్ డ్రెస్సెస్ స్టేషనరీ సామాగ్రి అత్యధిక ధరకు విక్రయిస్తున్నందున వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాల విక్రయిస్తున్న పట్టించుకున్న దాఖలు కనిపించడం లేదన్నారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలలు యదేచ్ఛగా నడుస్తున్న జిల్లా విద్యాధికారి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రైవేట్ పాఠశాల పక్కన కేవలం పాఠశాల పుస్తకాలు అమ్మడానికి మాత్రమే బుక్‌స్టాళ్లకు అనుమతులు ఇస్తున్నారని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పర్యవేక్షణ లేకుండా అవగాహన లేకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి బాలసాని లెనిన్, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, స్టాలిన్, సుమన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జిల్లెల్లా ప్రశాంత్ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ సిపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు చంద్రయ్య సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని జనగాం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు బొంగు చంద్రయ్య(89) అనారోగ్యంతో 19న రాత్రి మృతిచెందారు. చంద్రయ్య మృతదేహానికి శుక్రవారం సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి సత్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మబిక్షం, గులాం రసూల్‌తో కలిసి అనేక పోరాటాల్లో చంద్రయ్య పాల్గొన్నాడని గుర్తు చేశారు. పార్టీ అభివృద్ధికి ఆయన సేవలు మరువలేనివన్నారు. జనగాం గ్రామంలో గీత పనివార్ల సంఘం మొట్టమొదటి సమావేశం ఏర్పాటు చేసి సంఘం బలోపేతానికి, గీత కార్మికుల హక్కులకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్, దేశిడి నరేందర్‌రెడ్డి, బి.జగన్, దుబ్బాక భాస్కర్, పందుల యాదగిరిగౌడ్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, బొమ్మరబోయిన లాలు, మొగుదాల సత్తయ్య, శంకరయ్య, గాలయ్య, మంచాల జంగయ్య, కొండూరు విప్లవ్, కప్పల నరసింహ, రెహమాన్, మంచాల సైదులు, కొండూరు స్వామి, కొండూరు మల్లేష్, బైకని రాజు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ డిపో డ్రైవర్ల పోరాటానికి ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక ధోరణులకు వ్యతిరేకంగా ఉద్యమించిన మెదక్ డిపో డ్రైవర్లకు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న సంఘీభావం ప్రకటించారు. డ్రైవర్ల కొరతతో ఉన్న డ్రైవర్లపై విపరీతంగా పనిభారం పెరిగిపోయిందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు తెలిపారు. డ్రైవర్ విధులేకాకుండా కండక్టర్ విధులను కూడా డ్రైవర్‌లతో చేయిస్తూ, వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఎంటిడబ్ల్యూ యాక్ట్‌ప్రకారం కాకుండా చట్టవ్యతిరేకంగా డ్యూటీ చార్టులు వేసి, ప్రశ్నించిన వారిని వేధింపులకు యాజమాన్యం గురి చేస్తోందని విమర్శించారు. ఒక్క మెదక్ డిపోలోనే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో డ్యూటీలన్ని చట్ట వ్యతిరేకంగానే ఉన్నాయని మండిపడ్డారు. ఒకవైపు ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోయిన కారణంగా టిమ్స్ డ్యూటీ చేయడం డ్రైవర్లకు గగనంగా మారిందని వాపోయారు. ఈ పోరాటంతో మిగతా కార్మిక వర్గం కూడా జాగృతమై సమ్మెలకు దారి తీసే ప్రమాదం ఉన్నదని యాజమాన్యం గ్రహించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచకపోవటంతో ఉన్న బస్సులలో విపరీత రద్దీతో ఆర్‌టిసి కార్మికులపై తీవ్ర ఒత్తిడి, పనిభారం పెరిగిందన్నారు. వీటన్నిటిని గమనించకుండా కిందిస్థాయి అధికారులు అడిగినవారిని బదిలీల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని, మొండి వైఖరికిపోతే సంస్థకు జరిగే నష్టానికి కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## చెరువుల ఆక్రమణలపై సమగ్ర క్షేత్రస్థాయి సర్వే

### చెరువుల పూర్వస్థితికి కృషి
### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** చెరువుల ఆక్రమణలపై సమగ్ర క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రేటర్ హైదరాబాద్, అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో గల చెరువులు, కుంటలపై సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టిజిఆర్‌ఎసి) రిమోట్ సెన్సింగ్ సాంకేతికత ద్వారా 2014 నుంచి 2023 వరకూ ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలకు సంబంధించిన నివేదకను విశ్లేషించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2014కు పూర్వం 417చెరువులు, కుంటలు ఉన్నాయని, అందులో 182 చెరువులు కుంటలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని, మరో 76 చెరువులు, కుంటలు పాక్షికంగా ఆక్రమణల కు గురైనట్లు టిజిఆర్‌ఎసి తన నివేదికలో స్పష్టం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్ పరిధిలో మొత్తంగా 503 చెరువులు కుంటలు ఉండగా.. ఇందులో 62 చెరువులు పూర్తిగా అక్రమణలకు గురయ్యాయని, మరో 102 చెరువులు, కుంటలు పాక్షికంగా ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. వీటికి అదనంగా 2014 నుంచి 2023 వరకూ.. గ్రేటర్ హైదరాబాద్‌లోని 417 చెరువులకుగాను 11 చెరువులు పూర్తిగాను, మరో 7 చెరువులు పాక్షికంగాను ఆక్రమణకు గురయ్యాయని, ఇక గ్రేటర్ నుంచి అవుటర్ పరిధిలో గల 503 చెరువులలో 27 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురికాగా మరో 24 చెరువులు పాక్షికంగా ఆక్రమించబడినట్లు తేలిందని టిజిఆర్‌ఎసి తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ రకంగా గ్రేటర్, ఔటర్ పరిధిలో గల మొత్తం 920 చెరువులు, కుంటలకు గాను 282 పూర్తిగా ఆక్రమణకు గురి అయ్యాయని, మరో 209 చెరువులు పాక్షిక ఆక్రమణకు గురి అయినట్లు ఆయా సంవత్సరాల ఉపగ్రహ చిత్రపటాలు, సర్వే ఆఫ్ ఇండియా వారి టోపోషీట్‌ల రిమోట్ సెన్సింగ్ సాంకేతిక పరిజ్ఞానం, పరిశీలన ద్వారా స్పష్టమైందని తేలింది. చెరువులు కుంటలు ఆక్రమణాలకు సంబంధించిన టోపోషీట్‌లను, చిత్రపటాలను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు ఈ ఆక్రమణలపై సమగ్ర క్షేత్ర స్థాయి సర్వే ద్వారా వాటిని పూర్వ స్థితికి పునరుద్ధరించడానికి చర్యలు చేపడతామని తెలియజేసారు. సమావేశంలో టిజిఆర్‌ఎసి సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్ పి.మనోహర్, సైంటిఫిక్ ఆఫీసర్స్ ఆర్‌ఎస్.బాలకృష్ణ, పి.ప్రకాష్, అశ్విని కుమార్‌దాస్, ఏఓ అధికారి ఆర్‌ఎన్ చారి పాల్గొన్నారు.

## సింగరేణి బ్లాకుల వేలం రద్దు చేయాలి

### శ్రావణపల్లి బ్లాకును సింగరేణికే కేటాయించాలి
### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సింగరేణి బ్లాకులను వేలం వేయడాన్ని రద్దు చేసుకోవాలని, సింగరేణిలో రాజకీయ జోక్యం పక్కన పెడదామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీ గా చూడకూడదని, లక్షలాదిమంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. విభజన హామీల్లో భాగంగా బిజెపి ప్రభుత్వం సింగరేణికి సహకరిస్తానని చెప్పడం జరిగిందని బయ్యారం ఉక్కు పరిశ్రమ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పిన, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఫీజుబులిటీ లేదని చెప్పడం జరిగిందన్నారు. తెలంగాణలో అతిపెద్ద సంస్థగా ఉన్న సింగరేణి ఆర్థికంగా సహకరించకుండా సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థను నిర్వీర్యం చేయడం కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సింగరేణి ఖర్చుపెట్టుకొని ఓవర్ చేస్తున్న బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని, అదేవిధంగా శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. నూతన గనుల అనుమతులన్నీ కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉన్నాయని వాటిని అనుమతించాలని కోరారు. నాలుగు బ్లాకులను శ్రావణపల్లి మణుగూరులో ఓసి టు బ్లాకులు సింగరేణికి రాకపోతే 2030లో సింగరేణి అక్కడ మూతపడే ప్రమాదం ఉందని దానితో అక్కడ పనిచేసే వేలాది కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి బొగ్గు శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ప్రధానమంత్రితో మాట్లాడి తెలంగాణను మిగతా రాష్ట్రాలతో చూడకుండా విభజన అంశాలను నెరవేర్చే విధంగా చూడాలని కోరారు. అలాంటిది చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు చేస్తూ ఒకరి మీద ఒకరు నిందలు వేసుకొని సింగరేణి బ్లాకులను ప్రైవేటుపరం చేస్తున్నారని తెలిపారు. సింగరేణి సంస్థ వేలం పాల్గొనకుండానే బ్లాక్‌లను అప్పజెప్పే విధంగా చూడాలన్నారు. సింగరేణి వేలం టెండర్లు అంశం సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, శ్రీనివాస్ మంత్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో 24 లక్షల మంది విద్యార్థుల అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. నీట్‌ను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. నీట్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు తక్షణమే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని లేకపోతే వారిని తెలంగాణ రాష్ట్రం పర్యటించకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి మాట్లాడుతూ నీతులే చెప్పే బిజెపి నేతలు వారి ప్రభుత్వహాయంలోనే అక్రమాలు జరిగితే ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. వెంటనే విచారణ చేపట్టి అక్రమాల వెనుక ఉన్న వారి గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## కేజ్రీవాల్ బెయిల్‌కు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ మంజూరు చేసింది. లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయవచ్చని ఆదేశించింది. అయితే ఈ తీర్పుపై హైకోర్టులో అప్పీలు దాఖలు చేయడానికి వీలుగా దానిని 48 గంటలపాటు పక్కనపెట్టాలని ఇడి విజ్ఞప్తి చేసింది. ఆ వినతిని ట్రయల్ కోర్టు తిరస్కరించింది. శుక్రవారం ఆయన తీహార్ జైలు నుంచి విడుదల కావాల్సి ఉంది. ఈ క్రమంలో ఇడి హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దర్యాప్తు సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 'బెయిల్‌ను వ్యతిరేకించేందుకు మాకు సరైన అవకాశం లభించలేదు. వెకేషన్ బెంచ్ మా వాదనలను వినిపించేందుకు సరిపడా సమయం ఇవ్వలేదు' అని ఇడి తరఫు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు హైకోర్టుకు తెలిపారు. ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించి, తమ పిటిషన్‌పై అత్యవసర చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు దీనిపై శుక్రవారమే విచారణ జరుపుతామని వెల్లడించింది. అప్పటివరకు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను అమలుచేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేజ్రీవాల్ ప్రస్తుతానికి జైలు నుంచి విడుదలయ్యే అవకాశం లేకుండా పోయింది.

**బెయిల్ ఆర్డర్ అప్‌లోడ్ కాకముందే.. ఇడి కోర్టుకెలా వెళ్లింది?: సునీత కేజ్రీవాల్ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) తీరుపై శుక్రవారం సునీత కేజ్రీవాల్ మండిపడ్డారు. ఢిల్లీలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు శుక్రవారం భోగల్‌లో చేపట్టిన నిరాహార దీక్షలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా సునీత మాట్లాడుతూ తన భర్త, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ ఆర్డర్‌ను ట్రయల్ కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకముందే ఇడి ఎలా సవాలు చేస్తుందని ప్రశ్నించారు. దేశంలో నియంతృత్వం హద్దులు దాటిందని అసహనం వ్యక్తంచేశారు. సిఎం స్థాయిలో ఉన్న కేజ్రీవాల్‌ను ఉగ్రవాదిలా చూస్తున్నారన్నారు. హైకోర్టు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.

## ఎపి స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

(మొదటి పేజీ తరువాయి)

నాదెండ్ల మనోహర్, టిజి భరత్, డోలా బాల వీరాంజనేయస్వామి, బిసి జనార్ధన్‌రెడ్డి, సవిత, గుమ్మడి సంధ్యారాణి, కందుల దుర్గేశ్, ఎన్‌ఎండీ ఫరూక్ ప్రమాణం చేశారు. పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, వాసంసెట్టి సుభాష్ తదితరులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మిగతా సభ్యులు ప్రమాణం చేశారు. వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం జగన్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రమాణం చేసిన అనంతరం జగన్ సభలో ఉండకుండా ఛాంబర్‌కు వెళ్లిపోయారు. అంతకుముందు అసెంబ్లీ వెనుక గేటు నుంచి ప్రాంగణంలోకి జగన్ వచ్చారు. గతంలో ఆయన సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మందడం మీదుగా సభకు వచ్చేవారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. శుక్రవారం 172 మంది ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించారు. అందుబాటులో లేకపోవడం, ఇతరత్రా కారణాలతో ముగ్గురు ప్రమాణ స్వీకారం చేయలేదు. వారిలో పితాని సత్యనారాయణ, వనమాడి వెంకటేశ్వరరావు, జీవీ ఆంజనేయులు ఉన్నారు. ఆ ముగ్గురితో శనివారం ప్రమాణం చేయించనున్నారు.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం రోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com



హైదరాబాద్ : సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబరి హెచ్‌ఈ చాంగ్ జే–బోక్ బృందం. చిత్రంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## 26న మున్సిపల్ మజ్దూర్ యూనియన్ వార్షికోత్సవం



ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్మికుల న్యాయమైన హక్కుల కోసం ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు జి.సంజీవ్ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టియుసి అనుబంధం) వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ అన్నారు. ఈనెల 26వ తేదీన సంఘం వార్షికోత్సవాన్ని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్‌తో కలిసి ఆదిల్ షరీఫ్ తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## సిఎం రేవంత్‌రెడ్డితో ఆర్‌టిసి కార్మిక సంఘాల నేతల భేటీ



ప్రజాపక్షం /హైదరాబాద్ : ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో టిజి ఆర్‌టిసి, ఎస్‌డబ్ల్యూయు, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు కె.రాజిరెడ్డి, డి.గోపాల్, ఇ.వినాయకరెడ్డి, బిఎస్‌రాజు, కె.రవీందర్‌రెడ్డి, కె.దశరత్ కలిశారు. క్యాబినెట్ మీటింగ్ నేపథ్యంలో సిఎంను కలిసి మెమొరాండం ఇచ్చారు. 2013 వేతన సవరణ బాండ్ల డబ్బులు మిగతా వారికి వెంటనే చెల్లించాలని, ఆర్‌టిసిలో యూనియన్లను అనుమతించాలని, విలీన కమీటీలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని తదితర డిమాండ్లతో మెమోరాండం అందజేశారు. బడ్జెట్‌లో3శాతం నిధులను కేటాయించాలని, 2017 వేతన సవరణ అరియర్స్ డబ్బులు వడ్డీతో కలిపి 5సంవత్సరాలవి చెల్లించాలని కోరారు.కొత్తబస్సులను కొనాలనీ, కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. పాత టైమ్స్ స్థానంలో అప్‌గ్రేడ్ చేసిన కొత్త టైమ్స్ సప్లై చేయాలని, రిటైర్ అయిన వారికి తెల్లరేషన్ కార్డ్ ఇవ్వాలని కోరారు. ఆర్‌టిసి కార్మికులకు కూడా ఆసరా ఫెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు, మెడికల్ అన్ ఫిట్ అయిన వారి కుటుంబ సభ్యులకు, రెగ్యులర్ ప్రాతిపాదికన ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## జైలులో మాజీ డిసిపిని కరిచిన పిల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో ఉన్న మాజీ టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావును పిల్లి కరిచింది. దీంతో తీవ్ర రక్తస్రావమైన రాధాకిషన్‌రావును నారాయణగూడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన రాధాకిషన్‌రావును రిమాండ్ ఖైదీగా జైలులోని కృష్ణా బ్యారక్ తరలించారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో బ్యారక్‌లోకి చొరబడిన పిల్లి రాధాకిషన్‌రావుపై దాడి చేసి కరిచింది. అతను అరవడంతో జైలు సిబ్బంది అప్రమత్తమై బ్యారక్ తాళాలు తెరిచి జైలు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రాధాకిషన్‌రావును జైలుకు తరలించారు.

**వార్తల్లో వాస్తవం లేదు : సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్**

మాజీ డిసిపి రాధా కిషన్‌రావుపై వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. బ్యారెక్‌లోనే రాధాకృష్ణన్‌రావు క్షేమంగా ఉన్నాడు. రాధాకిషన్‌రావుకు పిల్లి కరిచిందని వస్తున్న వార్తలు అబద్ధం.. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన రాధాకృష్ణన్‌రావు జైల్లో క్షేమంగా ఉన్నాడు.

## మాతృ ఫౌండేషన్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వితరణ

తారకనాథ్ వర్ధంతిని 'యూనియన్ డే' గా నిర్వహణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాస్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, దివంగత వై తారకనాథ్ 20వ వర్ధంతి సందర్భంగా 'యూనియన్ డే'గా నిర్వహించారు. ఎల్ సిపిసియూనిట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత వై తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం యూనియన్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్‌బిఐఎస్‌యూహెచ్‌సి ఆధ్వర్యంలో అంధులకు, అనాథులకు సేవలందిస్తున్న సఫిల్‌గూడలోని మాతృ ఫౌండేషన్‌కు కూలర్లు, హాట్ ప్యాక్లు, కుక్కర్లు, కిరాణా వస్తువులతో పాటు బ్రెయిలీ లిపిలో వివిధ సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, యుటిలిటీ వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజియన్, రీజినల్ సెక్రటరీ నాగభాస్కర్, ఎస్‌బిఐ ఎస్‌యూహెచ్‌సీ ప్రెసిడెంట్ సిహెచ్ శ్రీధర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ, సికింద్రాబాద్ రీజియన్ ఆర్ శ్రీరామ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు 'దక్కన్ ఛాయ్'

ప్రజాపక్షం/హైదరాబాద్: టీ ప్రియులకు, నిరుద్యోగ యువకులకు ఇది శుభవార్త. శ్రేయ గ్రూప్ సంస్థ 'దక్కన్ భాయ్' వ్యాపారంలో కూడా ప్రవేశించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు, వీరన్నలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిద్ర లేవగానే ప్రతి ఒక్కరు టీ తాగాలని అనుకుంటారని, ఎక్కడ రుచిగా దొరుకుతుందా అని ఎదురు చూస్తుంటారని, అలాంటి ఛాయ్ ప్రియుల కోసం దక్కన్‌ఛాయ్ ప్రవేశపెట్టామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామ్మోహన్, సాయిచరణ్, రాజేష్,సాయిరాం, రవిపాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలి : ఎంపిడిఓ



ప్రజాపక్షం/యాచారం : ప్రజా సమస్యలను పరిష్కరిండంలో అధికారులు ముందుండి పనిచేయాలని ఎంపిడిఓ నరేంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నల్ల వెల్లి గ్రామంలో వివిధ శాఖల అధి కారులతో గ్రామ సభ నిర్వహించారు. ఈసంధర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామంలో ఎఎ సమస్యలున్నాయో అధ్యయనం చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. గ్రామంలో ఎక్కడెక్కడా ఎ సమస్యలున్నాయనే విషయాలను గ్రామ ప్రజలు అధికారులకు వివరించారన్నారు. కరంటు, మిషన్ భగిరథ వాటర్ సమస్యను పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. గ్రామంలో ఉపాధి కూలీలందరికి పని కల్పించడానికి తమ వంతుగా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి లక్ష్మి పతిగౌడ్, పంచాయతీ రాజ్ ఎఈ ఉస్మాన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇల్లు ముట్టడి

నీట్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్

విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి



ప్రజాపక్షం/హైదరాబాద్: నీట్ పరీక్షతో నష్టపోయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించాలని ఐక్య కార్యాచరణ సమితి నిర్ణయించింది. విద్యార్థులకు న్యాయం చేయకపోతే కిషన్ రెడ్డి తన కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని తెలిపింది. హైదరాబాద్‌లోని ఒయులో శుక్రవారం ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఎంఎల్‌సి బల్మూరి వెంకట్,(ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు), మూర్తి (ఎస్‌ఎఫ్‌ఐ. రాష్ట్ర అధ్యక్షుడు), నెల్లి సత్య(ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు), ఎస్.నాగేశ్వరరావు(పిడిఎస్‌యు యూనివర్సిటీల జాతీయ కోఆర్డినేటర్), పి.మహేష్(పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు), ఎం.అరుణ్‌కుమార్ (విజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు),. బోడా అనిల్ నాయక్(ఎపిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు), కోటా రమేష్(డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు), కల్లూరు ధర్మేంద్ర(ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి), కెవెస్ ప్రదీప్(పివైఎల్‌రాష్ట్ర అధ్యక్షుడు), ఎస్‌కె సలీం పాషా(వైజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు), రాజీవ్ రెడ్డి (యువజన కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్) రవి, (పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి) మాట్లాడారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, ఈ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ( ఎన్‌టిఎ) వ్యవరించిన తీరు కూడా పలు అనుమానాలకు తావునిస్తుందని విమర్శించారు. హర్యానాలో ఒకే సెంటర్‌లో 8మందికి టాప్ ర్యాంక్లు వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరీక్షలు రాసిన చాలామంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు నీట్ పరీక్ష అవకతవకలపైన సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా చూడాలని కేంద్ర భూగర్భ, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని లిఖితపూర్వకంగా అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి ఆహ్వానం రాలేదని వారు మండిపడ్డారు.

## పేదలకు అండగా నిలబడిన వారే నిజమైన నాయకుడు

ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/షాద్‌నగర్ :పేదలకు అండగా నిలబడిన వాడే నిజమైన నాయకుడని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూక్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బిఆర్‌ఎస్ నాయకులు చెరుకు శివ ఆధ్వర్యంలో చెరుకు ఈశ్వరమ్మ జ్ఞాపకార్థంగా నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో నిరు పేదలకు అండగా నిలబడే శివ లాంటి వ్యక్తులు యువకులు ప్రజలకు సేవలందించేందుకు ముందుకు రావాలని చెప్పారు. పార్టీలో క్రమశిక్షణతోఉండి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించే వారికి భవిష్యతుల మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో శేఖర్, రుద్రవీణ పాఠశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.



## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్రం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్ : నీట్ పరీక్ష లీకేజీలపై సిబిఐ విచారణ జరిపించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం షాద్‌నగర్ ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో కేంద్రప్రభుత్వం చెలగాటం అడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని, ప్రశ్నపత్రం లీకేజీ విషయంలో బాధ్యులైన వారికి కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, చెన్నయ్య, అందేమోహన్, హరినాథ్ రెడ్డి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర

ప్రొఫెసర్ కోదండరామ్



ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్ర జరుగుతుందని ఫోఫెసర్ కోదండరామ్ ఆరోపించారు. రాష్ట్ర గవర్నర్‌గా నియమించేందుకు తెలంగాణ వ్యతిరేకులను తెరపైకి తీసుకవచ్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించక ముందు తెలంగాణ రాకుండా అడ్డుకున్న నాయకుడికి గవర్నర్‌గా పొందే అర్హత లేదన్నారు. తెలంగాణ ప్రజల అభిప్రాయం మేరకు తెలంగాణకు నూతన గవర్నర్‌గా నియమించాలని ఆయన వివరించారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా టిజెఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ వాదులు, టీజేఏసీ ప్రజా సంఘాల నాయకులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వ పరిపాలనపై దృష్టిసాధించాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆలోచనలకు అనుకులంగా పరిపాలన చేస్తే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వ పరిపాలన పై తెలంగాణ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అప్రమతంగా ఉండి తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించడం ఓ ఎత్తు అయితే ... రాష్టాని అభివృద్ధి చేయడం మరో ఎత్తని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ సాధించామని అహంకారంతో ధనిక రాష్ట్రంగా ఉన్నా తెలంగాణ అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. నాయకులు ఎవ్వరూ శాశ్వతం కాదని, వారి ఆలోచనలు శాశ్వతంగా నిలిచిపోతాయని చెప్పారు.

**జయశంకర్‌సార్‌ను అవమానించిన కెసిఆర్‌కు గుణపాఠం**

ఫ్రొఫెసర్ జయశంకర్ సార్‌ను అవమానించిన కెసిఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం నేర్పించారని పేర్కొన్నారు. తెలంగాణ జాతిపితగా జయశంకర్ సార్ ఆశయాలను నాశనం చేసిన కెసిఆర్‌ను ప్రజలే ఫాంహౌస్‌కు పంపారన్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్న వారు తప్పని సరిగా శిక్ష అనుభవించి తీరుతారన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/వనస్థలిపురం : యోగాతోనే సంపూర్ణమైన ఆరోగ్యం ఉంటుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ రాజీవ్ గాంధీ పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రావు, ఉపేందర్‌రెడ్డి, ఎంకే గౌడ్, అశోక్, రవీందర్‌రెడ్డి, ఆనంతరెడ్డి, శ్రీశైలం, హనుమంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఓంరెడ్డి, రాజేష్, ప్రభాకర్‌రెడ్డి, శరత్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకరయ్య గౌడ్, జైపాల్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

**యాచారం :** మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించకుని యోగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి. వ్యాయామ ఉపాధ్యాయులు మహ్మద్ సాబెర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సురేశ్, భాగ్యజ్యోతి, సుజాత, స్వప్న, జాబిన్, అరుణజ్యోతి, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



**హైదరాబాద్ :** లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం, ప్రపంచ సంగీత దినోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఆరోగ్య సలహాదారు డాక్టర్ పి.మురళికృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల యోగా శిక్షకులు కరుణాకర్‌రావు పాఠశాలలోని విద్యార్థులకు యోగాసనాలను చేయిస్తూ వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ జోసఫ్ పసల మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా అనేది ప్రధాన పాత్ర పోషిస్తుందని మనిషి మానసిక, శారీరక వికాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు.

**నార్సింగి:** యోగ దివ్య ఔషధమని యోగ చేయడం వలన ఆరోగ్యంగా ఉంటామని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఏంజిఐటి కాలేజ్ లో ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగ చేశారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ కమీషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్స్ సునీత గణేష్, ఆదిత్య రెడ్డి, మేనేజర్ యోగేష్, కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ కే.సుధాకర్‌రెడ్డి, ఫ్రొఫసర్ బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు

బిఆర్‌ఎస్ నేతల విమర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోయాయని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో వరసగా జరుగుతున్న సంఘటనలు పోలీసులపై విశ్వాసం సన్నగిల్లేలా చేస్తున్నాయని బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. చెంచు మహిళపై అత్యాచారం ఘటనలో బండి శివ అనే వ్యక్తి ప్రమేయం ఉన్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే భాదిత మహిళకు రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో ఘటనలో కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లోనే మహిళా విషం తీసుకుని చనిపోయిందన్నారు. పోలీస్ ఉన్నతాదికారులు తక్షణమే స్పందించి, భాద్యులైన స్థానిక పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో హోం, విద్య శాఖలకు మంత్రులు లేకపోవడం దురదుష్టకరమని ప్రవీణ్ కుమార్ అన్నారు. చెంచు మహిళపై వారం రోజుల పాటు అత్యాచారం జరుగుతున్నా పోలీసు వ్యవస్థ ఏం చేస్తున్నట్టు అని ఆయన ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్‌లో మహిళకు రక్షణ లేకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి 40 రోజులు అవుతున్నా దోషులను పట్టుకోలేదన్నారు. హైదరాబాద్‌లో 24 గంటల్లో ఐదు హత్యలు జరిగాయన్నారు. మెదక్‌లో మత కల్లోలాలు జరిగినా పోలీసులు చోద్యం చూశారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యం కొటొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. శాంతి భద్రతల్లో వైఫల్యం చెందిన రేవంత్‌రెడ్డిని సిఎం పదవి నుంచి కాంగ్రెస్ అధిష్టానం బర్తరఫ్ చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ డిఎస్‌పిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నా సిఎం దృష్టి రాజకీయాలపైనే ఉందని గువ్వల బాలరాజు ఆరోపించారు. చెంచు మహిళపై అత్యాచారం జరిగినా సిఎం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. మహిళా కుటుంబానికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

## భోజన ప్రియులు జాగ్రత్త..!

జీషాన్ రెస్టారెంట్‌లో కుళ్లిన, చికెన్, మటన్, మేక కాళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : ఓ రెస్టారెంట్‌లో కుళ్లిన బిర్యానీ సరాఫరా అని ఓ పత్రికలో వచ్చిన వార్త కథనంపై స్పందించిన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బిజెఎంసీ కమిషనర్ బి.శరత్ చంద్ర అధికారులతో కలిసి శుక్రవారం జీషాన్ రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో రెస్టారెంట్ నుంచి కుళ్లిపోయిన చికెన్, మటన్, పాయ తయారికి ఉపయోగించే మేక కాళ్లను సీజ్ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ బి.శరత్‌చంద్ర మాట్లాడుతూ రెస్టారెంట్ యాజమానికి 10వేల రూ.ల జరిమానా విధించమన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవద్దని నాణ్యత లేకుండా పరిశుభ్రత పాటించని యెడల రెస్టారెంట్‌ను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. హోటళ్ల,రెస్టారెంట్ల యాజమానులు తప్పని సరిగా నాణ్యత కల్గిన ఆహారాన్ని వినయోగదారులకు అందించాలని, పరిశుభ్రతను కూడా కచ్చితంగా పాటించాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## యాజమాన్య నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణం : ఎఐఎస్‌ఎఫ్



ప్రజాపక్షం/తుర్కయంజాల్: నారాయణ కళాశాల యాజమాన్య నిర్లక్ష్యమే విద్యార్థి మృతి కారణమని రంగారెడ్డి జిల్లా ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆరోపించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి కోహెడ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి గిరీష్ కుమార్ కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విద్యార్థి మృతి విషయం తెలిసికొని ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కాకశాల ముందు విద్యార్థి గిరీష్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. శివకుమార్, గ్యార క్రాంతినారాయణ మాట్లాడుతూ యాజమాన్య నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణం అని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు భద్రత ఇవ్వని ఇలాంటి కార్పోరేట్ కళాశాలలను వెంటనే సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశివర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, జిల్లా నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## సాగు చేస్తున్న పంటల వివరాలు తప్పనిసరి నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి

ప్రజాపక్ష/షాబాద్ : సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పని సరిగా మండల వ్యవసాయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జూన్ మొదటి మాసంలోనే వర్షాలు రావాడంతో విత్తనాలు నాటడం జరిగింది. మొక్కలు వచ్చినప్పటి నుండి వర్షాలు లేక ఎండిపోతున్నాయని జిల్లా వ్యవసాయ అధికారికి ఆవేధన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడకుండ వాతవరణ పరిస్థిలను గమనిస్తూ పంటలను సాగు చేయాలని సుచించారు. విత్తనాలు నాటే ముందు వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లా అధికారిణి వెంట మండల ఎఈవో రాజేశ్వరి, రైతులు ఉన్నారు.





## వారంలోగా సర్వే పూర్తి కావాలి
### కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లాలో మిషన్ భగీరథ యాప్ వారంలోగా సర్వే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఖిల్లా ఘనపూర్ మండల పరిధిలోని ఘనపూర్ , జంగమ్మయపల్లి, పామిరెడ్డిపల్లి, సోలిపూర్ గ్రామాలలో మిషన్ భగీరథ సర్వే పనులను, ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిషన్ భగీరథ సర్వే వేగంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సర్వే పక్కాగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సైతం వేగంగా పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు, లైట్లు తదితర కనీస సౌకర్యాలు పాఠశాలల్లో అందుబాటులోకి తేవాలన్నారు. పంచాయతీరాజ్ కార్య నిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## అన్యాక్రాంత ప్రజా ఆస్తులు ప్రజలకే అంకితం : ఎంపి మల్లు రవి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** గత ప్రభుత్వం హయాంలో అన్యాక్రాంతమైన ప్రజా ఆస్తులను , భూములను ప్రజలకే అంకితం చేస్తామని నాగర్కర్నూల్ ఎంపీ డా. మల్లురవి అన్నారు. నాగర్కర్నూల్ ఎంపిగా గెలిచి తొలిసారి శుక్రవారం వనపర్తి నియోజకవర్గంకు విచ్చేసినడా. మల్లురవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా ఎంపీ డా. మల్లురవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల్లో ప్రజలను ఎంత ప్రలోభపెట్టిన, తమపై నమ్మక ముంచి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా ఇదే విధంగా స్పష్టమైన మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రజా క్షేత్రంలో ప్రజాస్వామ్యంకు వ్యతిరేకంగా ఎటువంటి సిద్ధాంతం లేని నియంతృత్వ పరిపాలనను చోటు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ , మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ , పుట్టపాక మహేష్ , పాకనాటి కృష్ణ, పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ , బ్రహ్మం, ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ , శంకర్ ప్రసాద్ , డా. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిద్దాం : ఎమ్మెల్యే యెన్నం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిద్దామని మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, సత్తూరు చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శిసిరాజ్ ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యోగా దినోత్సవం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పతాంజలి యోగా సమితి, భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో మ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైద్యాధికారి డా.కృష్ణ, వి.మనోహర్ రెడ్డి, పాండురంగం, ఎల్.గంగాధర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యోగా నిత్య జీవితంలో భాగం కావాలి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** యోగ అనేది నిత్య జీవితంలో ఒక భాగం కావాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆర్. లోక్ నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అయిష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించండి : ఎమ్మెల్యే యెన్నం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బికె రెడ్డి కాలనీలో ప్రశాంతి నికేతన్ ఉన్నత పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మనందరం కలిసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్ స్థాయిలో విద్య వ్యవస్థను మహబూబ్‌నగర్ ను బలోపేతం చేయాలని అందుకు సంపూర్ణ మద్దతు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్.అనిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, బెజ్జుగం రాఘవేందర్, కిషన్ నాయక్ ఉన్నారు.

## బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను
# కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది

### కెటిఆర్ ట్వీట్‌కు సిఎం రేవంత్‌రెడ్డి స్పందన
### బొగ్గు మాత్రమే కాదు తెలంగాణ ప్రజల ప్రతి హక్కు కోసం పోరాడుతామని స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని కాంగ్రెస్ నాయకులు, క్యాడర్ అంతా కేంద్ర ప్రభుత్వం లేదా గత కెసిఆర్ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ లేదా తెలంగాణ ప్రజల వాటాలను విక్రయించడాన్ని ఇప్పటికీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క గారు సింగరేణి బ్లాక్‌లను మరింత ప్రైవేటీకరించడం, వేలం వేయడాన్ని వ్యతిరేకించడమే కాకుండా అవంతిక, అరబిందోలకు విక్రయించిన బొగ్గు బ్లాక్‌లను రద్దు చేసి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. తెలంగాణ ప్రజలు, వారి ప్రయోజనాలు, వారి ఆస్తులు, హక్కులు, భవిష్యత్తు కాంగ్రెస్‌తో సురక్షితంగా ఉంటాయని, తెలంగాణ బొగ్గు మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజల ప్రతి ఒక్క హక్కు కోసం పోరాడుతామన్నారు. సింగరేణి, ఓఆర్ఆర్ రింగ్ రోడ్ కలెక్షన్ హక్కులను అమ్మిన వ్యక్తి ఇప్పుడు మాట్లాడుతున్నాడని కెటిఆర్ గురించి సిఎం ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండి బొగ్గు బ్లాకుల వేలంపాట కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి హాజరయ్యారని బిఆర్ఎస్ మాజీ మంత్రి కెటిఆర్ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్‌కు ముఖ్యమంత్రి ప్రతిస్పందిస్తూ పైవిధంగా ట్వీట్ చేశారు. సింగరేణి బ్లాక్‌లను విక్రయించే మొదటి, రెండవ విడతలను కేంద్ర ప్రభుత్వం కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అరబిందో, అవంతిక అనే రెండు కంపెనీలకు విక్రయించారని, బిఆర్ఎస్, కెసిఆర్ ఎప్పుడూ సింగరేణి బ్లాక్‌లను విక్రయానికి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. గత పదేళ్లుగా కోట్లాది మంది తెలంగాణా ప్రజలు మాట్లాడిన మాటలను బిఆర్ఎస్ పట్టించుకోలేదన్నారు.

# హెల్త్ పాలసీపై త్వరలోనే ప్రభుత్వం కీలక నిర్ణయం

### ప్రైమరీ, సెకండరీ హెల్త్ విభాగాలను బలోపేతం చేస్తాం
### మంత్రి దామోదరం రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హెల్త్ పాలసీపై కీలకమైన నిర్ణయం తీసుకోబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖమంత్రి దామోదరం రాజనర్సింహ్మా వెల్లడించారు. ప్రైమరీ, సెకండరీ హెల్త్ విభాగాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో అన్ని ధరలు పునర్ స్థిరీకరణ చేస్తామన్నారు. ఆరోగ్య పథకాలకు సంబంధించిన గ్యాప్స్ ఎక్కడ ఉన్నా వాటిని బలోపేతం చేస్తామన్నారు. పేదలకు ప్రమాణాలతో కూడిన విద్య మెరుగైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ బాధ్యత అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో శుక్రవారం ఆయన రూ.16 కోట్ల 68 లక్షల అభివృద్ధి పనులను, రూ. 13.97 కోట్లతో నూతనంగా ఏర్పాటుచేసిన అత్యాధునిక ఎంఆర్ఐ స్కాన్ యంత్రాన్ని, రూ. 2 కోట్ల 16 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక కిచెన్‌ను, రూ. 55 లక్షల జనరల్ మెడికల్ బ్లాక్‌లో ఓపి కేంద్రాన్ని ప్రారంభించారు. రూ. 5 కోట్ల 90 లక్షలతో ఉస్మానియా ఆస్పత్రిలో మార్చురి ఆధునీకరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స చేయాల్సి ఉందన్నారు. సమస్యలు ఉన్నప్పటికీ ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారని అన్నారు. గత పాలకులకు టీమ్స్ ఆస్పత్రుల నిర్మాణంపై ఉన్న శ్రద్ధ ఉస్మానియా ఆస్పత్రిపై లేకుండే అని విమర్శించారు. ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనపై సిఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో 1951లో నిర్మించిన జిఎన్ఎం నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనాన్ని నిర్మిస్తామని హామీనిచ్చారు. కొత్త భవనం నిర్మించడం, కట్టకపోవడం అనే ప్రశ్న లేదన్నారు. కొత్త సచివాలయం నిర్మించడం, పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టడం కాదని, పేద వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. విజన్ ఉండాలని, ఉస్మానియా హైదరాబాద్‌కి షాన్ అన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన అనేది గుర్తుకు రావాలన్నారు. అహంకారం కాదని, తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన మెడికల్ విద్యను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి. అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్సిలు ఎం.ఎస్. ప్రభాకర్, వాణిదేవి, స్థానిక శాసనసభ్యులు రాజాసింగ్, స్థానిక కార్పొరేటర్ శంకర్ యాదవ్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఉస్మానియా ఆస్పత్రి సూపరిటెండెంట్ నాగేందర్‌లు పాల్గొన్నారు.

# అవాస్తవ కథానాలపై మంత్రిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వానికి ప్రతియేటా రూ. 40 వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుతున్న తెలంగాణ బ్రూవరీస్ కార్పోరేషన్ను కొందరు వ్యక్తులు మీడియాను ఆయుధాంగా చేసుకొని అబాసుపాలు చేయాలని జరుగుతున్న ప్రయత్నాలపై శుక్రవారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును తెలంగాణ బ్రెవరీస్ కార్పోరేషన్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు, తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు కలిసి వాస్తవాలను జరుగుతున్న అసత్య ప్రచారాలపై మంత్రి గారికి వివరించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణలో మరియు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఎక్సైజ్ లైసెన్స్ కలిగి ఉన్న మద్యాం, బీరు ఉత్పత్తి సంబంధించిన బ్రూవరీ, డిస్టలరీ వారికి సంబంధించిన మద్యాన్ని, బీరును సరఫరా చేయాలని భావించినపుడు తెలంగాణ ఎక్సైజ్ శాఖ వద్ద ముందస్తుగా అనుమతి తీసుకొని తెలంగాణలో ఎగుమతి, దిగుమతి, రవాణ, అమ్మకాలకు సంబందించి టిజిబిసిఎల్ కార్పోరేషన్తో ఒక ఒప్పందాన్ని కుదూర్చుకొని వ్యాపారాన్ని కొనసాగించాల్సి ఉంటుందని తెలిపారు. తెలంగాణ బేవరేజెస్ కార్పోరేషన్ ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఒక టెండర్ కమిటీ ఉంటుంది. ఆ కమిటిలో పదావి విరమణ పొందిన హైకోర్టు న్యాయమూర్తి, పదవి విమరణ పొందిన ఐఎఎస్, కంపెనీ సెక్రటరీ, మరియు సీఏల ద్వారా ధ్రువీకరించబ డినటువంటి లైసెన్స్ కలిగిన కంపెనీలకు వారి పూర్వ ఉత్పత్తుల పై సరపతిరాపైనా, తయారీ ఖర్చులపై వివిధా రాష్ట్రాలలో సదారు బ్రాండ్ ఉన్న ధారలను అధ్యాయనం చేసి వాటిని మాత్రమే తెలంగాణలో సరఫరా చేసుకొవడానికి, కమిటీ సిపారసు చేస్తుంది. ప్రభుత్వ నిబంధలకు అనుగణంగా మాత్రమే కార్పోరేషన్ అనుమతులు ఇస్తుంది. నిబంధనలను అతిక్రమించి కార్పోరేషన్లో ఉన్న ఏ అధికారి కూడ ఉల్లంఘించే అవకాశం లేకుండా నియమనింధానలను రూపోందించడం జరిగిందని తెలిపారు.. ఈ మేరకే ఎక్సైజ్ శాఖచే అనుమతులు పొంది తెలంగాణలో బీర్ల అమ్మకాల కొరకుసప్లయిర్లు రిజి స్ట్రేషన్లు చేసుకుంటారు. ఇటివల కొత్తగా రిజి స్ట్రేషన్ చేసుకున్న అయా బ్రూవరీలు ఎటువంటి బీరు అమ్మకాలను చేపట్టలేదు. నిర్ణిత విధానాల్ని అనుసరించిన అనంతరమే టిజిబిసిఎల్ అనుమతులు ఆయా బ్రూవరీస్కు అనుమతులు ఇచ్చారని, కాని వివిధ పత్రికల్లో వరుస కథానాలను దృశ్య గౌరవ మంత్రి జూపల్లి కృష్ణారావు గారి అదేశాను సారం కొత్తగా ఇచ్చిన అనుమతలన్నంటిని కార్పోరేషన్ రద్దు చేసిందని, పునర్ పరిశీలన కోరకు ప్రభుత్వానికి నివేదించింది. మంత్రిని, కమిషనర్ను కలిసిన వారిలో తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదారి జి .టి. జీవన్, అధ్యాక్షుడు, బ్రూవరీస్ కార్పోరేషన్ ఉద్యోగుల సంగం ఎం. కాశీనాథ్, ఉపాధ్యాక్షులు డి. శ్యామ్ కుమార్, అడ్వైజర్ జి . శ్రీనివాస రావు, ఉపాధ్యాక్షులు జి . సురేందార్, అర్జునావు, స్టేట్ కోఆర్డినేటర్ జి . మురళీ. మహిళ కార్యదార్శి బి. అంశ, సతీష్, కనకయ్య, తిరుపతి రెడ్డి, మంచిర్యాల శ్రీనివాస్, వినోద్ కుమార్, కవిత, రేణుక, పుష్పలత, పద్మా తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# మాతృ మరణాలు నివారించాలి

### జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి
### మాతృమరణాలపై సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** జిల్లాలో మాతృమరణాలు జరగకుండా నివారించాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో మాతృమరణాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవ సమయంలో వివిధ కారణాలతో మరణిస్తున్న గర్భవతులను, సరైన సమయంలో మెరుగైన వైద్యం అందించి సంరక్షించాలన్నారు. వైద్య చికిత్సలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, డాక్టర్లకు వైద్య సిబ్బందికి సరైన శిక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాతృమరణాలు జరగకుండా నివారించాలని ఆమె సూచించారు. జిల్లాలో 2021–22 సంవత్సరంలో 27, 2022–23 సంవత్సరంలో 11, 2023–24 సంవత్సరంలో 11 మాతృమరణాలు సంబవించినట్లు, ఈ మరణాలకు ప్రసవ సంబంధ కారణాలు, ఇతర కారణాలతో జరిగినట్లు తెలిపారు. సమీక్షలో మరణాల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, మరణించిన వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు చేస్తూ, సరైన సమయంలో వైద్యం అందిస్తూ, తీసుకోవాల్సిన పోషకాహారం పై గర్భవతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రసవానంతరం ప్రతి కేసును పర్యవేక్షణ చేయాలన్నారు. ఈడిడి కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఏఎన్సి పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. సీరియస్ కేసుల విషయంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ, అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మాతృఆరోగ్య సంరక్షణ ప్రోగ్రాం అధికారి డా.భాస్కర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కృష్ణ, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జీవన్ మాతా సంరక్షణ కేంద్రం హెచ్‌డిఓ డా.రాధ, ఐఎంఏ అధ్యక్షులు డా.రాంమోహన్, వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## పెబ్బేరు అభివృద్ధికి కృషి : ఎంపి

**ప్రజాపక్షం / పెబ్బేరు :** రాష్ట్ర స్థాయిలో ఎమ్మెల్యే జాతీయ స్థాయిలో ఎంపీగా నేను వనపర్తి నియోజకవర్గాన్ని , ముఖ్యంగా పెబ్బేరును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు విజయోత్సవ ర్యాలీలో నాగర్కర్నూల్ ఎంపి డా. మల్లు రవి ఎంపిగా అఖండ విజయం సాధించి మొట్ట మొదటిసారిగా వనపర్తి నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పెబ్బేరు జాతీయ రహదారి బైపాస్ వద్ద ఆయనకు స్వాగతం పలుకుతూ భారీ మోటార్ సైకిల్ల ర్యాలీతో పెబ్బేరు పట్టణానికి స్వాగతించారు. మొదటగా డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎంపీ , ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అనంతరం పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీ కార్యకర్తలను, ప్రజలను అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు. పెబ్బేరు మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని పెబ్బేరు సంతకు సంబంధించిన భూమిని కాపాడుతామని, పెబ్బేరు పట్టణంలో 30 పడకల ఆసుపత్రిని నిర్మించి తీరుతామని పెబ్బేరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సంయుక్తంగా కష్టపడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , పార్టీ శ్రేణులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని మాడుగుల మండలానికి చెందిన సయ్యద్‌సమీరా పదోతరగతిలో 9.7మార్కులు సాధించగా పైచదువులకు కల్వకుర్తి సియాఫౌండేషన్ చైర్మన్ సయ్యద్‌అంజాద్ విషయం తెలుసుకొని సమీరాకు అండగా సియాఫౌండేషన్‌తరఫునుంచి రూ.30వేలు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్, కాంగ్రెస్‌పార్టీటౌన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ మక్బూల్, సియాఫౌండేషన్ కమిటిసభ్యులు జిలాని, శ్రీనివాస్‌రెడ్డి, శనవాజ్‌ఖాన్, ఇంతియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

## నలుగురు వ్యక్తులు రిమాండుకు తరలింపు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని శ్రీవెంకటేశ్వరక్రషర్‌లో ఈనెల16న పేలుడుకు సంబంధించిన పరికరాలు చోరీకి గురయ్యాయని యజమాని వెంకట్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తులోభాగంగా కొందరు వ్యక్తులను విచారించగా వేలిముద్రల ఆధారంగా వరికుప్పల కుమార్, వరికుప్పలబాబు, వరికుప్పల ఈదమయ్య, వరికుప్పలశేఖర్, దేరంగుల నర్సింహ్మాచోరికి పాల్పడ్డారని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రవిలు పేర్కొన్నారు. చోరీకిగురైన పరికరాలను నిందితులనుండి రికవరిచేసి ఐదుమందిపై కేసు నమోదుచేసి నలుగురిని రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.

# 'కారు'లో కలవరం

### కాంగ్రెస్‌తో టచ్‌లో మరికొంత మంది ఎంఎల్ఎలు..?
### సిట్టింగ్‌లను కాపాడుకోవడంలో గులాబీ విఫలయత్నం..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్‌కు ఊహించని షాక్ తగిలింది. బిఆర్ఎస్ బాన్సువాడ ఎంఎల్ఎ, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం, మరోవైపు ఉప్పల్ ఎంఎల్ఎ లక్ష్మా రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలువడంతో 'కారు'లో కలవరం మొదలైంది. సిట్టింగ్ ఎంఎల్ఎలను పార్టీ మారకుండా బిఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలు విఫమలవుతున్నాయి. ఒక్కొక్కరుగా పార్టీ వీడేందుకు సిద్ధపడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే 20 మంది ఎంఎల్‌లు కాంగ్రెస్‌లో చేరుతారని ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానంనాగేందర్ వ్యాఖ్యనించడం బిఆర్ఎస్ వర్గాల్లో మరింత ఆందోళన మొదలైంది. లక్ష్మీ పుత్రునిగా చెప్పుకునే పోచారం శ్రీ నివాస్ రెడ్డి పార్టీ మారబోరని చివరి వరకు బిఆర్ఎస్ వర్గాలు ఎంతో ఆశ పెట్టుకున్నాయి. కానీ మారుతున్న తాజా రాజకీయ పరిణామాలు, ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పోలైన ఓటింగ్ శాతం, అవినీతి ఆరోపణలు, పలు కేసుల నేపథ్యంలో కొందరు ముఖ్యనేతలు, మరి కొందరు ఎంఎల్ఎలు తమ రాజకీయ భవిష్యతుపైన ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మరి కొందరు నేతలు తమ వారసుల రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాజకీయ నిర్ణయాలు తీసుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన కొందరు ఎంఎల్ఎలను కొందరు మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు సంప్రదించినట్టు తెలుస్తోంది. శాసనసభ బడ్జెట్ సమావేశాల వరకు బిఆర్ఎస్‌కు చెందిన కొందరు ఎంఎల్ఎలతో బిఆర్ఎస్ఎల్‌పిని సిఎల్‌పిలో విలీనమయ్యేలా చూడాలని, లేదా కనీసం మెజార్టీ ఎంఎల్ఎలను బిఆర్ఎస్‌కు దూరంగా ఉండేలా చూసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బిఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర నిస్తేజానికి గురి చేసింది. పార్లమెంట్‌లో ఒక్క సీటు కూడా గెలువకపోవడం,పైగా ఓటింగ్ శాతం విపరీతంగా తగ్గింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై బిఆర్ఎస్ ముఖ్యనేతలు సమీక్షించి, పార్టీశ్రేణుల్లో భరోస ఇవ్వలేకపోతుందని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు.



## వాహనాల తనిఖీ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ , కల్వకుర్తి డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఆదేశాలమేరకు ఎలాంటి నెంబర్‌ప్లేట్లులేని , అసంపూర్తిగా నెంబర్‌ప్లేట్లుకలిగిన వాహనాలను, మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నటువంటి వాహనాలను స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి తనిఖీలుచేసి పోలీసులు అదుపులోకి తీసుకొనివాటిపై చలానాలు విధించి సరైనటువంటి వాహననెంబర్‌ప్లేట్లను వాహనాలకి పెట్టుకోవాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈవాహన తనిఖీలలో కల్వకుర్తి సీఐ నాగార్జున, కల్వకుర్తి ఎస్ఐలు మాధవరెడ్డి, రామ్‌చందర్, పోలీసు సిబ్బంది స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా ఎలాంటి నెంబర్‌ప్లేట్లులేని వాహనాలను అదేవిధంగా మైనర్‌డ్రైవింగ్ చేస్తున్నటువంటి వాహనాలను మద్యంసేవించి డ్రైవింగ్ చేస్తున్నటువంటి వాహనాలను అదుపులోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## నిరుద్యోగులకు ఉపాధి చూపడమే లక్ష్యం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధిచూపడమే రత్నగిరిఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్‌డైరెక్టర్ జూపల్లి అరుణ్ అన్నారు. రత్నగిరిఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన 20మంది నిరుద్యోగ మహిళలకు హైదరాబాద్‌లో నిర్వహించే డ్రోన్‌పైలట్‌శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూపల్లి అరుణ్‌పాల్గొని మాట్లాడుతూ పోటిప్రపంచంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని యువతకు టెక్నికల్‌రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హైదరాబాద్‌లో తారయువిఏ ప్రైవేట్‌లిమిటెడ్ సహకారంతో ఎంపిక చేసిన 20మంది యువ మహిళలకు అన్నివసతులతో రత్నగిరిఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ మెంబర్స్ సతీష్, తారయువిఏ మేనేజింగ్‌ట్రైనర్స్ విజయ్, శ్రీనాథ్, రత్నగిరిఫౌండేషన్ కన్వీనర్ కేతూరిధర్మతేజ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంతగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామాన్ని శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట ఎంఎల్ఎ డాక్టర్‌వంశీకృష్ణ పర్యటించి పశువైద్యశాలను ప్రారంభించారు. రూ.80కోట్లనిధులతో గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినివాసంలో అధికారులతో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎంఎల్ఎ డాక్టర్‌వంశీకృష్ణ రివ్యూమీటింగ్ నిర్వహించారు. అక్టోబర్ నాటికి గ్రామంలో చేపట్టినటువంటి అభివృద్ధిపనులు పూర్తికావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికమిటి చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, జడ్పిటిసి కెవిఎన్‌రెడ్డి, కాంగ్రెస్‌మండలపార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, తహసీల్దార్ కిరణ్‌మై, పశువర్ధకశాఖ ఏడి పశువైద్య అధికారి డాక్టర్ అజిత్‌చంద్ర, కాంగ్రెస్‌మండలపార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాల వేలం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ నియోజకవర్గ ఎక్సైజ్‌స్టేషన్‌పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ఏడు ద్విచక్రవాహనాలను జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.సుధాకర్‌రావు సమక్షంలో కొల్లాపూర్ ఎక్సైజ్‌స్టేషన్‌లో గురువారం వేలంవేయగా రూ.1,22,800 వచ్చిందని కొల్లాపూర్ ఎక్సైజ్‌సీఐ నాగిరెడ్డి తెలిపారు. ఏడు వాహనాలకు ప్రభుత్వం రూ.75వేల రూపాయలు నిర్ణయించగా వేలంద్వారా రూ.1,22,800లు జిఎస్‌టి రూ.21,270 మొత్తం రూ.1,44,076 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని తెలిపారు.



## స్నేహితుని కుటుంబానికి అండగా తోటిస్నేహితులు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రానికిచెందిన బైక్‌మెకానిక్ నార్లకంటి పాండు ఇటీవల మృతిచెందారు. తనతోకలిసి చదువుకున్న పదోతరగతి తోటి స్నేహితులు ఆ కుటుంబానికి అండగానిలిచి మృతుడు పాండు కుమార్తె పేరు మీద రూ.60వేలను డిపాజిట్‌చేశారు. భవిష్యత్తులో ఆకుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వెల్దండ రవీంద్రచారి, వేణు, సురేష్, శ్రీనివాస్, రమేష్‌చారి, శ్రీనివాస్, వెంకటయ్య, లింగమయ్య ఉన్నారు.

## గోల్డ్ మోడల్ సాధించిన విద్యార్థికి సన్మానం



**ప్రజాపక్షం / కొడంగల్:** జాతీయ స్థాయిలో ఇటీవలే షాట్‌పుట్‌లో గోల్డ్ మోడల్ సాధిం చిన కొడంగల్ విద్యార్థికి శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్మానం చేసి సత్కరించారు. కొడంగల్ మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన సాయి కిరణ్ అనే విద్యార్థి జాతీయ స్థాయిలో ఇటీవలే జరిగిన షాట్‌పుట్ పోటీలలో పాల్గొనగా గోల్డ్ మోడల్ సాధించి తెలంగాణ ఖ్యాతిని ప్రదర్శించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సాయికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించి సత్కరించి అభినందించారు.

## జిల్లా ఎస్‌పిగా కె.నారాయణరెడ్డి బాధ్యతుల స్వీకరణ



**ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా ఎస్‌పిగా కె.నారాయణరెడ్డి శుక్రవారం బాధ్య తులు స్వీకరించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను కపడంటంలో ప్రత్యేక చర్యలు తిసుకుంటనాని అన్నారు. యాక్సి డెంట్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. అనంతరం వికారాబాద్ జిల్లా కేంద్రంలోఉన్న శ్రీ అనంతపద్మనాభ స్వామి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘననివాళి



**పజాపక్షం/చర్లపల్లి :** తెలంగాణ తొలిదశ ఉద్యమకారుదు,సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 13వ వర్ధంతిని పురస్కరించుకుని చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేస్ జయశంకర్ చౌరస్తాలో ఆయన విగ్రహనికి ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డితో కలసి మాజీ ఎంఎల్‌ఎ బేతి సుభాష్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో సిఐఎ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి,వెంకటేశ్వరరెడ్డి,నాయకులు మోహన్‌రెడ్డి, మహేష్, డి నాథం, రామకృష్ణగౌడ్, సహదేవగౌడ్, ఎజాజ్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోనీ సారె గూడెం ఆల్కాలిక్ మెటల్స్ కంపెనీ గేట్ మీటింగ్ కు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. ఆల్క లిక్ కంపెనీ ఉద్యోగుల సంక్షేమం కొరకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో మాట్లాడతానని ఆయన అన్నారు. సోమవారం జరిగే యూనియన్ ఎన్నికల్లో ఎం. రాము గౌడ్ పానెల్ ని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష అభ్యర్థి, కౌన్సిలర్ ఎం.రాము గౌడ్, మాజీ జెడ్పి వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమా మాధవ రెడ్డి, ఉద్యోగులు, కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దవాఖానల్లో మందులు లేక ఇబ్బందులు

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లపల్లి రాములు




**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ రాజీవ్ గృహకల్ప, హనుమాన్‌నగర్ అస్బెస్టిస్ కాలనీ, బస్తి దవఖానాల్లో బీపీ షుగర్ మం దులు లేక పేద ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని డిహెచ్‌పిఎస్ నాయ కులు రాములు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నాలుగు దవా ఖానాల్లో నేను తిరిగి డాక్టర్లను అడగగా పైనుంచి మాకు మందులు రావడం లేదని సమాధానం ఇవ్వడం గమనఅర్థం ఇప్పుడు వర్షాకాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా రెగ్యులర్ గా వాడే మందులతో పాటు, డెంగ్యూ మలేరియా సర్ది దగ్గు అన్ని మందులు బస్తి దావకానాలో ప్రజలకు అందుబాటులో ఉంచి తక్షణమే పరిష్కరించే విధంగా డాక్టర్లు నర్సులు అందుబాటులో ఉండేటట్టు చూడాలని పై అధికారులను కోరడం జరిగింది.

## అంధుల ఆశ్రమానికి వితరణ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సఫిల్‌గూడలోని మాతృ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సంస్థలో ఆశ్రయం పొందు తున్న అంధులు, అనాథల కోసం కూలర్లు, హాట్ ప్యాక్‌లు, కుక్కర్లు, కిరాణా వస్తువులు, బ్రెయిల్ లిపిలో ఉన్న పాఠ్య పుస్తకాలను సేవా భావంతో అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి దివంగత వై.తారకనాథ్ 20వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన యూనియన్ డే సందర్భంగా బ్యాంకు సికింద్రాబాద్ రీజియన్ సెక్రటరీ ఎస్ నాగ భాస్కర్, యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ శ్రీధర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సికింద్రాబాద్ రీజియన్ సెక్రటరీ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## జీరోబిల్ రానివారు దరఖాస్తు చేసుకోవాలి

నవాబుపేట్ మండల ఎంపిడిఒ అనురాధ

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తు శుక్రవారం వరకు మొత్తం 148 దరఖాస్తులు అందినాయని ఎంపిడిఒ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గృహ జ్యోతి పథకం కింద లబ్ధిదారులకు విద్యుత్ 200 యూనిట్ల లోపు ఉన్నవారికి ప్రభు త్వం జీరో బిల్లును ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. ఎవరికైతే జీరో బిల్లు రాలేదో వారందరూ ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ పెట్టినట్లు తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో నుండి ఇప్పటివరకు 148 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. ఎవరికైనా జీరో బిల్లు రాకుండా ఉన్నట్లయితే ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌ఓసి అందజేత

**ప్రజాపక్షం/తాండూరు :** ఆనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబానికి రూ.2.50వేల ఎల్‌ఓసి తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అందజేశారు. బషీరాబాద్ మండల పరిధి కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఈడిగి రాములుగౌడ్ గత కొన్ని రోజుల క్రితం ఆనారోగ్యానికి గుర్తైన విషయం తెలిసిందే ఆనారోగ్యానికి గురైన రాములు గౌడ్ హైదరాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్ రెడ్డి బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.2.50లు మంజూరు చేస్తూ ఎల్‌ఒసిని అందజేశారు.

# అబ్దుల్‌మియా కుంటపై చర్యలు లేనట్టేనా?

**కుంట కబ్జా అవుతున్న జాడలేని ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు**



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని శంబిపూర్ గ్రామంలో గల అబ్దుల్ మియాకుంట సర్వేనెంబర్ 142 విస్తీరణ 2ఎకరాల 20 గుం టల రెవెన్యూ రికార్డులలో ఉంది. ఇది దాదాపు కుంటను కబ్జా చేసి నిర్మాణా పనులు జరుగుతున్న అధికారులు అటు వైపు చూడకపోవడం గమనార్హం. ఇటీవలే పలు దిన పత్రికలలో వార్త కథనాలు వచ్చిన అధికారులు స్పందించడం లేదు. తూతూ మం త్రంగా ఇరిగేషన్ అధికారులు పరిశీలించి నెలలు గడుస్తున్నచర్యలకు వెను కడుగు వేస్తున్నట్లు పలువురు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై స్థానికులు విమ ర్శిస్తున్నారు. కుంటాలను టిపర్‌లతో మట్టినీ నింపి కుం టాను కనుమరుగు చేసిన అధి కారులకు కనిపించడం లేదా అని ప్ర జలు ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి కనుమరుగైపోతున్నట్లు తెలిపారు. ఇంత జరుగు తున్న చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుంటలలో కబ్జాలను అడ్డుకొని రక్షించుకోవాలని ఉన్నతాధికారులను ప్రజలు గ్రామస్తులు కోరుతున్నారు.

## కళాకారులకు ప్రోత్సాహం అవసరం

మలేషియా యూనిటీ డిప్యూటీ మినిస్టర్ సరస్వతి కందస్వామి



**ప్రజాపక్షం/దుండిగల్ :** కళాకారులకు ప్రోత్సాహం అవసరం అని మలేషియా యూనిటీ డిప్యూటీ మినిస్టర్ సరస్వతి కందస్వామి అన్నారు. అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన అమృతవల్లిని ఆమె అభినందించి, అంతర్జాతీయ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం నృత్యకారులకు, జబర్దస్త్ కమెడియన్ సునామీ సుధాకర్, గాయకులు సుప్రీం శేఖర్, యుతి హర్షవర్ధన, వే ఫౌండేషన్ అధినేత పైడి అంకయ్యలకు జ్ఞాపి కలు, ప్రశంసాపత్రాలను ఆమె అందజేశారు. మన సంస్కృతి, మలేషియా ప్రత్యేక ప్రతినిధి కళాకారులకు ప్రోత్సాహం ఉందన్నారు. తన మాతృ భాష తెలుగులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతైనా అవసరం ఉందని మలేషియా యూనిటీ డిప్యూటీ మిని స్టర్ సరస్వతి కందస్వామి అన్నారు. మలేషియా రాజధాని కులాలంపూర్ సోమవారం యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైకేషన్ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మసీద్ ప్రాంతంలో వాసులు ఎదురుకుంటున్న నీటి సమస్య తెలుసుకున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్‌రెడ్డి సీఎం సహాయనిధి నుండి స్పెషల్ డెవలప్ ఫండ్ (5 లక్షల రూ) మంజూరు చేశారు. 2 బోరెవెల్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పోలీస్ జివెందర్ రెడ్డి, పి.ఏ.సి మాజీ చైర్మన్ బెంబిడి మల్లారెడ్డి, నర్స రెడ్డి బాల్ రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సి సెల్ చైర్మన్ సల్మాన్ రాజ్, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాళాలు తీయాలని సిఎంకు వినతి




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రెవెన్యూ శాఖ మంజూరు చేసిన 83వ సర్వే నంబరు స్థలంలో అనేక సంవత్సరాల క్రితం తమ సభ్యుల సహకారులందించిన నిధులతో నిర్మి ంచుకున్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనానికి తాజా గా ఉప్పల్ మండల తహసీల్దార్ అనుమతులు లేకుండా నిర్మాణం జరిగిందంటూ భవనానికి తాళాలు వేయటం సరైనది కాదని అసోసియేషన్ ప్రతి నిధులు రాములు, స్వామి, సుదర్శన్, అశోక్‌కుమార్, సత్యనారాయణలు వాపో యారు. 200 మంది సభ్యులున్న తమ అసోసియేషన్ నిర్మించుకొన్న ఈ భవనంలో సమీప ప్రాంతాలైన 50కి పైగా కాలనీలకు చెందిన సీనియర్ సిటిజన్లు ప్రతి రోజు ఇక్కడికి వచ్చి యోగా, క్రీడలు, పుస్తక పఠనం చేస్తుంటారన్నారు. రెడ్ క్రాస్ సంస్థ పక్షాన తరచు మెడికల్ క్యాంపులు, గ్రంథాలయాల నిర్వహణ, ఆధ్యాత్మిక కార్యక్ర మాలు జరుపుతుంటాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు సైతం ఈ భవన నిర్మాణానికి సహకరించారన్నారు. ఈ మేరకు తమకు సహకరించాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రజావాణి ద్వారా గతంలోనే విన్నవించామని, మరో మారు సిఎంకు విన్నవించారు.

# రైతులకు ఏరువాక పండుగ

- కాడుద్దుల ప్రదర్శనలతో రైతుల ఆనందోత్సవాలు



**ప్రజాపక్షం/కొడంగల్ :** ఏరువాక పూర్ణిమ మన ప్రాంతంలో రైతులు జరుపుకునే పెద్ద పండుగ.. రైతులకు ఏదైన ప్రత్యేకంగా ఉంది అంటే అది ఏరువాక అని పలువురు గ్రామస్థులు తెలిపారు. సాంప్రదాయ బద్ధంగా రైతులు ఈ పండుగను జరుపుకుం టారని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో అంగరంగ వైభవంగా పండుగను జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం రైతులు తమ కాడెద్దులకు స్నానాలు చేయించి పసుపు, అల్లం, ఉల్లిగడ్డలు తినిపించి ప్రత్యేక పూజలు చేశారు. ఎద్దుల కోమ్ములకు రంగులు పూసి, మోడలో గజ్జెలు, గంట లతో అలంకరించి భక్షాలు తినిపించా రు. ఆ తర్వాత పట్టణంలోని ప్రదాన వీధుల గుండా రైతులు డ్యాన్సులు చేస్తు ఎద్దులను ఊరేగించారు. సాయంత్రం వేళలలో పట్టణంలోని వడ్డర్‌గల్లిలోని చితారు పెరుమళ్ల దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఎద్దుల బండ్లతో ఆలయం చుట్టు ప్రదర్శనలు చేయించారు. చిట్టచివరికి మాజీ ఎంఎల్‌ఏ, రాష్ట్ర పోలీస్ అకాడమి చైర్మెన్ గురునాథ్‌రెడ్డికి కుటుంబానికి సంబంధించిన ఎద్దులతో కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌లు ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించి ప్రదర్శనలు చేయించారు. ఎద్దులతో ఊరేగుతు మామిడి తోరణాలను తెంపించడంతో ఇక నుంచి రైతులు పంట పోలాల్లో పనులు చేసుకుని రైతులు సుఖసంతోషాలతో నిండుఆయుఆరోగ్యాలతో జీవించాలనే



సంకల్పంతో ముందుకు సాగారు.

# యోగతో జీవనశైలి మెరుగు













**ప్రజాపక్షం/మేడ్చల్‌ప్రతినిధి:**ఆధ్యాత్మిక, శారీ రక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచటంలో యోగ సాధన ఎంతో ఉప యోగపడుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా మల్లాపూర్‌లోని యోగముద్ర ఆధ్వర్యంలో జరిగిన యోగా డే కార్యక్రమానికి ఆయనతో పాటు కార్పొరేటర్లు ప్రభు దా స్, పన్నాల దేవేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం యోగ సాధన ద్వారా మన జీవన శైలిని మార్చుకోవటం వల్ల రోగాలు రాకుండా కాపాడుకో వచ్చన్నారు. చిలుకానగర్ బిఆర్‌ఎస్ నాయకులు మధుసుధనరెడ్డి, సర్మోట్ స్కూల్ అధినేత విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చర్లపల్లి :** అంతర్జాతీయ యోగా దినో త్సవాన్ని పురస్కరి ంచుకుని నాగారం సెరినిటీ పాఠశాలలో యోగా సాధనను విద్యార్థులు నిర్వహించారు ఈ సందర్భ ంగా పాఠశాల ప్రధాన కార్య దర్శి నోముల వసంత మాట్లా డుతూ యోగా మన కోసం ప్రతి రోజు చేసిన శారీరకంగా మానసికంగా ప్రశాంతంగా ఉంటామని మన సమాజ శ్రేయస్సు కోసం థీమ్‌తో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాల్సిన అవసరాన్ని తెలియజే శారు. ఈ కార్యక్రమంలో టీచర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

**చర్లపల్లిజైలులో :** ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతగానో ఉపయో గపడు తుందని చర్లపల్లి కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి సంతోష్‌కు మార్‌రాయ్ అన్నారు. శుక్రవారం చర్లపల్లి కేంద్ర కారాగాం ప్రాంగణంలో జైలు అధికారులు, గార్డింగ్,మినిస్ట్రీయల్,వైద్య సిబ్బంది, ఖైదీల కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో సామూహిక యోగా కార్య క్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఉప పర్య వేక్షణాధికారులు కాళిదాస్,శశి కాంత్,జైలర్లు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో:** ప్రతి నిత్యం ప్రజలు యోగా ద్వారా మన జీవనశైలిని మెరు గుపరు చుకోవచ్చునని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,యోగా గురు వులు కుంట్ల బలరాంరెడ్డిలు అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బలరాంరెడ్డి యోగ సాధనలు చేయించారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి ,నాయకులు వేణుగోపాల్, నరేష్, పాల్గొన్నారు.

**దుండిగల్‌లో:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ , ఫార్మసీ కళా శాలలో విద్యార్థుల యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి ఎదుర్కోవటానికి యోగా ఎంతగానో ఉపయో గపడుతుందన్నారు. ఈ కార్య క్రమంలో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులను ఉద్దేశించి యోగ ప్రొఫషనల్ మెహర్ కుషాల్ మాట్లాడుతూ యోగాతో పొందే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం గురించి అవగాహన పెంచడం ఎంతో అవస రమన్నారు. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు. శ్వాస వ్యాయామాలు కూడా ఉంటాయని ఇది ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడానికి సహా యపడుతాయని, విద్యార్థుల యొక్క మానసిక ఆరోగ్యం పెంపొందించే విధంగా యోగ అభ్యసనం ఉపయోగ పడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా।। పి.శ్రీధర్, ప్రిన్సిపాల్ డా।। మురళి ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా।। అర్జబ్ మాలిక్, కళాశాల ఎన్ఎస్ఎస్ విధ్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

**నవాబుపేట్‌లో:** యోగ అనేది ఒక వ్యాయామం కాదు అది తనువును, మనస్సును ఏకంచేసే సాధనమని ఎమ్మార్వో జయరాం అన్నారు. అంతర్జా తీయ యోగా డే సందర్భంగా శుక్ర వారం నవాబుపేట్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహిం చిన యోగా కార్యక్రమాలో మండల తహసిల్దార్ జయరాం, ఎంపిడిఒ అనురాధ, పాల్గొన్నారు. పలు ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగానే సాధనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, ఎంఈఓ గోపాల్, ఏపీవో లక్ష్మీదేవి, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయిని బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### యోగాను ఒక అంతర్భాంగంగా స్వీకరించాలి: డిఎంహెచ్ఒ

ఆరోగ్య సంరక్షణలో భాగంగా మనరోజు వారీ జీవితంలో యోగాను ఒక అంత ర్భాంగంగా స్వీకరించాలని డిఎంహెచ్ఓ అధికారి డాక్టర్ రఘు నాథస్వామి సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్మిని స్ట్రేషన్ అధికారిరామ్ మోహన్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా. సంధ్యా రాణి, డా. సరస్వతి, డా. గీతాప్రసాద్, మంజుల రాజేశ్వరరెడ్డి, ఆయుష్ విభాగ డాక్టర్ ఎ. జంగయ్య, ఘట్‌కేసర్ ఎస్ఎంఓ వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### యోగాతోనే ఆరోగ్య వంతమైన జీవనం సాధ్యం కె.విజయ రాణి

**నిజాంపేట్‌లో :** యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవన శైలి సాధ్యమని విఆర్ఎస్ విజ్ఞాన్ జ్యోతి స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయ రాణి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి విఆర్ఎస్ విజ్ఞాన్ జ్యోతి పాఠశాలలో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరు యోగా ఆసనాలతో ఆరోగ్య కరమైన జీవనాన్ని పొం దాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### యోగాతో ఆధ్యాత్మిక సాధన సాధ్యం: ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** యోగాతోనే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధన సాధ్యమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియో జకవర్గం పరిధిలోని సూరారం డివిజన్ షాపూర్ నగర్‌లోని ఎంజే గార్డె న్స్‌లో శివశక్తి ధ్యాన యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులతో కలిసి యోగా చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, యోగా సెంటర్ నిర్వాహకులు మల్లేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**నిజాంపేట్ కార్పొరేషన్‌లో..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగ తి యోగా సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సెంటర్ సభ్యులు యోగా ఆసనాలు నిర్వహిం చారు. మేయర్ కొలను నీలారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేట ర్ ఆవుల ప్రసన్న, నాయకులు సబితా, మల్లేశ్, అధికారులు పాల్గొన్నారు.

**వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణంలో జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకోని కోర్టు ఆవరణలో యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యానికి యోగ చాలా మేలు చేస్తుందని, యోగ వలన రక్త ప్రసరణ పెరుగుదల మనిషి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. బాడీలో నొప్పితగ్గడం మనషి ఉల్లాసంగా ఉండేందుకు యోగ ఉపోగపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యామూర్తి చంద్రకిశోర్ సీనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి శ్రీకాంత్ అదనపు జునియర్ న్యాయమూర్తి శృతి దూత ,బార్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్ ,వెంకటేష్ న్యాయవాదులు ,కమల్‌రెడ్డి ,యాదవరెడ్డి బస్వరాజ్ పటేల్ ,నాగరాజు ,జగన్ రమేష్‌గౌడ్ మోహన్ రాథోడ్ ,టి.వెంకటేష్ ,కోర్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# క్రీడ



## డక్‌వర్త్ పద్ధతిలో ఆసీస్ విజయం

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా బంగ్లదేశ్‌తో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు సంచలన విజయం సాధించింది. హోరా హోరీగా జరిగిన ఈ పోరులో 28 పరుగులు తేడాతో కివీస్ టీమ్ గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు స్కోర్ చేయగలిగింది. ఆ జట్టు కెప్టెన్ షాంటో (41), తౌహిద్ (40) మాత్రమే రాణించారు. మిగతావారందరూ తమ పేలవ ఫామ్ వల్ల జట్టు అంతంతమాత్రమే స్కోర్ చేయగలిగింది. ఇక ఆసీస్ జట్టులో కమిన్స్‌తోపాటు (3/29) ఆడమ్ జంపా (2/24) తమ బౌలింగ్ స్కిల్స్‌తో ఆకట్టుకున్నారు. మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, మిచెల్ స్టార్క్ తలో వికెట్ పడగొట్టారు. బంగ్లా నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేధించేందుకు బరిలోకి దిగిన ఆసీస్ జట్టుకు కాసేపటి వరకు ఆడినప్పటికీ, వరుణుడు అంతరాయం కలిగించటం వల్ల ఆటకు బ్రేక్ పడింది. దీంతో ఆసీస్‌ను విజేతగా ప్రకటిస్తూ అంపైర్లు నిర్ణయం తీసుకున్నారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆసీస్ 28 పరుగుల తేడాతో బంగ్లాపై విజయాన్ని చేజిక్కించుకుంది.

**కమిన్స్ హ్యాట్రిక్ – మొత్తాని ఇది ఏడోది**

అయితే ఇదే వేదికగా స్టార్ పేసర్ పాట్ కమిన్స్ ఓ అరుదైన ఘనతను అందుకున్నాడు. తాజాగా సూపర్8 పోరులో బంగ్లాదేశ్‌పై హ్యాట్రిక్ వికెట్లు తీసి రికార్డుకెక్కాడు. వరుస బంతుల్లో బంగ్లా బ్యాటర్లు మహమ్మదుల్లా, మహెది హసన్, తౌహిద్ హృదోయ్‌ను వరుసగా ఔట్ చేశాడు. అలా ప్రస్తుత ప్రపంచకప్ టోర్నీలో తొలి హ్యాట్రిక్ నమోదు చేశాడు. అయితే ఓవరాల్‌గా ఇది ఏడోది కావడం విశేషం. ఇదే కాకుండా ఆసీస్ తరఫున హ్యాట్రిక్ తీసిన రెండో బౌలర్‌గానూ కమిన్స్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 2007లో బంగ్లాపైనే బ్రెట్‌లీ హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఐర్లాండ్ బౌలర్ కర్టిస్ క్యాంఫర్ (2021), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ (2021), సౌతాఫ్రికా పేసర్ కగిసో రబాడ (2021), యూఏఈ బౌలర్ కార్తిక్ మైయప్పన్ (2022), ఐర్లాండ్ ఫాస్ట్ బౌలర్ జోష్ లిటిల్ (2022) ఈ జాబితాలో ఉన్నారు.

## ఒలింపిక్స్‌లో కబడ్డీ, ఖోఖో

**జాబితాలో కొత్త క్రీడలు చేర్చాలని భారత్ ప్రతిపాదన**



**న్యూఢిల్లీ :** ఒలింపిక్స్ (2036) ఆతిథ్య హక్కులను పొందడాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే యోగా, ఖోఖో, కబడ్డీ, స్క్వాష్, చెస్, క్రికెట్ వంటి 6 భారతీయ సంప్రదాయ క్రీడలను ఒలింపిక్స్‌లో చేర్చాలని ప్రతిపాదించనుంది. ఈ మేరకు 2024 పారిస్‌లో జరిగే ఒలింపింక్స్ సందర్భంగా ఈ క్రీడల ప్రాముఖ్యతను వివరించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రయత్నిస్తోంది. 2024 పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఒసి)తో 2036 హోస్టింగ్ బిడ్ గురించి కీలక చర్చలు జరగనున్నాయి. ఈ హోస్టింగ్ బిడ్ దక్కించుకోవడానికి భారత క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మిషన్ ఒలిపింక్ సెల్ (ఎంఒసి) ఓ సమగ్ర నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికను కొత్త క్రీడామంత్రి మన్‌సుఖ్ మాండవియాకు తాజాగా సమర్పించింది. ఒకవేళ భారత్ 2036 హోస్టింగ్ రైట్స్ పొందినట్లైతే ఈ 6 రకాల కొత్త క్రీడలను ఒలింపిక్స్‌లో చూడవచ్చు. అలా జరిగితే ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య కూడా పెరిగే ఛాన్స్ ఉంటుంది. 'ఒలింపిక్స్ బిడ్ దక్కించుకునేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో విస్తృతంగా చర్చలు జరపడం అనేది చాలా కీలకం. అయితే ఆతిథ్య హక్కులు పొందడం అంత సులువేం కాదు. హోస్టింగ్ రైట్స్ కోసం ఖతార్, సౌదీ అరేబియా, చైనా, హంగేరి, ఇటలీ, జర్మనీ, డెన్మార్క్, కెనడా, స్పెయిన్, యూకే, పోలాండ మెక్సికో, టర్కీ వంటి దేశాలతో భారత్ పోటీ పడాల్సి ఉంటుంది' అని ఎంఒసి మెంబర్ ఒకరు చెప్పారు. అయితే వచ్చే ఏడాది అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కొత్త అధ్యక్షుడి ఎన్నిక తర్వాతే ఆతిథ్య హక్కులపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే అంతర్జాతీయ ఒలింపిక్స్ నిబంధనల ప్రకారం ఆతిథ్య దేశానికి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ క్రీడలను చేర్చాలని ప్రతిపాదించే హక్కు ఉంటుంది. ప్రతిపాదించే క్రీడలు ఆ దేశంలో బాగా ప్రసిద్ధి చెంది, మిగిలిన 5 ఖండాల్లోనూ ఆ ఆటలు ఆడాలి. ఈ క్రమంలో భారత్ హోస్టింగ్ బిడ్ విజయవంతమైతే ప్రతిపాదించిన ఈవెంట్లను 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్‌లోనే ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.

## అది రోహిత్ శర్మ బలహీనత కాదు: గవాస్కర్



**న్యూఢిల్లీ :** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ తీరుపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ బ్యాటింగ్ టెక్నిక్‌లో ఎలాంటి లోపం లేదని తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. కేవలం 8 పరుగులే చేసి చెత్త షాట్‌తో పెవిలియన్ చేరాడు. తొలి ఓవర్ నుంచే అసౌకర్యంగా బ్యాటింగ్ చేసిన రోహిత్ శర్మ.. ఆఫ్ సైడ పడిన బంతిని లెగ్ సైడ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఇలా పదే పదే రాంగ్ షాట్స్‌తో ఔటవ్వడంపై రోహిత్ శర్మను పలువురు మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పించారు. అయితే సునీల్ గవాస్కర్ మాత్రం రోహిత్ శర్మను వెనుకేసుకొచ్చాడు. 'రోహిత్ శర్మ ఎంతో అనుభవం కలిగిన బ్యాటర్. ఎలా ఆడాలనేది అతనికి తెలుసు. రోహిత్ శర్మ బ్యాటింగ్ శైలిని మార్చుకోవాలని చెప్పడం సరికాదు. ఏ బ్యాటర్ అయినా బౌలర్‌ను బట్టి ఆడుతారు. కొన్ని సార్లు దూకుడుగా వెళ్లినా వికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆఫ్‌సైడ్ వేసిన బంతి లెగ్ సైడ్ ఆడుతున్నాడంటే కారణం ఉండొచ్చు. రోహిత్ శర్మ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టన్నుల కొద్దీ పరుగులు చేశాడు. ఏదొక సమయంలో బ్యాటర్ ఔట్ కావాల్సిందే. అలాగని ఆఫ్‌స్టంప్ బయట వేసిన బంతిని ఆడే క్రమంలో పెవిలియన్‌కు చేరితే దానికి బలహీనతగా భావించనక్కర్లేదు. అంతర్జాతీయ క్రికెట్‌లో 15 వేల పరుగులు చేసి.. 30 లేదా 40 సార్లు ఆఫ్‌స్టంప్ బంతులను ఆడుతూ ఔటైనా సరే ఆందోళన అవసరం లేదు.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు.



## నిరాశతో ప్రభాస్ ఫ్యాన్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ మైథాలజీ మూవీ కల్కి. జూన్ 27, 2024 న వరల్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ కాబోతున్న ఈ పాన్ వరల్ మూవీపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. దీపికా పదుకునే, దిశా పటాని హీరోయిన్స్‌గా నటిస్తుండగా, యూనివర్సల్ స్టార్ హీరో కమల్ హాసన్, బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌లు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ నేడు సాయంత్రం 6:00 గంటలకి రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత 8:00 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు మరో ప్రకటన చేయడం జరిగింది. 8:00 గంటలకికి కూడా ఫైనల్ వార్ పేరిట ట్రైలర్ రాకపోవడంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫ్రస్టేషన్‌లో ఉన్నారు. రిలీజ్ ట్రైలర్ కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, పశుపతి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు. వైజయంతి మూవీస్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రీల్

## 'ధూం ధాం' లిరికల్ సాంగ్ విడుదల

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎం ఎస్ రామ్‌కుమార్ నిర్మిస్తున్నారు. 'ధూం ధాం' సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు సాయికిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'ధూం ధాం' సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్‌గా సాగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'మల్లెపూల టాక్సీ..' పాట ఛాట్ బస్టర్ అయ్యింది. మంగ్లీ పాడిన ఈ పాట ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది. తాజాగా 'ధూం ధాం' సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మాయా సుందరి..' విడుదల చేశారు. ఈ పాటకు సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా..గోపీ సుందర్ మంచి బీట్‌తో కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి పాడారు. 'మాయా సుందరి..హే మాయా సుందరి..నా మాయా సుందరి..ఎక్కడున్నావో మరి..గుప్పెడు గుండెను నువ్వే పట్టుకుపోయావే, నా రె ప్పల నిద్దురనంతా ఎత్తుకు పోయావే..' అంటూ సాగుతుందీ పాట.



## 'కానిస్టేబుల్'గా వరుణ్ సందేశ్



హీరో వరుణ్ సందేశ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'నింద' రిలీజ్ కు రెడీ అయ్యింది. ఈ సినిమాతో వరుణ్ సాలిడ్ హిట్ కొట్టాలని ప్రయత్నిస్తున్నాడు. కాగా, ఈ సినిమా తరువాత తన నెకట్స్ చిత్రాన్ని కూడా రెడీ చేస్తున్నాడు ఈ హీరో. ఆర్యన్ సుభాన్ SK దర్శకత్వంలో 'ది కానిస్టేబుల్' అనే సినిమాలో నిటిస్తున్నాడు వరుణ్ సందేశ్. ఈ సినిమాను జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్ పై బలగం జగదీష్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. కాగా, ఈ సినిమా షూటింగ్ రీసెంట్ గా ముగించారు మేకర్స్. హైదరాబాద్ లో జరిగిన చివరి షెడ్యూల్ తో ఈ మూవీ షూటింగ్ ముగిసినట్లు చిత్ర టీమ్ తెలిపారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో ఒక థ్రిల్లింగ్ ఎలిమెంట్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ సినిమా షూటింగ్ అంతా హాయిగా సాగింది. ఇందులో ఓ కానిస్టేబుల్ పాత్రలో కనిపిస్తాను.. అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ఆర్యన్ సుభాన్ SK మాట్లాడుతూ.. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ గా ఈ సినిమాను తెరకెక్కించాము. వరుణ్ సందేశ్ నట విశ్వరూపం ఈ సినిమాలో కనిపిస్తుంది. త్వరలోనే ఈ సినిమా మోషన్ పోస్టర్, సాంగ్స్ రిలీజ్ చేస్తాం.. అని అన్నారు. ఇక చిత్ర నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ.. ఈ సినిమాకు కథ, కథనాలు అద్భుతంగా కుదిరాయి. పోలీస్ పాత్రలో వరుణ్ సందేశ్ నటన అందరినీ ఆకట్టుకుంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.. అని పేర్కొన్నారు.

## మరో సమరానికి ఇసిఐ సన్నాహాలు

**జమ్మూకశ్మీర్ సహా 3 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు**




**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌తో పాటు హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు మొదలుపెట్టింది. ఆగస్టు 20 నాటికి ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి చేసి తుది జాబితాను ప్రకటించాలని నిర్ణయించింది. ఈమేరకు ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా అవసరమైనచోట కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమవుతుందని ఇసి వెల్లడించింది. జులై 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించనున్నట్లు స్పష్టం చేసింది. జులై 25న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తామని, ఆగస్టు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 20న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొంది. 2018లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ రద్దయిన తర్వాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్ముకశ్మీర్ ఓటర్ల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ క్రమంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని ఇసి నిర్ణయించింది. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించింది. మరోవైపు హర్యానా అసెంబ్లీ గడువు నవంబర్ 11తో ముగుస్తుండగా.. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26, జార్ఖండ్ అసెంబ్లీ గడువు జనవరి 5, 2025తో ముగియనుంది. ఈనేపథ్యంలో వీటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మరోవైపు ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఇసిఐ వారం రోజుల్లో సమావేశం కానుంది.

## నూతన క్రిమినల్ చట్టాల అమలు వాయిదా వేయాలి



**న్యూఢిల్లీ :** హడావుడిగా ఆమోదించిన మూడు నూతన క్రిమినల్ చట్టాలను జూలై 1 నుండి అమలు చేయాలనే నిర్ణ యాన్ని వాయిదా వేయా లని ప్రధాని నరేంద్ర మోదీకి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. ఈ చట్టాలపై పార్లమెంటు మరోసారి సమీక్షించాలని కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీ లేఖ రాశారు. భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ సంక్ష్యా అభియాన్ 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023ల పట్ల ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్ల మె ంటులో 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసి, ఈ మూడు బిల్లులను లోక్‌సభ ఆమోదించిందని ఆ మె గుర్తు చేశారు. ఈ కీలక బిల్లులను ఏక పక్షంగా, ఎలాంటి చర్చ లేకు ండా ఆమో దించారని తెలిపారు. పాత పార్లమెంటు గడువు ముగిసే సమయంలో ఈ బిల్లులను హడా వుడిగా ఆమోదింపజేసుకున్నారని, కాబట్టి ఈ చ ట్టాల అమలు తేదీని వాయిదా వేయడం నైతికంగా, ఆచరణాత్మకంగా కూడా సబబు అని అన్నారు. కీలకమైన చట్టాల మార్పులపై కొత్త ఎన్నికైన పార్లమెంటు వీటిపై తాజాగా చర్చించి, సమీక్షించాలని అన్నారు.

# ఢిల్లీలో వానొచ్చింది



**న్యూఢిల్లీ :** గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఇప్పుడు కాస్త ఉపశమనం లభించింది. శుక్రవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. సాయంత్రం నాటికి ఢిల్లీ, పొరుగున ఉన్న ఎన్‌సిఆర్ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది, ఆ సమయంలో గంటలకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గాలివానకు చెట్లు కూలిపోయాయి. నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 28.4 సెల్సియస్ డిగ్రీలు నమోదు కాగా, ఈ సీజన్ సమయంలో ఇది సాధారణమేనని అధికారులు చెప్పారు. కాగా, శని, ఆది వారాల్లో కూడా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఇది ఢిల్లీ వాసులుకు మరింత ఊరటనిచ్చే అంశమని భారత వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. అదే విధంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 40 సెల్సియస్ డిగ్రీలుగా నమోదైందన్నారు. అయితే ఢిల్లీలో ఉష్ణోగ్రతలు తగ్గితాయని ఐఎండి గురువారం నాడు ప్రకటించింది. కాగా, ఢిల్లీ అధిక ఉష్ణోగ్రతలు, నీటి సంక్షోభంతో కొట్టుమిట్టాడుతుంది. వడగదెబ్బకు నగర వాసులు పిట్టల్లా రాలిపోతున్నారు. గత ఐదు రోజుల్లో ఢిల్లీ, దాని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 50కిపైగా మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే వీరంతా వడదెబ్బకారణంగా మృతి చెందారా లేక ఇతర కారణాలతోనే అనేది పోలీసులు ధృవీకరించలేదు.

**ఢిల్లీ మంత్రి అతిశీ నిరాహారదీక్ష**

ఢిల్లీలో తలెత్తిన నీటి సంక్షోభంపై మంత్రి అతిశీ శుక్రవారం నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. హర్యానా నుంచి మరిన్ని నీటిని విడుదల చేయాలన్న తమ డిమాండ్‌ను మరింత ఉధృతం చేసేందుకు ఆమె దక్షిణ ఢిల్లీలోని భోగల్‌లో దీక్ష చేపట్టారు. దీక్షా కార్యక్రమంలో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ సతీమణి సునీత, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత తీహార్ జైలు నుంచి తన భర్త, సిఎం కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. అతిశీ చేపట్టిన తపస్సు విజయం వంతం కావాలని ఆయన ఆకాంక్షించారన్నారు. దీక్షకు ముందు అతిశీ సునీత, సింగ్, భరద్వాజ్‌తో, ఇతర పార్టీ నేతలతో కలిసి రాజ్‌ఘట్‌లోని మహాత్మాగాంధీకి నివాళి అర్పించారు. దీక్ష ప్రారంభ సందర్భంగా అతిశీ మాట్లాడుతూ హర్యానా ను ంచి తమకు న్యాయబద్ధంగా రావాల్సిన జలాలు రాకపోవడంతో దేశ రాజధాని నీటి సంక్షోభం లో చిక్కుకుందని, త క్షణం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాల ని రెండ్రోజుల క్రితం లేఖ రాసినా ఫలితం లేదన్నారు. దీ ంతో తమకు నిరాహారక్ష తప్ప మరో అవకాశం లేదని చె ప్పారు. హర్యా నుంచి ఢిల్లీ ప్రజలకు నీటిని అందించే వ రకు నరవధిక జల సత్యాగ్రహదీక్ష విరమించబోమన్నారు.

**పర్యావరణానికి హాని కలగకుండా అభివృద్ధి : ప్రియాంకా గాంధీ**

దేశంలోని అనేక ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ స్పందించారు. పర్యావరణానికి హాని కలగకుండా అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. అనేక రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున చెట్లను నరికివేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. మరోవైపు దేశంలో వడదెబ్బ మృతులు అంతకంతకూ పెరుగుతున్నారని, ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డును సృష్టిస్తున్నాయన్నారు. ఈ ఏడాది చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ఏప్రిల్ మాసంలో అధక ఉష్ణోగ్రత నమోదైనట్లు ప్రియాంకా గాంధీ 'ఎక్స్'లో హిందీలో పోస్టు చేశారు. అభివృద్ధి చేయడం తప్పనిసరి అయితే... పర్యావరణాన్ని కూడా పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. అందువల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా మనమందరం కలిసికట్టుగా అభివద్ధి చేయాల్సిన అవసరముందన్నారు.

## వామపక్ష పార్టీల విలీనాన్ని త్రోసిపుచ్చలేం: భట్టాచార్య



**న్యూఢిల్లీ :** భవిష్యత్తులో కొంతకాలం తరువాత వామపక్ష పార్టీల విలీనాన్ని త్రోసిపుచ్చలేమని, అయితే తక్షణ అవకాశాలు మాత్రం లేవని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. రానున్న కాలంలో వాతావరణ సంక్షోభం ప్రధాన రాజకీయ అంశాంగా మారబోతుందని, అప్పుడు వామపక్షాలు మళ్ళీ కీలకంగా మారుతాయని చెప్పారు. విభిన్న వామపక్ష పార్టీల మధ్య విబేధాలు ఉన్నాయని, కాని భారతదేశానికి బలమైన వామపక్ష నిర్మాణం అవసరమని 'పిటిఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో భట్టాచార్య తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల విలీన అవకాశాల గురించి ప్రశ్నించగా,తాను దానిని త్రోసిపుచ్చడం లేదని, అయితే తక్షణ అవకాశాలను మాత్రం లేవని చెప్పారు. భవిష్యత్తులో ఉండవచ్చని, భారతదేశానికి బలమైన వామపక్ష నిర్మాణం అవసర, , కొన్ని రాజకీయ, సైద్ధాంతిక విబేధాలు ఉన్నాయని, చాలా పెద్ద వ్యత్యాసాలు లేనప్పటికీ, విబేధాలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని, సంపూర్ణ విలీనాన్ని ఆశించడం కష్టమేనని వివరించారు. తమ రాజకీయాలు ప్రజల ఆధారిత, పోరాట ఆధారితంగా ఉంటాయని అన్నారు. మావోయిస్టులను ప్రధాన స్రవంతిలోకి రావాలని సలహా ఇస్తారా అనే ప్రశ్నకు దీపాంకర్ భట్టాచార్య సమాధానమిస్తూ వాళ్ళు వారి ఆలోచన ప్రకారం ప్రధాన స్రవంతిలో ఉన్నామనే అనుకుంటారని, కాబట్టి ఏది ప్రధాన స్రవంతో కాదో అని మనం నిర్ధారణకు రాలేమన్నారు. నేపాల్‌లో మావోయిస్టు పార్టీ ఏళ్ళ తరబడి పార్లమెంటరీ రాజకీయాలకు దూరంగా ఉన్నదని, సమయం వచ్చినప్పుడు వారి ఆలోచన, గమనాన్ని మార్చుకున్నారని, కాబట్టి ఇక్కడి మావోయిస్టులు వారి అనుభవం ప్రకారం స్వీయ అంచాన వేసుకుంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలిచేందుకు వామపక్షాలు ఇతరులపై ఆధారపడుతున్నారా? అని ప్రశ్నించగా, అది ఆధారపడడం కాదని, పరస్పర ఆధారితమని చెప్పారు. కూటమిలో తాము లబ్ది పొందినట్లుగానే భాగస్వామ్య పక్షాలు కూడా లబ్ది పొందాయన్నారు.

## ఐదేళ్లలో 45 పరీక్షా పేపర్లు లీక్ : ప్రియాంక

**న్యూఢిల్లీ/ పాట్నా :** పేపర్ లీకేజీల వ్యవహారం దేశాన్ని కుదిపేస్తున్న వేళ.. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ విరుచుకుపడ్డారు. బిజెపి హయాంలో ఇది జాతీయ సమస్య అయిపోయిందని.. కోట్లాది మంది యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. యుజిసి నెట్ రద్దు, నీట్ పరీక్షలో అవకతవకలను ప్రస్తావించిన ఆమె కేంద్ర తీరుపై మండిపడ్డారు. 'గడిచిన ఐదేళ్లలో దేశంలో 43 నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. బిజెపి పాలనలో పేపర్ లీకేజీలు జాతీయ సమస్యగా మారాయి. కోట్లాది మంది యువత భవిష్యత్తును భాజపా నాశనం చేసింది. ప్రపంచంలో అత్యంత యువ దేశం మనది. యువత జనాభా అత్యధికం. యువతకు నైపుణ్యాలు, సమర్థులుగా చేసేందుకు బదులు ప్రభుత్వం వారిని బలహీనులుగా మారుస్తోంది''అని ప్రియాంక గాంధీ విమర్శించారు. 'కోట్లాదిమంది ప్రతిభావంతమైన విద్యార్థులు వివిధ పరీక్షల కోసం రాత్రి, పగలు కష్టపడుతుండగా.. వారి తల్లిదండ్రులు అన్నీ త్యాగం చేసి వారికోసమే బతుకుతున్నారు. నియామకాల కోసం విద్యార్థులు ఏళ్లపాటు వేచిచూడాల్సి వస్తోంది. చివరకు పరీక్షల్లో అవకతవకలతో వారి శ్రమంతా వృథా అవుతోంది'' అని ప్రియాంక అన్నారు. బిజెపి అవినీతి దేశాన్ని బలహీనపరుస్తోందని దుయ్యబట్టారు.

**అసలు సూత్రధారి నీతీష్ కుమార్: తేజస్వీ యాదవ్**

దేశవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు రేపుతున్న నీట్ పేపర్ లీక్ కేసులో బిజెపి తనను ఇరికించాలని ప్రయత్నిస్తోందని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. కేసులో నిందితుడిగా తేలిన వ్యక్తితో తేజస్వి వ్యక్తిగత సహాయకుడికి పరిచయం ఉందని బిజెపి ఆరోపించింది. దీనిపై ఆయన స్పందిస్తూ పేపర్ లీకేజీకి కుట్ర చేసింది రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ అని వ్యాఖ్యానించారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడల్లా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయన్నారు. 'ఈ విషయంలో ఇండియా కూటమి ఐక్యంగా ఉంది. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని మేము కోరుతున్నాం. అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఈ కేసులో నా పిఎను, నన్ను లాగాలనుకున్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. పేపర్ లీక్‌కు అసలైన సూత్రధారులు అమిత్ ఆనంద్, నీతీష్ కుమార్‌లే'' అని తేజస్వి ఆరోపించారు. ప్రధాన నిందితుడికి ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌కు సంబంధం ఉందని బీహార్ డిప్యూటీ సిఎం విజయ్ కుమార్ సిన్హా ఆరోపించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

## నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో

**న్యూఢిల్లీ :** దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యుజి ప్రవేశ పరీక్ష 2024 కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నీట్ పరీక్ష వ్యవహారంపై దర్యాప్తు జరిపించి, ఆ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ దాఖలైన కొత్త పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ శుక్రవారం విచారించింది. వీటిపై దాఖలైన పిటిషన్లను జులై 8 నుంచి విచారించనున్నందున, జులై మొదటి వారంలో మొదలు కానున్న కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. 'నేను కౌన్సెలింగ్‌పై ఎలాంటి స్టే కోరడం లేదు. జులై 6న జరగాల్సిన కౌన్సెలింగ్‌ను రెండు రోజులు మాత్రమే వాయిదా వేయమని అడుగుతున్నా. అది కూడా జులై 8న విచారణ జరగడమే కారణం' అని న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కౌన్సెలింగ్ అనేది ఓపెన్ అండ్ షట్ ప్రక్రియ కాదని, జులై 6న కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ధర్మాసనం చెప్పింది. మొదటి రౌండ్ కౌన్సెలింగ్ వ్యవధి గురించి ధర్మాసనం ప్రశ్నించగా, ఇది ఒక వారం పాటు కొనసాగుతుందని న్యాయవాది చెప్పారు. ఎన్‌టిఏకి కొన్ని ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కూడా వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. జూన్ 23వ తేదీన జరగనున్న రీటెస్ట్ విషయాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది లేవనెత్తారు. రీటెస్ట్‌పై స్టే విధించాలని కోరారు. అభ్యర్థులు మళ్లీ పరీక్షకు హాజరు కావాల్సి వస్తే ఒత్తిడికి లోనవాల్సి ఉంటుందని కోర్టుకు తెలిపారు. ఎన్‌టిఎ కొంత సమాచారాన్ని దాచిపెట్టిందని ఆరోపించారు. 'ఇప్పుడు ఏమీ జరగదు. మే 5 జరిగిన పరీక్షను పక్కన పెట్టే అవకాశం ఉన్నప్పుడు, 1,563 మంది అభ్యర్థులకు మాత్రమే జరగబోయే రీటెస్ట్ కోసం ఎందుకు ప్రశ్న?' అని బెంచ్ ప్రశ్నించింది. దీంతో ధర్మాసనం ఎన్‌టిఎ తరపు న్యాయవాదిని ఆ పిటిషన్‌పై స్పందనను దాఖలు చేయాల్సిందిగా ఆదేశించింది. తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. మేఘాలయలోని ఓ పరీక్ష కేంద్రంలో నీట్‌కు హాజరైన అభ్యర్థులు దాఖలు చేసిన పి టిషన్‌పై కేంద్రంతోపాటు ఎన్‌టిఎకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. పరీక్ష సమయంలో తాము 45 నిమిషాలు నష్టపోయామని, గ్రేస్ మార్కులు పొందిన 1563 అభ్యర్థుల జాబితాలో తమను చేర్చి జూన్ 23న నిర్వహిస్తున్న పరీక్షకు అవకాశం కల్పించాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న అభ్యర్థిని మళ్లీ పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతించేలా ఎన్‌టిఎను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు విచారించింది. ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది.